


న్యూస్-9
సామాజిక అవసరం...సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక
www.news9-india.com





సంపుటి : 13 సంచిక : 57 శనివారం, ఆగస్టు 08, 2026, www.news9-india.com విశాఖపట్నం - హైదరాబాద్ పేజీలు - 12 వెల: 4/-

## చట్టం చేస్తున్నాం...బీసీలకు

# సంరక్షణ కల్పిస్తాం

### - చేనేతలకు మేలు చేసేది... అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే

**● మాది బ్రాండ్ ఇమేజ్... వాళ్లది బ్యాడ్ ఇమేజ్ ● జన్-జీ అభివృద్ధి కోరుకుంటోంది... జనరేషన్ గొడ్డలి కుట్రలు పన్నుతోంది ● 12వ జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు ● చీరాలలో నేతన్న సేవలో పథకం ప్రారంభం ● కుటుంబానికి రూ.25 వేలు చొప్పున 71,536 కుటుంబాలకు రూ. 179 కోట్లు జమ చేసిన సీఎం**



**చీరాల,ఆగస్టు 07:** బీసీల సంరక్షణను చేపట్టే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని... దీనికోసం త్వరలోనే చట్టం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బీసీ సంరక్షణ చట్టం కోసం ముసాయిదా సిద్ధమైందని వెల్లడించారు. శుక్రవారం 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలోని కొత్తపేట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నేతన్న సేవలో సంక్షేమ పథకాన్ని సీఎం ప్రారంభించారు. రాష్ట్రంలోని అర్హులైన చేనేత కుటుంబాలకు రూ. 25 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని సీఎం అందించారు. మొత్తంగా

మిగతా2లో...



## చిన్నతరహా పరిశ్రమలకు

# పెద్దపీట

**● చేతివృత్తులు, రైతులకు మార్కెట్ అవకాశాలు ● బ్రిక్స్ మంత్రుల సమావేశంలో నిర్ణయం**

**● కేంద్రమంత్రి పీయూష్ గోయల్**

**జైపూర్, ఆగస్టు 07:** దేశంలోని చిన్న తరహా పరిశ్రమలు, చేతివృత్తుల కళాకారులు, రైతులు, మత్స్యకారుల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు పెంచేందుకు వీలుగా కేంద్రం సరికొత్త చర్యలు తీసుకుంది. ఇందుకోసం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల

మిగతా2లో...



## అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కఠినతరం

**- కీలక నిర్ణయం దిశగా ట్రంప్ ముందడుగు**

**న్యూఢిల్లీ, ఆగస్టు 07:** అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం నిబంధనలను కఠినతరం చేసే దిశగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక ముందడుగు వేశారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు నుంచి ఎదురుదెబ్బ తగిలిన కొన్ని వారాలకే, ఆ నిబంధనలను పరిమితం చేసేలా రెండు కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై గురువారం ఆయన సంతకం చేశారు. గతంలో జారీ చేసిన విస్తృత ఆదేశాలతో పోలిస్తే ఇవి పరిమిత స్థాయిలో ఉన్నప్పటికీ, వీటిపై

మిగతా2లో...

## వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిపై

# మంత్రి నిమ్మల సమీక్ష

**● హాజరైన ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, అడ్వైజర్ వెంకటేశ్వరరావు తదితరులు**




## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

**● దీక్షా శిబిరాలపై దాడులు సరికాదు ● రాజకీయ ఉన్మాదానికి ఇది పరాకాష్ఠ ● బొత్స సత్యనారాయణ మండిపాటు**




## రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా

# మార్చడమే లక్ష్యం

**పికిల్‌బాల్ లీగ్ ప్రారంభోత్సవం**

**ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**




## ఎపిలో పిడుగులతో కూడిన

# వర్షాలు


**- రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడి**




## రాష్ట్రంలో భారీగా

# ఐఏఎస్‌ల బదిలీ

**● 22 మందిని బదిలీ చేస్తే ఉత్తర్వులు ● విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా జె.శ్యామలరావు ● రహదారులు, భవనాల శాఖ కార్యదర్శిగా కోన శశిధర్ ● జెఏడిలో రిపోర్ట్ చేయాలని ఆమ్రపాలికి ఆదేశం**




**అమరావతి, ఆగస్టు 07:**ఏపీలో పలువురు ఐఏఎస్‌లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. మొత్తం 20 మంది ఐఏఎస్‌లు, ఇద్దరు ఐఎఫ్ఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా జె.శ్యామలరావు, రహదారులు, భవనాల శాఖ కార్యదర్శిగా కోన శశిధర్, ఏపీఎస్ ఆర్టీసీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎం.శివప్రసాద్‌ను నియమించింది. టూరిజం, యువజన సర్వీసుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఎస్. రావత్, ఆర్కియాలజీ, మ్యూజియం

మిగతా2లో...



## వైసీపీ నిరాధార ఆరోపణలు చేస్తోంది

**- మెగా డీఎస్సీతో 16 వేల కుటుంబాల్లో వెలుగులు నింపాం: మంత్రి నారాయణ**

**నెల్లూరు, ఆగస్టు 07:** మెగా డీఎస్సీ ద్వారా 16 వేల మంది యువతకు ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించిన ప్రభుత్వంపై వైసీపీ నిరాధార ఆరోపణలు చేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ విమర్శించారు. నెల్లూరు సిటీ నియోజకవర్గ పర్యటనలో ఉన్న ఆయన వైసీపీ చేపడుతున్న నిరాహార దీక్షలపై మీడియా అడిగిన ప్రశ్నలకు

మిగతా2లో...

# చట్టం చేస్తున్నాం...బీసీలకు సంరక్షణ కల్పిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

71,536 చేనేత కుటుంబాలకు రూ.179 కోట్లను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అలాగే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నా... రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం-అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని అడ్డుకునేలా జరుగుతున్న కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని సూచించారు. ఇలాంటి వారి విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉంటుందని... ప్రజలు కూడా కుట్రలు పన్నే వారి నైజాన్ని గమనించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకునేలా ఆగస్ట్ 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఇది మరపురాని రోజుగా ఉండాలనే నేతన్న సేవలో... పథకాన్ని ప్రారంభించాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాదు... చెప్పని వాటినీ అమలు చేస్తున్నామనడానికి నేతన్న సేవలో పథకమే నిదర్శనం. చేనేత కేవలం ఒక వృత్తే కాదు... భారతీయ సంస్కృతికి ప్రతీక. దేశం గర్వించే కళ చేనేత. మన రాష్ట్రం అనేక చేనేత కళలకు నిలయం. అలాంటి వర్గానికి ఆసరాగా ఉంటున్నాం. చీరాల, వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, పొందూరు, పెడన, శ్రీకాళహస్తి, నరసాపురం... ఇలా రాష్ట్రంలో అనేక చేనేత ఉత్పత్తులు విశిష్ట గుర్తింపు పొందాయి. 1.27 లక్షల మంది చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. నేతన్న సేవ పథకమే కాదు... ఇప్పటికే నేతన్నలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం కలుగుతోంది. చేనేతలకు 50 ఏళ్లకే ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పెన్షన్ అందిస్తున్నాం. 85 వేల మంది చేనేతలకు ఫించన్‌గా రూ.4 వేల చొప్పున నెలకు రూ.35 కోట్లు ఇస్తున్నాం. రూ.420 కోట్లు ఏడాదికి ఖర్చు పెడుతున్నాం. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79 కోట్లు ఇచ్చాం. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ.10 కోట్ల వ్యయంతో 10 చేనేత క్లస్టర్లకు ఆమోదం పొందాయి. హ్యాండ్లూమ్ మార్కెటింగ్ అసిస్టెన్స్ కార్యక్రమంతో నేత కార్మికులకు నేరుగా మార్కెట్ అవకాశాలు వచ్చాయి. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేస్తున్నాం. అమరావతి లోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం కూడా వస్తోంది. విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది."అని సీఎం చంద్రబాబు అన్నారు.**బీసీలకు అండగా...** "బీసీలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోంది. వారి సంక్షేమం కోసం పని చేయడంతోపాటు... రక్షణ కల్పించేందుకు చట్టం చేస్తున్నాం. దీని కోసం ముసాయిదా ఇప్పటికే సిద్ధమైంది. **మినీ ముంబై చీరాలకు పూర్వవైభవం తెస్తాం"** చీరాల పేరు వింటేనే ఇక్కడి నేతన్నల నైపుణ్యం గుర్తుకు వస్తుంది. చీరాల పట్టు, కాటన్ చీరలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. చీరాల ఖర్చీఫ్‌లు ఒకప్పుడు విదేశాలకు భారీగా ఎగుమతి అయ్యేవి. చేనేత ఉత్పత్తుల్లో ఒకప్పుడు 'మినీ ముంబై'గా పేరొందిన చీరాలకు పూర్వ వైభవం తెస్తాం. పర్యాటకుల్ని ఆకట్టుకునేలా సూర్యలంక, బాపట్ల, చీరాల సముద్ర తీర ప్రాంతాలను తీర్చిదిద్దుతున్నాం. రూ. 97 కోట్ల స్వదేశ్ దర్శన్ నిధులతో సూర్యలంక నుంచి చీరాల వరకు పర్యాటక కారిడార్ ఏర్పాటు చేస్తున్నాం."అని ముఖ్యమంత్రి చెప్పారు. తన ప్రసంగం అనంతరం బాపట్ల జిల్లాలో వివిధ శాఖలకు చెందిన అధికారుల పని తీరుపై తన వద్దనున్న నివేదికను ప్రజలకు చదివి వినిపించారు. చక్కగా పని చేసిన వారిని ప్రజలు అభినందించాలని సూచించారు. సంతృప్తికరంగా పని చేయని అధికారులను పనితీరు మరింత మెరుగు పరుచుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వివిధ స్టాళ్లను సీఎం చంద్రబాబు సందర్శించారు. సీబీఎన్ జీవిత చరిత్రను ఆవిష్కరిస్తూ మహతి అనే యువతి 40 పెన్సిళ్లతో రూపొందించిన మైక్రో ఆర్ట్ ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. బాపట్ల, సూర్యలంక సహా జిల్లాలోని వివిధ బీచ్ ల సమాచారాన్ని ప్రజలకు అందించేలా రూపొందించిన బే ఆఫ్ బాపట్ల వెబ్ సైట్, హ్యాండ్ బుక్ ను సీఎం విడుదల చేశారు. బాపట్ల లీప్స్ పేరుతో వివిధ రంగాల్లో యువతకు అందించే శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. చేనేత రంగ అభివృద్ధికి సంబంధించి ఫ్యాబ్ ఇండియా సహా నాలుగు సంస్థలతో సీఎం చంద్రబాబు సమక్షంలో అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, బాపట్ల జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు

# వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిపై మంత్రి నిమ్మల సమీక్ష

**విజయవాడ, ఆగస్టు 07:** ఈఎన్సీ నరసింహమూర్తి, ప్రాజెక్ట్ సిఈ, ఎస్ఈ, ఈఈలు, ఏజెన్సీల ప్రతినిధులతో మంత్రి నిమ్మల రామానా యుడు వెలిగొండ ప్రాజెక్టు పనులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నల్లమల సాగర్ రిజర్వా యర్‌కు కృష్ణా జలాల తరలింపుకు తీసుకోవలసిన చర్యలపై సమీక్ష. చేసారు. ఈనెల మూడో వారంలో నల్లమల సాగర్ కు నీళ్ళు తరలించేందుకు సిద్ధంగా, చెక్ మెమో ఇవ్వాలని అధికారులను ఆదేశించిన మంత్రి నిమ్మల కొల్లం వాగు నుండి టన్నెల్స్ ద్వారా, కృష్ణా జలాలు తరలించేందుకు అప్రోచ్ ఛానెల్ క్లియర్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. రెండు టన్నెల్స్ లో మిగిలిన 286 మీ లైనింగ్ పనులు మరో 10 రోజుల్లో పూర్తి కానున్నట్లు వెల్లడించారు.

కాగా టన్నెల్-2లో చిక్కుకున్న టిబిఎం మెషిన్ తొలగింపు సైతం మరో వారంలో పూర్తికానుంది.1900 మెట్రిక్ టన్నుల టిబిఎం మెషిన్ నుండి, నేటికి 1300 మెట్రిక్ టన్నులు, టన్నెల్ నుండి వెలికి తీశారు.మిగిలిన 600 మెట్రిక్ టన్నులను 10 రోజుల్లో పూర్తిగా వెలికితీయనున్నారు. గత 5ఏళ్ళ వైసిపి పాలనలో టిబిఎం తొలగించలేక చేతులెత్తేసి, చుక్కనీరు కూడా ఇవ్వకుండా జాతికి అంకితం అనే డ్రామా ఆడారని మంత్రి ఈ సందర్భ ంగా పేర్కొన్నారు. .నిర్వాసితులకు 900 కోట్లకు పైగా ఆర్అండ్ఆర్ పరిహారం ఇవ్వాల్సి ఉండగా, ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా గత ప్రభుత్వం మోసం చేశారని, తమ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు లో మొత్తం 7321 నిర్వాసిత కటుంబాలకు గానూ, 2560 కుటుంబాలకు 318 కోట్లు చెల్లించగా, ఈవారంలో 2863 కుటుంబాలకు 353 కోట్లు చెల్లించాలని చంద్రబాబు ఆదేశించినట్లు తెలిపారు. మిగిలిన 1898 నిర్వాసిత కుటుంబాలకు, ఈనెలాఖరులోపుగా 210 కోట్లు చెల్లించనున్నట్లు చెప్పారు.

# రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

విభాగం కమిషనర్‌గా రేవు ముత్యాలరాజును ప్రభుత్వం నియమించింది. పర్యాటక శాఖ బాధ్యతల్లో ఉన్న ఆమ్రపాలిని బదిలీ చేసి జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిపాలనా వ్యవస్థలో కీలక మార్పులు చేపట్టింది. మొత్తం 22 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ, కొత్త పోస్టింగ్‌లను కేటాయించింది. పర్యాటకం, పాఠశాల విద్య, రవాణా, ఆరోగ్యం, హౌసింగ్, టీటీడీ, వీఎమ్ఆర్‌డీఏ, ఏపీ టూరిజం తదితర కీలక శాఖల్లో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. రానున్న గోదావరి పుష్కరాల కోసం సురేశ్ కుమార్, భరత్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించింది ప్రభుత్వం. తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా ఎం.జయకృష్ణ, ఏపీఎస్ఆర్టీసీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా శివప్రసాద్ నియమితు లయ్యారు. ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతల నుంచి ఆమ్రపాలిని రిలీవ్ చేసిన ప్రభుత్వం.. ఆమెను సాధారణ పరిపాలన శాఖకు రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

అలాగే.. తేజ్ భరత్, బి.అనిల్ కుమార్ రెడ్డిలను కూడా జీఏడీకి రిపోర్ట్ చేయాలని సూచించింది. పి.రవి సుభాష్‌కు ఎపీటీడీసీ ఎండీగా బాధ్యతలప్పగించింది. ఇక.. పురావస్తు శాఖ కమిషనర్‌గా ముత్యాలరాజు, ఆరోగ్య శాఖ కమిష నర్‌గా చక్రధర్ బాబుకు అదనపు బాధ్యతలు, డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్‌గా అరుణ్ బాబు నియమితులయ్యారు. విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ కమిషనర్‌గా ప్రఖర్ జైన్, టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ప్రభల గోపీనాథ్, ఎన్‌టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పద్మావతి నియమితులయ్యారు. హౌసింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా హెప్సిబా రాణి, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బి.సునీల్ కుమార్ రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. భారీ స్థాయి ఐఏఎస్ బదిలీలతో రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. పలు ముఖ్య శాఖలకు కొత్త అధికా రులను నియమించడం ద్వారా ప్రభుత్వ యంత్రాం గంలో మరింత సమర్థవంతమైన పాలనకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# వైసీపీ నిరాధార ఆరోపణలు చేస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

స్పందించారు.మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన 16 వేల మంది యువత ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తూ సంతోషంగా ఉన్నారని మంత్రి తెలిపారు. డీఎస్సీ ప్రక్రియను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు కోర్టుల్లో కేసులు వేసినా న్యాయస్థానాల్లో వారికి ఎదురుదెబ్బ తగిలిందన్నారు.వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయలేదని మంత్రి ఆరోపించారు. విద్య, ఉద్యోగాల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ త్వరలో మరోసారి జాబ్ క్యాలెండర్ విడుదల చేయనున్నారని తెలిపారు.మరిన్ని ఉద్యోగాల భర్తీ జరగబోతుందనే భయంతోనే వైసీపీ నేతలు నిరాహార దీక్షల పేరుతో రాజకీయ డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై పోరాడాల్సిన ప్రతిపక్షం రాజకీయ లబ్ధి కోసం నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వైసీపీ తీరును ప్రజలు గమనిస్తున్నారని, ఇలాంటి రాజకీయాలకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని మంత్రి నారాయణ అన్నారు.

# ఇంటింటికీ తాగునీటి విప్లవానికి దశాబ్ది

## ● మిషన్ భగీరథ దేశానికే ఆదర్శం ● ఫ్లోరోసిస్ రక్కసిని రూపుమాపిన వ్యవస్థ

## ● కాంగ్రెస్ నిర్లక్ష్యంతో నిర్వీర్యం : మాజీమంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్, ఆగస్టు 07:** తెలంగాణలో ప్రతి ఇంటికీ సురక్షిత, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన మిషన్ భగీరథ పథకం నేటితో పదేండ్లు పూర్తి చేసుకోవడం సంతోషకరమని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణలో ఇంటింటికీ తాగునీటి విప్లవానికి దశాబ్ది కాలం పూర్తయ్యిందని ఎక్స్ వేదికగా శుక్రవారం వీడియోను షేర్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ.. దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణలో ఫ్లోరోసిస్ రక్కసిని రూపుమాపిన సుజల వ్యవస్థగా పేరుగాంచిందని వివరించారు. మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టితో రూపుదిద్దుకున్న మిషన్ భగీరథ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో నిర్వీర్యమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సరిగ్గా పదేండ్ల క్రితం ఇదే రోజు గొప్ప ఆలోచనతో ప్రారంభమైన ఈ పథకం ప్రజల తాగు నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపిందని తెలిపారు. మిషన్ భగీరథ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న అతిపెద్ద తాగునీటి మౌలిక వసతుల ప్రాజెక్టుగా నిలిచిందని గుర్తు చేశారు. దేశానికి రోల్ మోడల్‌గా నిలిచి హర్ ఘర్ జల్ పథకం అయిందని పేర్కొన్నారు. మిషన్ భగీరథ ఒక పథకం కాదనీ, తెలంగాణ ప్రజల జీవితాలను మార్చిన మహత్తరమైన ప్రణాళిక అని వివరించారు.రాష్ట్రంలో ఏ ఇంట్లోనూ తాగునీటి కోసం ఇబ్బంది ఉండకూడదనీ, ఏ తల్లి కూడా బిందె పట్టుకుని కిలోమీటర్ల దూరం నడవకూడదనీ, ఏ గ్రామం కూడా వేసవిలో నీటి ఎద్దడి ఎదుర్కోకూడదనే సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం ఈ బృహత్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందని తెలిపారు.

# చిన్నతరహా పరిశ్రమలకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలను సవరించినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. జైపూర్‌లో జరిగిన 'బ్రిక్స్' వాణిజ్య, పరిశ్రమల మంత్రుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ-కామర్స్ ద్వారా అంతర్జాతీయ లబ్ధి: హ్యాండ్‌లూమ్స్, హస్తకళలు, టెక్స్‌టైల్స్, పాదరక్షలు, ఆహార ఉత్పత్తులను పెద్ద ఎత్తున ఈ-కామర్స్ వేదికల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేందుకు నిబంధనలను సరళీకృతం చేశారు. భారతదేశంలోని గ్రామీణ కళాకారులు, ఎంఎస్ఎంఈలు , రైతులకు ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లను అందుబాటులోకి తేవడమే లక్ష్యమని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బ్రిక్స్ దేశాల్లో పెట్టుబడులు, కొత్త ఉద్యోగ అవకాశాలు సృష్టించడంపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. సభ్య దేశాల మధ్య వాణిజ్య ప్రక్రియను మరింత డిజిటలైజ్ చేయడం, కాగిత రహిత ప్రక్రియగా మార్చడం, ఓ÷ూఓఇలకు అవసరమైన ఆర్థిక సాయం వేగంగా అందించడంపై నిర్ణయాలు తీసుకున్నారు. కాగా, బ్రిక్స్ కూటమికి కామన్ కరెన్సీ ఏర్పాటు చేసే ఆలోచనకు భారతదేశం మద్దతు ఇవ్వడం లేదని ఈ సందర్భంగా పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. జాతీయ చేనేత దినోత్సవం (ఆగస్టు 7) సందర్భంగా తీసుకున్న ఈ నిర్ణయం ఖాదీ, కుటీర పరిశ్రమలు, తోలు రంగానికి చెందిన కళాకారులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కఠినతరం

(మొదటి పేజీ తరువాయి)

కూడా న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. మొదటి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అమెరికాలో జన్మించిన పిల్లలకు పౌరసత్వం దక్కకుండా నిబంధనలు విధించారు. ఇద్దరు తల్లిదండ్రులు అమెరికా పౌరులు కానప్పుడు, వారిలో ఒకరిని 'శత్రు దేశస్థుడు'గా, అంటే విదేశీ ఉగ్రవాద సంస్థల్లో సభ్యుడిగా గుర్తిస్తే, వారి పిల్లలకు పౌరసత్వం వర్తించదు. దీంతోపాటు దౌత్యపరమైన మినహాయింపులు ఉన్న విదేశీ ప్రభుత్వ ఉద్యోగులు, కేవలం పౌరసత్వం కోసమే చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు (కొన్ని సరోగసీ కేసులు), ఫెడరల్ చట్టం ద్వారా పౌరసత్వం కల్పించని యూఎస్ టెరిటరీలలో జన్మించిన వారికి కూడా ఈ నిబంధన వర్తిస్తుంది. ఇక, రెండో ఆదేశం పూర్తిగా 'బర్త్ టూరిజం'ను లక్ష్యంగా చేసుకుంది. కేవలం బిడ్డకు అమెరికా పౌరసత్వం ఇప్పించడం కోసమే దేశానికి వచ్చేవారిని అడ్డుకోవాలని ఈ ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఇలాంటి వారికి వీసాలు నిరాకరించడం, అధికారిక అనుమతులు రద్దు చేయడం, దేశంలోకి ప్రవేశాన్ని నిరోధించడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలని హోంల్యాండ్ సెక్యూరిటీ, విదేశాంగ శాఖలను ఆదేశించారు. కాగా, 14వ రాజ్యాంగ సవరణ కింద అమెరికాలో పుట్టిన దాదాపు ప్రతి ఒక్కరికీ పౌరసత్వం లభిస్తుందని జూన్ 30న 'ట్రంప్ వర్సెస్ బార్బరా' కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు జన్మహక్కు పౌరసత్వాన్ని ఒక 'జోక్'గా మార్చిందని ట్రంప్ విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం 'కొన్ని సర్దుబాట్లు' చేస్తోందని వ్యాఖ్యానించారు. చారిత్రకంగా దౌత్యవేత్తలు, ఆక్రమణ దళాలకు చెందిన వారికి మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపులు ఉండేవి. ఇప్పుడు ట్రంప్ జారీ చేసిన ఈ కొత్త ఆదేశాలు సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్న మినహాయింపుల పరిధిలోనే ఉన్నప్పటికీ, వాటి సరిహద్దులను పరీక్షించేలా ఉన్నాయని, ఇవి కూడా న్యాయస్థానంలో సవాలుకు గురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

**విజయవాడ, ఆగస్టు 07:**
డీఎస్సీలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ వైసీపీ చేపడుతున్న రిలే నిరాహార దీక్షా శిబిరాలపై దాడులు చేయించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. విజయవాడలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు నేతృత్వంలోని దీక్షా శిబిరంపై దాడి చేసి టెంట్లు ధ్వంసం చేయడం, కార్యకర్తలు, మహిళలపై రాళ్లు, కోడిగుడ్లతో దాడులు చేయడం రాజకీయ ఉన్మాదానికి పరాకాష్ఠ అని ఆయన వ్యాఖ్యానించారు. దీక్షా శిబిరం టెంట్‌పై మూత్ర విసర్జన చేయడం, మల్లాది విష్ణును వ్యాన్‌లో తరలిస్తుంటే జెండా కర్రతో దాడికి తెగబడటం రాష్ట్రంలో శాంతిభద్రతల క్షీణతకు అద్దం పడుతోందన్నారు. దాడులను అడ్డుకోవాల్సిన పోలీసులే బాధితులైన వైసీపీ నాయకులను అరెస్ట్ చేయడం విచారకరమని బొత్స విమర్శించారు. డీఎస్సీ నియామకాల అక్రమాలపై ప్రభుత్వం సీబీఐ విచారణ జరిపించాలని, ఈ దందాకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వం ఎంతగా అణచివేయాలని చూసినా ప్రజా సమస్యలపై తమ పోరాటం ఆగేది లేదని బొత్స స్పష్టం చేశారు.

# రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే లక్ష్యం

**విజయవాడ,ఆగస్టు 07:** ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా నిర్వహిస్తున్న అమరావతి పికిల్‌బాల్ లీగ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజయవాడలోని నైట్రో పికిల్‌బాల్ కేఫే వేదికగా ఈ నెల 9వ తేదీ వరకు ఈ లీగ్ పోటీలు జరగనున్నాయి. రాష్ట్రంలో పికిల్‌బాల్ క్రీడ అభివృద్ధికి ఈ లీగ్ ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు, పికిల్‌బాల్ వంటి నూతన క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి మండిపల్లి అన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎమ్మెల్యే గద్దె రామోహన్నాయుడు, శాప్ చైర్మన్ రవి నాయుడు, సినీహీరో సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎపిలో పిడుగులతో కూడిన వర్షాలు

## - రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడి

**అమరావతి, ఆగస్టు 07:** ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో రెండు రోజుల పాటు పిడు గులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. వాయువ్య బంగాళాఖాతంలో రానున్న 24 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు వర్షాలకు సంబంధించిన వివరాలను ఆ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. శనివారం ఉత్తరాంధ్రలో ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, విశాఖ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు తీరప్రాంతంలో గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ చెప్పారు. తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ఉత్తర, మధ్య కోస్తాలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని ఆయన తెలిపారు. పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కోనసీమ, ఉభయ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు వర్ష సూచన ఉన్నట్లు పేర్కొన్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరులో వానలు పడతాయని వెల్లడించారు. అల్లూరి, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో చెదురు మదురుగా.. మార్కాపురం ప్రాంతంతో పాటు రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. సందర్భగా ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. ముఖ్యంగా పిడుగులతో కూడిన వర్షాల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ వంటి వాటి వద్ద నిలబడవద్దని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు.

# సంపాదకీయం

## హిందూజా సోదరులకు ఊరట

- బోఫోర్స్ కేసును కొట్టేసిన సుప్రీం
- 40 ఏళ్ల బోఫోర్స్ కేసుకు పడిన తెర

**న్యూఢిల్లీ,ఆగస్ట్ 07:** దాదాపు నాలుగు దశాబ్దాలుగా దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా నిలిచిన బోఫోర్స్ కుంభకోణం కేసుకు తెరపడింది. దీని నుంచి హిందూజా సోదరులకు ఊరట కల్పిస్తూ ఢిల్లీ హైకోర్టు 2005లో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన చివరి పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ఈ కేసుకు సంబంధించిన న్యాయపరమైన ప్రక్రియ పూర్తిగా ముగిసింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ వినోద్ కె. చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. విచారణ వాయిదా వేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరినా, కోర్టు అంగీకరించలేదు. ఇప్పటికే చాలా కాలం గడిచిందని పేర్కొంటూ పిటిషన్‌ను తిరస్కరించింది. విచారణ సందర్భంగా "హిందూజా సోదరులు, సీబీఐ వ్యవహారం ఇంకా ఎందుకు కొనసాగుతోంది? అన్ని కేసులను హైకోర్టు కొట్టేసింది కదా. ఇంకా ఎంతకాలం ఈ వ్యవహారం కొనసాగుతుంది?" అని జస్టిస్ పార్దీవాలా వ్యాఖ్యానించారు. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది 1986లో ఈ ఒప్పందం జరిగిందని వివరించే ప్రయత్నం చేసినా, ధర్మాసనం మరిన్ని వాదనలు వినేందుకు నిరాకరించింది. 2005 మే 31న ఢిల్లీ హైకోర్టు హిందూజా సోదరులు శ్రీచంద్, గోపీచంద్, ప్రకాశ్ హిందూజాలతో పాటు స్వీడన్‌కు చెందిన ఏబీ బోఫోర్స్ కంపెనీపై ఉన్న క్రిమినల్ కేసులను కొట్టివేసింది. అప్పట్లో దర్యాప్తు తీరుపై కూడా సీబీఐని హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఆ తీర్పును సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన అప్పీల్‌ను కూడా సుప్రీంకోర్టు 2018లో తిరస్కరించింది. అప్పీల్ దాఖలులో 4,522 రోజుల ఆలస్యం జరిగిందని పేర్కొంటూ దానిని స్వీకరించలేదు. 1986లో భారత ప్రభుత్వం స్వీడన్‌కు చెందిన ఏబీ బోఫోర్స్ సంస్థతో రూ.1,437 కోట్ల విలువైన 400 హోవిట్జర్ గన్‌ల కొనుగోలు ఒప్పందం చేసుకుంది. 1987లో ఈ ఒప్పందంలో అక్రమ కమీషన్లు చెల్లించారనే ఆరోపణలు వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం చెలరేగింది. అనంతరం సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. తాజాగా సుప్రీంకోర్టు చివరి పిటిషన్‌ను కూడా కొట్టివేయడంతో బోఫోర్స్ కేసు చట్టపరంగా ముగిసినట్లైంది.

## రూ.వేల కోట్ల జరిమానా

- మెటాకు అమెరికా కోర్టు భారీ షాక్..

**న్యూఢిల్లీ,ఆగస్ట్07:** సోషల్ మీడియా దిగ్గజం మెటాకు అమెరికా కోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ప్లాట్‌ఫామ్‌ల వల్ల యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని నిర్ధారించిన న్యూ మెక్సికో కోర్టు, కంపెనీకి 567 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 5,400 కోట్లకు పైగా) జరిమానా విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా రెండో దశలో జడ్జి బ్రయాన్ బీడ్‌షీడ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. తీర్పు ప్రకారం జరిమానా మొత్తంలో 420 మిలియన్ డాలర్లు సోషల్ మీడియా వల్ల ప్రభావితమైన యువతకు చికిత్సా సేవల కోసం కేటాయించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. మిగిలిన నిధులను రాబోయే ఐదేళ్లలో అవగాహన, నివారణ కార్యక్రమాలు, స్క్రీనింగ్ సేవలు, ఇతర సంబంధిత ఖర్చుల కోసం వినియోగించాలని ఆదేశించింది. ఈ కేసులో గత మార్చి నెలలో వెలువడిన తీర్పునకు ఇది కొనసాగింపు కావడం గమనార్హం. ఆ సమయంలో మెటా ఉద్దేశపూర్వకంగానే పిల్లల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించిందని, లైంగిక దోపిడీకి సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టిందని నిర్ధారించిన జ్యూరీ, కంపెనీకి 375 మిలియన్ డాలర్ల సివిల్ పెనాల్టీ విధించింది. ఈ కేసు విచారణలో ప్రాసిక్యూటర్లు మెటా ప్లాట్‌ఫామ్‌లలో కీలక మార్పులు చేయాలని కోరారు. ముఖ్యంగా యువతను వ్యసనపరులుగా మార్చే ఫీచర్లను నియంత్రించాలని, వయసు నిర్ధారణ పద్ధతులను కఠినతరం చేయాలని, పిల్లల లైంగిక దోపిడీని అరికట్టేందుకు డిఫాల్ట్ ప్రైవసీ సెట్టింగులను మెరుగుపరచాలని వాదించారు. అయితే, ప్రాసిక్యూటర్ల అభ్యర్థనలను కోర్టు పాక్షికంగానే అంగీకరించింది. 13 ఏళ్లలోపు పిల్లలకు వయసు నిర్ధారణను తప్పనిసరి చేయాలన్న వాదనను తోసిపుచ్చింది. అమెరికాలోని 'చిల్డ్రన్స్ ఆన్‌లైన్ ప్రైవసీ ప్రొటెక్షన్ యాక్ట్' (సీఓపీపీఏ) ప్రకారం కేవలం వయసు నిర్ధారణ కోసం పిల్లల నుంచి వ్యక్తిగత సమాచారం సేకరించడం కుదరదని కోర్టు స్పష్టం చేసింది. అంతేగాక ఇతర సోషల్ మీడియా కంపెనీలకు లేని నిబంధనలను కేవలం మెటాపై మాత్రమే విధించడం సరికాదని, అది కంపెనీపై అనవసర భారం మోపుతుందని అభిప్రాయపడింది. ఈ తీర్పుపై మెటా ఇంకా స్పందించలేదు. ఇదిలా ఉంటే.. ఇటీవల మెటాకు చెందిన ఏఐ మోడల్ సైబర్ సెక్యూరిటీ పరీక్షల్లో భాగంగా బయటి సర్వీస్‌లోకి హ్యాక్ చేయడం, టెక్నాలజీపై నియంత్రణకు సంబంధించి కొత్త ఆందోళనలను రేకెత్తించింది.

## రాహుల్ ప్రయాగ్‌రాజ్ సభకు అనుమతి



**న్యూఢిల్లీ,ఆగస్ట్7:** ఆగస్టు 8న ప్రయాగ్‌రాజ్‌లో రాహుల్ గాంధీ తలపెట్టిన 'ఛాత్రోన్ కీ గూంజ్' (విద్యార్థుల గళం)సభకు యోగీ సర్కారు అనుమతిచ్చింది. పేపర్ లీకులు, నిరుద్యోగంపై విద్యార్థులతో రాహుల్ గాంధీ ఈసభలో ముఖాముఖి చర్చించనున్నారు.అయితే ముందుగా సభా వేదిక అయిన కేపీ గ్రౌండ్‌కు గతంలో ఇచ్చిన అనుమతిని రద్దు చేసి తీవ్ర ఉత్కంఠకు కారణమైన కాయస్థ పాఠశాల (కేపీ) ట్రస్ట్.. గురువారం అర్ధరాత్రి వెనక్కి తగ్గింది. కొన్ని షరతులతో సభ నిర్వహణకు మళ్లీ అనుమతి ఇస్తున్నట్లు ప్రకటించింది. సదస్సుకు పర్మిషన్ రావడంతో కాంగ్రెస్ శ్రేణులు సభా ఏర్పాట్లు చేస్తున్నారు.

# కొనసాగుతున్న అమెరికా కుట్రలు!



పశ్చిమాసియాలో ఎప్పుడు ఏం జరగనుందో, శాంతి ఎప్పుడు నెలకొంటుందో ఎవరికీ తెలియని స్థితి. సంక్షోభపు తొలి రోజుల్లో తాపీగా అసలేమీ జరగనట్లు, జరిగినా మనకేమీ కాదన్నట్లు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్న మన ప్రధాని నరేంద్రమోడీ ఇటీవల మనకు అవసరమైన ఎరువులు, ఇంధనం, గ్యాస్ దిగుమతుల గురించి సమీక్ష జరపాల్సి వచ్చింది. అఫ్ కోర్స్, పార్లమెంటుకు వచ్చి ఇరాన్‌పై దాడులతో దేశం ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఇంతవరకు చర్చించాలన్న ఆలోచన రాలేదనుకోండి. ఇక మోడీ జిగినీ దోస్తు డోనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని అమెరికాకు దెబ్బమీద దెబ్బ తగులుతున్నా బుద్ధిరావటం లేదు. ఫిబ్రవరి 28న ఇజ్రాయిల్‌తో కలసి ఇరాన్ మీద ఉత్తి పుణ్యానికి చేసిన దాడులతో స్వయంగా సృష్టించిన సంక్షోభం నుంచి బయటపడేందుకు దిక్కుతోచటం లేదు. ఇరాన్‌తో ఒక రోజు యుద్ధం అంటాడు మరోరోజు శాంతి ఒప్పందం అని చెబుతాడు. మరుసటిరోజే ఉల్లంఘించి ఇరాన్‌ను చావు దెబ్బతీస్తా అంటూ దాడు లకు తెగబడతాడు. కొద్ది రోజుల తరువాత ఇరాన్ దిగివచ్చింది గనుక నిలిపివేశా నంటాడు. ప్రారంభం నుంచీ ఇదే తంతు. ఇప్పుడు మరోసారి ఒప్పందం గురించి మాట్లాడుతున్నాడు. 'క్షణక్షణముల్ జవరాంద్ర చిత్తముల్' అని కవి ఆడవారిని ఆడిపోసుకున్నాడు గానీ ట్రంప్‌ను చూస్తే కచ్చితంగా తిరగరాసి ఉండేవాడు. నవంబరు మూడవ తేదీన జరిగే మధ్యంతర ఎన్నికల్లో ఏదోవిధంగా గట్టేందుకు పశ్చిమా సియాలో ట్రంప్ ఇంకా కుట్రలను కొనసాగిస్తూనే ఉన్నాడు.ఎక్కడో జరిగిన పేలుడులో ఇద్దరు తమ సైనికులు మరణించారనే సాకుతో ఒప్పందాన్ని పక్కన పెట్టి లెబనాన్‌పై మరోసారి దాడులకు ఇజ్రాయిల్ పూనుకుంది. ఐక్య అరబ్ ఎమిరేట్స్(యుఏయి) గల్ఫ్ దేశాల్లో ఇరాన్‌కు వ్యతిరేకంగా ఇజ్రాయిల్‌తో నేరుగా జట్టుకట్టింది, విభీష ణుడి పాత్ర పోషిస్తున్నది. దానికి అమెరికా మద్దతు సరేసరి. లెబనాన్‌లో సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్న ఇరాన్ అనుకూల హిజబుల్లా నాయకత్వాన్ని హతమార్చేందుకు, దానికి పట్టున్న దక్షిణ లెబనాన్ ప్రాంతాలపై ఇజ్రాయిల్ దాడులు చేయటమే కాదు, అనేక ప్రాంతాలను ఆక్రమించుకున్నది. యుఏయి నగరమైన దుబాయ్‌లో ఏడు చోట్ల పేలుళ్లు జరిగా యంటే ఎందుకు అన్నది వేరే చెప్పనవసరం లేదు. ఇరాన్ మద్దతు ఉన్న ఎమెన్‌లోని హౌతీలు ఎర్ర సముద్రం-అరేబియా సముద్రాలను కలిపే బాబ్ ఎల్ మండాబ్ జల సంధిలో ఆంక్షలు విధించి ఉల్లంఘించిన సౌదీ అరే బియా నౌకలపై దాడి చేశారు. దానికి ప్రతిగా ఇరాక్‌లోని ఇరాన్ అనుకూల సాయుధ శక్తులపై అమెరికాతో కలసి సౌదీ వైమానిక దాడులు చేసింది. వీటన్నింటినీ చూసినపుడు నేరుగా దాడులు చేస్తే జరిగేదేమీ లేకపోగా పరువు పోగొట్టుకోవాల్సి వస్తుందనే ఎత్తుగడతో అమెరికా తన తొత్తులతో ఆ పని చేయిస్తున్నది.అమెరికా అతి తెలివితేటలను గమనించి ఇరాన్ కూడా తన వ్యూహాన్ని మార్చుకున్నది.ట్రంప్‌ను ఒక మూలకు నెట్టేందుకు పశ్చిమాసియాలో తనకు అనుకూలంగా పనిచేసే సాయుధ శక్తులన్నింటిని రంగంలోకి దించింది. ప్రాంతీయ రంగాలను విస్తరిస్తామని, ఉక్కిరిబిక్కిరి చేసే ఎత్తుగడలను అనుసరిస్తామని పరోక్షంగా ప్రత్యక్షంగా చెబుతూనే ఉంది. అమెరికా మాదిరే తాను కూడా మద్దతుదార్లతో కాగల కార్యాలను నడిపిస్తామని చెబుతోంది. పాకిస్థాన్ ద్వారా భుజాలపై పెట్టుకొని విమానాలు, క్షిపణులను కూల్చివేసే ఆయుధాలను టెహరాన్‌కు చైనా అందించిందనే వార్తలు వచ్చాయి. అవి నిజమో కాదో గానీ తన మిత్రదేశాలకు అమెరికా ఎలా ఆయుధాలు పంపుతున్నదో ఇరాన్ కూడా తన శ్రేయోభిలాషుల నుంచి అలాంటి సాయం పొందితే తప్పేమిటి! ఇరాన్‌పై దాడుల ప్రారంభంలో సంయమనం పాటించిన హౌతీ సాయుధులు తొమ్మిది నెలల విరామం తరువాత గతనెల మూడో వారంలో ఎర్ర సముద్రంలో దాడులకు ఉపక్రించారు. హోర్ముజ్ జలసంధిపై అమెరికా కేంద్రీకరణను దెబ్బతీసేందుకే ఇది అన్నది స్పష్టం. కీలకమైన ఎర్ర సముద్రం, ఏడెన్ జలసంధిపై పట్టు కోసం సౌదీని ప్రోత్సహించిన అమెరికా ఎమెన్ మీద దీర్ఘకాలం దాడులు చేయించింది. ఆక్రమంలో ఇరాన్‌కు మద్దతిచ్చే హౌతీలు రాజధాని సనాతో సహా అనేక ప్రాంతాలపై పట్టు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సౌదీ అరేబియా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చమురు ఎగుమతి చేస్తున్నది. దాన్ని దెబ్బతీసే ఎత్తుగడ కూడా హౌతీల దాడుల వెనుక ఉందని చెబుతున్నారు. గతేడాది అమెరికా వైమానిక దాడులను తట్టుకొని నిలిచిన హౌతీల బలాన్ని తక్కువ అంచనా వేయకూడదు. పెంటగన్ దాడుల్లో దాని ప్రభుత్వ ప్రధాని, తొమ్మిది మంత్రులు మరణించిన తరువాత కూడా అది తట్టుకొని నిలవటంతో అమెరికా రాజీకీ వచ్చి దాడులు నిలిపింది. 2015 తరువాత తొలిసారిగా హౌతీల ప్రతినిధులు తమ ఆధీనంలోని సనా నగరం నుంచి ప్రత్యేక విమానంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయాతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరై సురక్షితంగా తిరిగి రావటమే కాదు ఇరాన్ రివల్యూషనరీ గార్డులు, క్షిపణులు, డ్రోన్ల తయారీకి అవసరమైన విడిభాగాలను కూడా వెంట తీసుకువచ్చినట్లు వార్తలొచాయి. ఇరాన్‌తో సంప్రదింపులలో ఉన్నట్లు ట్రంప్ చెప్పాడు. ఓమన్‌తో కలసి హోర్ముజ్ జలసంధి మార్గాలను సమన్వయ పరుచు కొనేందుకు దాదాపు ఒక అవగా హనకు వచ్చినట్లు ఇరాన్ చెబుతోంది. అదే జరిగితే, దానికి అమెరికా అడ్డుకాలు పెట్టకపోతే మంచిదే, వాషింగ్టన్ నుంచి అలాంటి పరిణామాన్ని ఆశించవచ్చా! ?

# ప్రాజెక్టులు నిండగానే పండగకాదు...



ఎల్‌నినో ప్రభావం వల్ల మొన్నటిదాకా ముఖం చాటేసిన వానలు.. ఇప్పుడు రాష్ట్రాన్ని తడిసి ముద్ద చేస్తున్నాయి. రిజర్వాయర్లలోకి నీటి ప్రవాహం పెరుగుతుండటంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. దీంతో ప్రభుత్వాధినేతలు మోముల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. రాష్ట్రంలో వర్షాలు కురవకుండా ఉండాలి.. తద్వారా సర్కారు బదనాం కావాలని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కోరుకున్నట్టు, అందుకోసం తమిళనాడు వెళ్లి మళ్లీ తాంత్రిక, క్షుద్రపూజలు చేసినట్టు కాంగ్రెస్ నేతలు దుయ్యబట్టారు. ఈ అంశం రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. సరే... ఈ అంశాన్ని కాసేపు పక్కనబెడితే, ఇప్పుడు తెలంగాణలో ముమ్మరంగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతుల సమస్యలు పూర్తిగా తీరినట్టేనా? సాగు పరిస్థితి బాగైనట్టేనా? అంటే ఎట్టి పరిస్థితుల్లోనూ కాదంటున్నారు వ్యవసాయ నిపుణలు, రైతు నేతలు. వాస్తవ పరిస్థితులు, గణాంకాలు ఇదే విషయా న్ని తేటతెల్లం చేస్తున్నాయి. ప్రకృతి కరుణిం చకపోవటంతోపాటు కల్తీ విత్తనాలు, ఎరువులు, మద్దతు ధరలు లేకపోవటం, మధ్య దళారీలు రాజ్యమేలటం తదితరాం శాలు అన్నదాతను కుదేలు చేస్తున్నాయి. ఎల్‌నినో కారణంగా ఇప్పటి వరకు రాష్ట్రంలోని పదహారు జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. భూగర్భజలాలు 9.46 మీటర్లకు పడిపోయాయి. చెరువులు, కుంటలలోకి తగినంత నీరు రాలేదు.ప్రధాన ప్రాజెక్టు శ్రీరాంసాగర్, శ్రీశైలం, నాగార్జున సాగర్, కడెం ప్రాజెక్టుతోపాటు 38 మధ్య తరహా ప్రాజెక్టులకు నీరు రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌నినో కారణంగా మెట్ట పంటలు వేయాలని ప్రచారం చేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీటిని ఎత్తిపోయాలని ప్రతిపక్షపార్టీలు ఆందోళన చేస్తున్నాయి. ప్రభుత్వం దెబ్బతిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో తగినంత నీటి నిల్వ లేనందున (94మీటర్లు) కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల పంపులు పనిచేయవని ప్రభుత్వం చెబుతోంది. అవకాశం ఉన్న మేరకు కాళేశ్వరం నీటిని వాడుకోవాలి. 2015 నుండి 2018 వరకు కరువుల వల్ల యేటా ఆరు వేలకోట్ల రూపాయల పంటనష్టం వాటిల్లిం దన్నని నిపుణుల అంచనా. వాస్తవానికి 2018 నుండి 2025 వరకు అతివర్షాలతో పంటలు దెబ్బతిన్నప్పటికీ వరి పంట విస్తారంగా పడింది. యాసంగి వానాకాలం కలిపి వరి పంట 140 లక్షల ఎకరాలు సాగుచేయగా 2.85 కోట్ల టన్నుల వరిధాన్యం ఉత్పత్తి అయ్యింది. కానీ, 2026 ఎల్‌నినో కారణం గా వరి పంటలకు తగినంత నీరు లేదని వాతావరణ శాఖ చెబుతున్నది. మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు శ్రీశైలం లోకి, శ్రీరాం సాగర్‌లోకి కొంత నీరు వచ్చిన మాట నిజమే అయినా వర్షాల కోసం ఇంకా రైతులు ఎదురు చూస్తూనే ఉన్నారు. కాగా ప్రభుత్వం మాత్రం ముతకధాన్యాలు, చిరుధాన్యాలు వేయాలంటూ చెప్పటం గమనార్హం.మరోవైపు వానాకాలం తొలకరి సాగు కాకముందే కొన్ని విత్తన కంపెనీలు తప్పుడు బ్రాండ్‌లతో విత్తనాలను విస్తృత ప్రచారం చేసి అమ్మకాలు సాగిస్తున్నాయి. విత్తనాలపై ధృవీకరణ సర్టిఫికెట్ లేకుండానే విత్తనాలను అమ్మారు. ధరలు పెంచారు. వీటిపై ప్రభుత్వ నియంత్రణ లేదు. వ్యవసాయ కమిషనరేట్ గత దశాబ్ధకాలంగా విత్తనాల అమ్మకంలో జరుగుతున్న లోపాలపై చర్యలు తీసుకోవడం లేదు. వందల క్వింటాళ్లు కల్తీ విత్తనాలు పట్టుబడ్డా కమిషనరేట్ నిమ్మకు నీరెత్తినట్టుగా ఉండటం శోచనీయం. జిల్లా వ్యవసాయ శాఖాధికారులు తమ సిబ్బందితో మంచి విత్తనాలను సరఫరా చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం వారి నిర్లక్ష్యానికి పరాకాష్ట. కాగా కేంద్ర ప్రభుత్వం జూన్ చివరి వారంలో మద్ధతు ధరలు ప్రకటించింది. కానీ, అవి 2026 అక్టోబర్ 1 నుండి అమల్లోకి వస్తాయి. అందువల్ల, ప్రస్తుతం పాత ధరలకే పంటలను కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయోత్పత్తుల నాణ్యతా ప్రమాణాలు సరిగా లేవనే సాకుతో మధ్య దళారులు ధరలను తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.ఐకెపి, సహకార సంఘాలు, మిల్లర్లు, సివిల్ సప్లైశాఖ, మార్క్‌ఫెడ్ శాఖలు రైతుల నుండి కొనుగోలు చేసే సందర్భంలో మోసాలకు పాల్పడుతున్నాయి. మరో వైపు నాణ్యతా ప్రమాణాలు సరిగా లేవనే కారణంతో అన్నదాతకు నష్టం చేకూర్చటం పరిపాటిగా మారింది. వాస్తవానికి మధ్య దళారీలను తొలగించి కనీస మద్ధతు ధరలకు కొనుగోలు చేయడానికి విధి విధానాలను రూపొం దించాల్సిన సర్కారు అందుకు భిన్నంగా మిన్నకుండి పోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం ప్రాజెక్టులు నిండాయని చెప్పి, సంబరపడిపోతే సరిపోతుందా? అనే ప్రశ్న ఉదయించకమానదు. అందువల్ల అన్నదాతను అన్ని రకాలుగా ఆదుకునేందుకు సర్కారు సన్నద్ధం కావాలి.

# నేతన్నకు వెన్నుదన్నుగా ప్రభుత్వం

**- రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్**
**- ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు**





**విజయనగరం, ఆగస్టు 07 :**
చేనేత కార్మికులకు అన్నివిధాలా ప్రభుత్వం అండగా నిలుస్తోందని, రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారతా సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. రాట్నం తిప్పి, నూలు ఒడికి నేత కార్మికులను మంత్రి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 1905లో మహాత్మాగాంధీ విదేశీ వస్తు బహిష్కరణకు పిలుపునిచ్చారని, ఈ ఉద్యమంలో చేనేత కార్మికులు పోషించిన పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు. 2015లో ప్రధాని మోది ఇచ్చిన పిలుపు మేరకు ప్రతీఏటా ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించుకొని, నేత వస్త్రాలకు ప్రాచుర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. చేనేత వస్త్రాలకు దేశవిదేశాల్లో ఎంతో డిమాండ్ ఉందని, దానికి తగ్గట్టుగా వస్త్రాలను రూపొందించేందుకు నేత కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. చేనేత వస్త్రాల వాడకాన్ని పెంచేందుకు, కార్మికులను ఆదుకొనేందుకు ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. చేనేత కార్మికులకు 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేసిన ఘనత చంద్రబాబుదేనని చెప్పారు. నేతన్న సేవలో పథకం క్రింద రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 51,952 మంది, మన జిల్లాలో 709 మంది చేనేత కార్మికులను రూ.25,000 ఆర్థిక సహాయాన్ని ఈ రోజు వారి ఖాతాల్లో జమ చేస్తున్నారని చెప్పారు. మంగళగిరి, ధర్మవరం, పొందూరు లాంటిచోట్ల తయారయ్యే చేనేత వస్త్రాలకు ప్రత్యేక బ్రాండింగ్ తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. మన ప్రాంతంలో చేనేతకు ప్రసిద్ధి అయిన పొందూరులో, సెర్ప్ ఆధ్వర్యంలో కొత్తగా ఒక క్లష్టర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, అక్కడి నూలుతోనే సరికొత్త డిజైన్లతో వస్త్రాలను రూపొందించేందుకు ప్రణాళికను రూపొందించామని మంత్రి వెల్లడించారు. ఎంఎల్‌సి గాదె శ్రీనివాసులనాయుడు మాట్లాడు తూ, ప్రతీఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి నేత వృత్తిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో మాదిరిగానే ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి చేనేత వస్త్రాలను కొనుగోలు చేసేందుకు రూ.3,000 వరకు రుణం మంజూరు చేస్తే, అమ్మకాలు పెరిగే అవకాశం ఉందని సూచించారు. ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ, చేనేత వస్త్రాలను ధరించే అలవాటు పెరగాల్సి ఉందన్నారు. గతంలో చేనేత వస్త్రాలను ధరించే వారికి గొప్ప గౌరవం దక్కేదని అన్నారు. ఈ వృత్తిని కొనసాగించేందుకు చేనేత యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని, మగ్గాల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని అన్నారు. డిఆర్‌ఓ సిహెచ్ సత్తిబాబు మాట్లాడుతూ, దేశంలో వ్యవసాయం తరువాత చేనేత వృత్తే ప్రధానమైనదని అన్నారు. ఈ వృత్తిపై లక్షలాది కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని అన్నారు. వారిని ఆదుకొనేందుకు ప్రభుత్వం పలు రకాల సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళిశాఖ ఎడి డాక్టర్ వి.పద్మ, రాష్ట్ర పద్మశాలి సహకార సంఘం కన్వీనర్ ఎం.దేవేంద్రనాథ్, కొప్పులవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.రవికుమార్, నేత కార్మికులు త్రినాధ్, లక్ష్మణరావు మాట్లాడారు. ఈ సందర్భంగా సీనియర్ నేత కార్మికులను ఘనంగా సత్కరించారు. నేత వస్త్రాలతో ప్రత్యేకంగా ఒక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. అంతకు ముందు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన చేనేత అవగాహనా ర్యాలీని, ఎంఎల్‌సి గాదె శ్రీనివాసులనాయుడు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో నేతన్నలు పాల్గొన్నారు.

# లక్ష్మణ స్వామి వర్మ సేవలు ఆదర్శనీయం


**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**విజయనగరం: ఆగస్టు 7,**
పల్లవ రాజుల వారసులు, అగ్నికుల క్షత్రియుల జాతిపితమహులు, ఆయుర్వేద వైద్యులు పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ సేవలు ఆదర్శనీయమని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం లక్ష్మణ స్వామి వర్మ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ స్వామి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా లక్ష్మణ స్వామి వర్మ జయంతి వేడుకలు నిర్వహించాలని పిలుపునివ్వడం జరిగిందన్నారు. నౌక వాణిజ్య కేంద్రంగా ప్రసిద్ధి చెందిన కురంగరేశ్వరపురంలో జన్మించిన లక్ష్మణ స్వామి వర్మ అగ్నికుల క్షత్రియుల జీవితాల్లో మార్పు కోసం వారి అభివృద్ధి కోసం ఎంతగానో శ్రమించారన్నారు. 1890 సంవత్సరంలో 120 రకాల ఆయుర్వేద ఔషధాలు తయారుచేసి ఇండోనేషియా, జావా, ఆఫ్రికా వంటి దేశ విదేశాలకు సరఫరా చేయడంతో పాటు పేద రోగులకు ఉచిత వైద్య వసతులు ఏర్పాటు చేసిన మహనీయుడు లక్ష్మణస్వామి వర్మ అని మంత్రి కొనియాడారు. అగ్నికుల క్షత్రియ సంఘ ఏర్పాటుతోపాటు, అగ్నికుల దీపిక అనే సొంత ముద్రాలయంతో పత్రికలను ప్రచురించి అగ్నికుల క్షత్రియుల పూర్వ చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలను దశ దిశలా చాటి చెప్పారని అన్నారు. లక్ష్మణ స్వామి వర్మ జీవితం అన్ని వర్గాల వారికి ఆదర్శనీయమని, నేటి యువత ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసుల నాయుడు, ఇందుకూరి రఘురాజు లతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# త్వరలో వైద్య కళాశాల పనులు పూర్తి

**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**విజయనగరం, ఆగస్ట్ 07:**
త్వరలో ప్రభుత్వ వైద్య కళాశాల పనులను పూర్తి చేస్తామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆయన కలెక్టరేట్ వద్ద శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో యుటిలైజేషన్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడం వల్ల నాబార్డు ఫండ్స్ మురిగిపోయాయని చెప్పారు. ప్రస్తుతం సాస్కి ఫండ్స్‌తో కొత్తగా పనులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి గట్టిగా కృషి చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే చాలా వరకు పనులు పూర్తవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. మెడికల్ కాలేజ్ ఆసుపత్రి పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు, ప్రస్తుతం ఉన్న సర్వజన ఆసుపత్రిని కూడా ప్రభుత్వ ఆసుపత్రిగా కొనసాగించే దిశగా ప్రతిపాదనలను ముందుకు తీసుకువెళ్తున్నామని మంత్రి వివరించారు. మంత్రి తో బాటు ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు కూడా ఉన్నారు.

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**- స్వచ్ఛత కు మారుపేరు బ్రహ్మకుమారి స్ సంస్థ సేవలు**
**- ప్రపంచంలోనే యువకులు కలిగిన దేశం భారత్**
**- మోడీ, చంద్రబాబు గార్ల ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలు**
**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు**







**గజపతినగరం, ఆగస్టు 7,**
యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు పిలుపునిచ్చారు. శుక్రవారం గజపతినగరం లోని బ్రహ్మకుమారిస్ ఆశ్రమ ప్రాంగణంలో నషాముక్త్ కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ నషాముక్త్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోడీ గారు ఆగస్టు 4వ తేదీన వర్చువల్ గా ప్రారంభించినట్లు తెలిపారు. బ్రహ్మకుమారీస్ మరియు కేంద్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలు వంటి వాటికి దూరంగా ఉండాలని నషాముక్త్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. 10 కోట్ల మందిని వ్యసనాల నుండి విముక్తి చేసేలా చేయటమే ధ్యేయంగా స్వచ్ఛతకు మారుపేరైన బ్రహ్మకుమారిస్ పనిచేస్తుందని, అందులో భాగంగా మన గజపతినగరంలో ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం చాలా అవసరమన్నారు. గురజాడ చెప్పినట్లు దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అన్న నినాదాన్ని పూర్తిగా తీసుకుని పెద్దలు చెప్పే మంచి మాటలను యువత తప్పక ఆచరించాలన్నారు. ప్రపంచంలోనే అధిక శాతం యువకులు కలిగిన దేశంగా మన భారతదేశం కలిగి ఉండటం గర్వకారణమని, యువత మంచి భవిష్యత్తును పొందాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ గారు, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు యువతను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ వినూత్న కార్యక్రమాలు చేపట్టటం జరుగుతుందన్నారు. ప్రభుత్వాలు యువత కోసం విద్యా వైద్యం మౌలిక వసతులు కల్పిస్తుందని ఆ అవకాశాలను యువత వినియోగించుకోవాలన్నారు. మన విజయనగరం జిల్లాను డ్రగ్స్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడానికి యువత కృషి చేయాలన్నారు. ఉన్నతమైన లక్ష్యాలతో యువత ముందుకు సాగాలని చెడు అలవాట్లకు బానిస అయిన వారిని సమాజంలో గౌరవప్రదంగా చూడరని, విద్య ద్వారా తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, విద్య ద్వారా జ్ఞానం పొందడంతో పాటు, కుటుంబానికి ఆసరాగా నిలవచ్చని, తద్వారా మంచి సమాజాన్ని కూడా నిర్మించుకోవచ్చన్నారు. ప్రభుత్వం బ్రహ్మకుమారి సంస్థ చేపడుతున్న ఈ చైతన్య యాత్రలో నేటి యువత కూడా భాగస్వాములు కావాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. సభా కార్యక్రమానికి ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థుల చేత నషాముక్త్ (వ్యసనాల నుండి విముక్తి) కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ గారు, స్టేట్ యూత్ కోఆర్డినేటర్ బికె అన్నపూర్ణ, గజపతినగరం ఇంచార్జ్ బికె స్వాతి పాల్గొన్నారు.

# ఏపీలో భారీగా ఐఏఎస్ బదిలీలు.. 22 మంది అధికారులకు కొత్త బాధ్యతలు

**విజయనగరం, ఆగస్ట్ 07:**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిపాలనా వ్యవస్థలో కీలక మార్పులు చేపట్టింది. మొత్తం 22 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ, కొత్త పోస్టింగ్‌లను కేటాయించింది. పర్యాటకం, పాఠశాల విద్య, రవాణా, ఆరోగ్యం, హౌసింగ్, టీటీడీ, వీఎమ్ఆర్‌డీఏ, ఏపీ టూరిజం తదితర కీలక శాఖల్లో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి.ఎవరికి ఏ బాధ్యతలంటే.?పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రావత్ నియమితులమవ్వగా.. పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా శ్యామలరావు, రవాణా శాఖ కార్యదర్శిగా కోన శశిధర్ బాధ్యతలు స్వీకరించనున్నారు. రానున్న గోదావరి పుష్కరాల కోసం సురేశ్ కుమార్, భరత్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించింది ప్రభుత్వం. తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా ఎం.జయకృష్ణ, ఏపీఎస్ఆర్టీసీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా శివప్రసాద్ నియమితులయ్యారు.ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతల నుంచి ఆమ్రపాలిని రిలీవ్ చేసిన ప్రభుత్వం.. ఆమెను సాధారణ పరిపాలన శాఖకు రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. అలాగే.. తేజ్ భరత్, బి.అనిల్ కుమార్ రెడ్డిలను కూడా జీఏడీకి రిపోర్ట్ చేయాలని సూచించింది. పి.రవి సుభాష్‌కు ఏపీటీడీసీ ఎండీగా బాధ్యతలప్పగించింది. ఇక.. పురావస్తు శాఖ కమిషనర్‌గా ముత్యాలరాజు, ఆరోగ్య శాఖ కమిషనర్‌గా చక్రధర్ బాబుకు అదనపు బాధ్యతలు, డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్‌గా అరుణ్ బాబు నియమితులయ్యారు. విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ కమిషనర్‌గా ప్రఖర్ జైన్, టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ప్రభల గోపీనాథ్, ఎన్‌టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పద్మావతి నియమితులయ్యారు. అదేవిధంగా హౌసింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా హెప్సిబా రాణి, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బి.సునీల్ కుమార్ రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు.
ఈ భారీ స్థాయి ఐఏఎస్ బదిలీలతో రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. పలు ముఖ్య శాఖలకు కొత్త అధికారులను నియమించడం ద్వారా ప్రభుత్వ యంత్రాంగంలో మరింత సమర్థవంతమైన పాలనకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# దశాబ్దాల కల నెరవేర్చిన కూటమి ప్రభుత్వం

**- గరుడబిల్లి నుంచి నెలివాడ జంక్షన్ సిసి రోడ్డు ప్రారంభం**
**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**గజపతినగరం, ఆగస్టు 7,**
నియోజకవర్గంలోని బొండపల్లి మండలం గరుడ బిల్లి ప్రజల దశాబ్దాల కలను కూటమి ప్రభుత్వం నెరవేర్చటం చాలా ఆనందంగా ఉందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం కోటి 20 లక్షల రూపాయలతో నిర్మించిన గరుడబిల్లి నుంచి నెలివాడ జంక్షన్ సిసి రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా రహదారి లేక వేరే దారి నుండి రాకపోకలు సాగించే గరుడబిల్లి ప్రజల సౌకర్యార్థం కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ చిత్తశుద్ధితో రోడ్డు పనులు చేపట్టడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి 50 లక్షల రూపాయలకు తక్కువ కాకుండా అభివృద్ధి చేపట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అలాగే గ్రామస్తుల కోరిక మేరకు స్మశాన వాటిక, అంగన్వాడి కేంద్రం పనులు చేపట్టడంతో పాటు, గ్రామంలో వి బి జి రాంజీ పథకంలో పుంత రోడ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. 2014- 2019 సమయంలో సైతం నియోజకవర్గాన్ని నాటి శాసనసభ్యులు కొండపల్లి అప్పలనాయుడు గారు అభివృద్ధి పరచడం జరిగిందన్నారు. ప్రస్తుత కారణంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి కూటమి కార్యకర్తపై ఉందని మంత్రి కొండపల్లి సూచించారు. రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమం సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ దశాబ్దాల కల నెరవేర్చిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారి సేవలను కొనియాడారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో తనదైన శైలిలో అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలుకుతూ ముందుకు సాగుతున్న నాయకుడు కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, బిజెపి నాయకులు రెడ్డి పావని, మండల పార్టీ అధ్యక్షులు రాపాక అచ్చం నాయుడు, మాజీ జెడ్పిటిసి బండారు బాలాజీ, బుజ్జి రాజు, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి అపూర్వ స్పందన

- మంగళ హారతులతో మంత్రి కొండపల్లి గారికి స్వాగతం





**గజపతినగరం, ఆగస్టు 7,**
నియోజకవర్గంలో చేపడుతున్న ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి ప్రజల నుండి అపూర్వ స్పందన వస్తుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం బొండపల్లి మండలం గరుడ బిల్లి గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారికి తీన్మార్ వాయిద్యాలతో పువ్వులు జల్లుతూ స్వాగతం పలికారు. మహిళలు ఇంటి ముంగిటకు వెళ్ళగానే నుదుటన తిలకం దిద్ది, హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ కావడంతోనే ఇటువంటి అపూర్వమైన స్వాగతం లభిస్తుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు, ప్రతీ ఇంటికి కూటమి ప్రభుత్వంలో పథకాలు అందుతున్నాయన్నారు. రెండేళ్ల ప్రభుత్వ పాలన కరపత్రాలను అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి సారధ్యంలో రెండేళ్ల పాలనలో ప్రభుత్వం అనేక పథకాలను అమలుపరుస్తుందని తెలిపారు. అందులో ముఖ్యంగా పెన్షన్లు 3 వేల రూపాయల నుండి 4 వేల రూపాయలకు పెంచి రాష్ట్రవ్యాప్తంగా 62 లక్షల మందికి అందించడం జరుగుతుందన్నారు. అలాగే స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాత సుఖీభవ, దీపం పథకం ద్వారా ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఒక్కరికి కాకుండా ఇంట్లో చదువుతున్న ప్రతి ఒక్కరికి తల్లికి వందనం అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిది అన్నారు. గరుడబిల్లి ప్రజలు అందించిన అపూర్వ స్వాగతం చాలా ఆనందాన్ని కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, బిజెపి నాయకులు రెడ్డి పావని, మండల పార్టీ అధ్యక్షులు రాపాక అచ్చం నాయుడు, మాజీ జెడ్పిటిసి బండారు బాలాజీ, బుజ్జి రాజు, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# దేవస్థాన భూములను కాపాడాలి



**చిట్యాల, ఆగస్టు 7**
టీటీడీ కళ్యాణ మండపం కోసం ప్రజల విరాళాలతో కొనుగోలు చేసిన సర్వే నంబర్ 649లోని ఎకరం 12 గుంటల భూమిని సేల్ అగ్రిమెంట్ ప్రకారమే రిజిస్ట్రేషన్ చేసి పరిరక్షించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కనకదుర్గమ్మ ఆలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కళ్యాణ మండపం స్థలాన్ని కుదించి రిజిస్ట్రేషన్ చేయాలనే ప్రయత్నాలు అనుమానాలకు తావిస్తున్నాయని ఆరోపించారు. ప్రజా ప్రయోజనాల కోసమే ఈ అంశాన్ని లేవనెత్తుతున్నామని, ప్రతిపాదిత స్థలంలోనే కళ్యాణ మండపం నిర్మించాలని కోరారు. అలాగే మీడియాపై పరువు నష్టం దావా వేస్తామంటూ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, ప్రజల ముందే వాస్తవాలను వెల్లడించాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బొబ్బల శివశంకర్ రెడ్డి, జమాండ్ల శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, నిమ్మనగోటి శ్రీనివాస్, ఎస్కే షబానా అజీముద్దీన్, ఆగు అశోక్, మెండే సైదులు, జిట్టా బొందయ్య, జిట్ట శేఖర్ , ఆవుల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు..

# ప్రజల గుండెల్లో పొన్నమండ లక్ష్మణస్వామివర్మ

- అగ్నికుల క్షత్రియుల చరిత్రను చాటిచెప్పిన మహనీయుడు
- ఆయుయుర్వేదంతో వేలాది పేదలకు ఆరోగ్యాన్ని ప్రసాదించిన గొప్పవ్యక్తి
- రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర





**విజయవాడ, ఆగస్టు 07, 2026**
ప్రజాసేవకు అంకితమైన జీవితంతో సేవా కార్యక్రమాల ద్వారా మన్ననలు పొందిన రాజశ్రీ పొన్నమండ లక్ష్మణస్వామివర్మ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.
అగ్నికుల క్షత్రియ జాతిపిత స్వర్గీయ పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర.. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతా గోపీచంద్, అగ్నికుల క్షత్రియ, బీసీ సంఘాల నాయకులు తదితరులతో కలిసి పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పొన్నమండ లక్ష్మణస్వామివర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని పేర్కొన్నారు. అగ్నికుల క్షత్రియుల చరిత్రను భావితరాలకు చాటిచెప్పిన మహనీయుడు లక్ష్మణ స్వామి వర్మ అని.. ఆయన ఆయుర్వేదంతో వేలాది మంది పేదలకు ఆరోగ్యాన్ని ప్రసాదించారని పేర్కొన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులిచ్చిన గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, గౌరవ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. నాటి సమాజంలో ప్రజల సమస్యల్ని చూసి.. చలించిపోయి వారికి పొన్నమండ లక్ష్మణస్వామివర్మ అండగా నిలిచారన్నారు. పేదల కోసం కోరంగిలో ఉచిత వైద్యశాల ఏర్పాటు చేశారని.. అగ్నికుల క్షత్రియుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా పత్రికను నడిపించారన్నారు. అగ్నికుల క్షత్రియులను సమాజంలో చిన్నచూపు చూడటాన్ని సహించలేక చరిత్రను అధ్యయనం చేశారని.. అనేక ప్రాంతాల్లో తిరిగి శోధించి బ్రిటిష్ ప్రభుత్వానికి ఆధారాలు చూపించి అగ్నికుల క్షత్రియులుగా గుర్తింపు తీసుకొచ్చారన్నారు. ఇందుకు అనేక సంవత్సరాల పాటు పోరాడి ప్రత్యేకంగా జీవో వచ్చేలా చేసిన కృషి లక్ష్మణస్వామి వర్మగారి చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా అందరి ఆదరాభిమానాలను సొంతం చేసుకున్న పొన్నమండ లక్ష్మణస్వామివర్మ వంటి మహనీయుల అడుగుజాడల్లో నడిచే అవకాశం లభించడం తన అదృష్టమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ మహనీయుల త్యాగాలు, సేవలను స్మరించుకోవడంతో పాటు, వారు చూపిన స్ఫూర్తిదాయకమైన మార్గంలో నడవడం ద్వారా సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించడమే వారికి మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శౌంఠి శివరాం ప్రసాద్, సగర కార్పొరేషన్ డైరెక్టర్ తాడిశెట్టి వీరస్వామి, బీసీ సంఘ నాయకులు సంగేపు రంగారావు తదితరులతో పాటు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇ.జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రామిక వర్గాల సమస్యలపై పోరాటం చేసేది కమ్యూనిస్టు పార్టీ : చెరుపల్లి సీతారాములు



**చిట్యాల, ఆగస్టు 7 (**
శ్రామిక వర్గాల సమస్యలపై, కష్టజీవుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేసేది కమ్యూనిస్టు పార్టీలేనని సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. చిట్యాల పట్టణంలో శుక్రవారం నిర్వహించిన కామ్రేడ్ నారబోయిన సత్తమ్మ సంతాప సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమాలు బలంగా ఉన్నప్పుడే పాలక ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. చిట్యాల రైస్‌మిల్లు డ్రైవర్లు, కార్మికుల హక్కుల కోసం తన భర్త నారబోయిన భిక్షమయ్యతో కలిసి సత్తమ్మ ఎన్నో ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. అనంతరం సత్తమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, సరోజ, మండల నాయకులు బొబ్బిలి సుధాకర్ రెడ్డి, ఐతరాజు యాదయ్య, అక్కెనపల్లి నాగయ్య, బూర్గు కృష్ణవేణి, చింతపల్లి కృష్ణయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.డి. సలీం, జిల్లా నాయకులు దండెంపల్లి సత్తయ్య, రమేష్, నారబోయిన శ్రీను, మమత తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర ట్రేడర్స్ సెల్ కార్యవర్గ సభ్యునిగా చలమయ్య నియామకం



**తుర్కపల్లి ,ఆగస్టు 7** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ట్రేడర్స్ సెల్ కార్యవర్గ సభ్యునిగా తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన బిజెపి సీనియర్ నాయకుడు కందుకూరి చిన్న చలమయ్యను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి రాష్ట్రస్థాయిలో సేవ చేసే అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ట్రేడర్స్ సెల్ కన్వీనర్ ఉప్పల డాక్టర్ ఉప్పల శారద, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ ,జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్, రాష్ట్ర నాయకులు పాశం భాస్కర్, జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అన్నారు. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ట్రేడర్స్ సెల్ గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని, వ్యాపార వర్గాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వారి హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతానని తెలిపారు. భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వ్యాపార వర్గాలు విస్తృతంగా తీసుకెళ్ళేందుకు అంకితభావంతో పనిచేస్తానని అన్నారు

# ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట

- 'ఒక నెల -- ఒక గ్రామం -- నాలుగు సందర్శనలు' కార్యక్రమంలో నమోదైన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి
- ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలి
- క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి ప్రజలకు సత్వర న్యాయం అందించాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ





**పెనుగంచిప్రోలు: ఆగస్టు 07, 2026.**
ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీకి శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. ప్రజా సమస్యలను కేవలం అర్జీల పరిష్కారంగా కాకుండా, సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. 'ఒక నెల -- ఒక గ్రామం -- నాలుగు సందర్శనలు' కార్యక్రమంలో భాగంగా పెనుగంచిప్రోలులోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు, అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, ప్రతి నెలా ఒక నియోజకవర్గాన్ని ఎంపిక చేసి నాలుగు సార్లు ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలులో 'ఒక నెల -- ఒక గ్రామం -- నాలుగు సందర్శనలు' కార్యక్రమాన్ని మొదటివారం విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీపై పకడ్బందీగా, పూర్తి స్థాయి విచారణ జరిపి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ వారం నిర్వహించిన ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 160 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. వీటిలో ప్రధానంగా రెవెన్యూ భూ సంబంధిత సమస్యలు, పంచాయతీరాజ్‌కు సంబంధించిన సమస్యలు తదితర అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించినట్లు వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యలపై అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అర్జీలో పేర్కొన్న అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత వ్యక్తులతో మాట్లాడి, వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న అనంతరం నిబంధనల మేరకు ప్రజలకు అనుకూలంగా సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి అర్జీకి పరిష్కారం చూపడమే కాకుండా, భవిష్యత్తులో అదే సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కల్పించడంపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు, రెవెన్యూ, భూ సమస్యలు, పంచాయతీరాజ్ తదితర అంశాలకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి సత్వర పరిష్కారం అందించడమే 'ఒక నెల -- ఒక గ్రామం -- నాలుగు సందర్శనలు' కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో గడ్డిపాటి అనిల్ కుమార్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి, తహసీల్దార్ బి.కళ్యాణి, పాల్గొన్నారు.

# చేనేత మహిళా కార్మికులకు ఘనంగా సన్మానం..



**జనగామ/ బచ్చన్నపేట, ఆగస్టు 7**
జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలో జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా... చేనేత కార్మికులకు, మహిళ చేనేత కార్మికులకు ఘనంగా సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి సంఘం కార్యదర్శి గుర్రపు బాలరాజు మాట్లాడుతూ... అన్ని రంగాలలో చేనేత కార్మికులు ముందుండాలని పిలుపునిచ్చారు . విద్యారంగంలో కూడా చేనేత కార్మికుల పిల్లలు ముందుండాలని... అత్యున్నత స్థాయికి ఎదగాలని కోరారు. చేనేత రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం... చేనేత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. చేనేత జియో టాకింగ్, చేనేత భీమా, ముద్ర లోన్, చేనేత రుణమాఫీ, త్రిఫ్టుఫండ్ చేనేత కార్మికుడు 1200 రూపాయలు డిపాజిట్ చేస్తే గవర్నమెంట్ రెండింతలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వనుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష కార్యదర్శి బేతి కృష్ణమూర్తి, మంగళ కృష్ణమూర్తి, డైరెక్టర్ కొండా అనిత, వేముల వెంకటేశ్వర్లు, గణపురం నాగేష్, పామ్ రమేష్, వల్లాల శ్రీనివాస్, పాసికంటి జనార్ధన్, కుందారపు గోపాల్, గొల్లపల్లి బిక్షపతి, వేముల నరేష్, నరసింహులు బొమ్మ, జంజీరాల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# హార్ ఘర్ తిరంగా

- ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగరాలి
- మండల అధ్యక్షుడు కోడె రమేష్



**రాజన్న సిరిసిల్ల జిల్లా/గంభీరావుపేట/ఆగస్టు7**

హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకుభారతీయ జనతా పార్టీ గంభీరావుపేట మండల అధ్యక్షులు కోడె రమేశ్ పార్టీ కార్యాలయంలో కార్యవర్గ సమావేశంనిర్వహించారు.ఈ సందర్భంగా సమావేశా ముఖ్య అతిథి జిల్లా మీడియా ఇంచార్జ్ రాజు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగరవేయడం ద్వారా దేశ గౌరవాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు.ప్రతి కార్యకర్త ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ముందుండాలని సూచించారు.ఈనెల 10 తేదీన ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు ప్రతి కార్యకర్త నాయకులు కుటుంబ సమేతంగా జాతీయ జెండాను ఇంటిపై ఆవిష్కరించాలని అంతేకాకుండా కేంద్ర రాష్ట్ర మరియు జిల్లా అధ్యక్షుల పిలుపుమేరకు ఈనెల12 తేదీన మండల స్థాయిలో హర్ ఘర్ తిరంగా యాత్రను నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ డాక్టర్.సత్యనారాయణ.ఉపాధ్యక్షులు నర్సింలు.కార్యదర్శులు రాజు.స్వామి.నాయకులు పత్తి స్వామి.బండ దేవయ్య.నాగరాజ్ గౌడ్.సర్వోత్తమ్.శ్రీనివాస్.తిరుపతి.లింగం.శ్రీనివాస్ చారి.శ్రీనివాస్.దేవేందర్ యాదవ్.ప్రసాద్.రమేష్.శంకర్.రాజు.శ్రీధర్గౌడ్.రాజు.నవీన్.ఎల్లం.స్వామి పాల్గొన్నారు

# కేశిరెడ్డిపల్లి అంగన్వాడీ కేంద్రం లో తల్లిపాల వారోత్సవాల...!



**జనగామ/బచ్చన్నపేట, ఆగస్టు 07 :):**

తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అంగన్వాడీ టీచర్ భైరగొని అంజుమ్... తల్లులకు పలు సూచనలు చేశారు. ముఖ్యగా తల్లి డెలివరీ అయిన తర్వాత మొదటిగా వచ్చే ముర్రుపాలను పిల్లలకు గంటలోపు తప్పకుండా పట్టించాలి. ఆ ముర్రు పాలు పట్టించినట్లయితే మనం పిల్లలకు అమృత సంజీవిని అందించిన తల్లులం అవుతాం అని... పిల్లలకు ఆరు నెలల వరకు పూర్తిగా తల్లిపాలు మాత్రమే పట్టించాలని, పిల్లలు తల్లి నుండి తాగే పాలలో మొదటగా నీటి అవసరాన్ని తీర్చేవి ఆ తర్వాత వచ్చే పాలు బిడ్డకు శక్తినిచ్చేవి గా ఉంటాయి అని, ఒక్క రోజులో బిడ్డ కోరినన్నిసార్లు తల్లి బిడ్డకు పాలు పట్టాలని, ఆరు నెలలు నిండిన తర్వాత కూడా అనుబంధ ఆహారంతో పాటు తల్లిపాలను కూడా పట్టాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ అంజుమ్, ఆశాలు సులోచన, రమ, తల్లులు, కావ్య, వాని, నవనీత, రవళి, సంధ్య, కళ్యాణి, సుజాత, చైతన్య, సరళ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపికి హటావో దేశ్ కి బచావో



**రాజన్న సిరిసిల్ల జిల్లా/గంభీరావుపేట/ఆగస్టు7**

మండల కేంద్రంలో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద బిజెపి హటావో దేశ్ బచావో కరపత్రం ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మానేరు పరిరక్షణ కమిటీ కన్వీనర్ గుంటి వేణు, మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 6 నుండి 14 న ఎగువ మానేరుకు చాడ వెంకటరెడ్డి సిపిఐ జాతీయ నేత మాజీ ఎమ్మెల్యే వస్తున్నారు కాబట్టి ప్రజలు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలోకో కన్వీనర్లు చెన్నమనేని పురుషోత్తం రావు,భూస వేణు.మార్వాడి సుదర్శన్ (డిఎల్ఎఫ్.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) జాతీయ మాలల ఐక్య వేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దోసల చంద్రం. నాయకులు ఈబాదుల్లా ఖాన్.ఎర్ర మల్లయ్య.సిపిఐ నాయకులు దోసల వెంకటేష్. నాందేడ్ మనోజ్ కుమార్.బరిగెల బిక్షపతి.తదితరులు పాల్గొన్నారు

# అంగరంగ వైభవంగా కట్ట మైసమ్మ దేవాలయంలో అమ్మవారి కళ్యాణం వైభవంగా

**మల్కాజిగిరి ఆగస్టు 07**



ఇందిరా నెహ్రూ నగర్ లోని కట్ట మైసమ్మ దేవాలయం లో లిఅమ్మవారి కళ్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. లిఈ కార్యక్రమానికి బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్ హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజ నిర్వహించారు ఈ కార్యక్రమంలో లిసుదామమా,శెంకర్,నాగేష్ గౌడ్ విజయ్,లక్ష్మణాచారి,మరియు మహిళానాయకురాలు,లక్ష్మి,లలిత, కుసుమ,వరలక్ష్మి,జ్యోతి,కవిత తదితరులు పాల్గొన్నారు.

# క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను అత్యంత పకడ్బందీగా చేపట్టాలి

- నోటీసు జారీ చేసిన ఏడు రోజుల్లోగా విచారణ పూర్తి చేయాలి
- ప్రతిరోజు కనీసం 70 క్లెయిమ్స్
- అభ్యంతరాలపై విచారణ జరిపి పరిష్కరించాలి
- క్షేత్రస్థాయి విచారణలో స్టేట్మెంట్ను పక్కాగా నమోదు చేయాలి
- క్లెయిమ్స్, అభ్యంతరాల సమాచారాన్ని రాజకీయ పార్టీలకు అందజేయాలి
- ఎన్టీఆర్ జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎం.వి.శేషగిరి బాబు



**విజయవాడ: ఆగస్టు 7,2026.**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా అందిన ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా విచారణ చేసి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎన్టీఆర్ జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, రాష్ట్ర లేబర్, ఫ్యాక్టరీస్, బాయిలర్స్ అండ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఎల్ఎఫ్బీ ఒ ఐఎంఎస్) సెక్రటరీ ఎం.వి.శేషగిరి బాబు అధికారులను ఆదేశించారు. విజయవాడ కలెక్టరేట్లోని ఏవీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో శుక్రవారం ఎస్ఐఆర్ ప్రక్రియపై పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, ఏడు నియోజకవర్గాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు), వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనగా, కొంతమంది శాసనసభ్యులు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎం.వి.శేషగిరి బాబు మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి అందిన ప్రతి క్లెయిమ్, అభ్యంతరం ఎంతో ప్రాధాన్యత కలిగినదని పేర్కొన్నారు. ప్రతి దరఖాస్తును పూర్తిస్థాయిలో పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం మాత్రమే నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

క్లెయిమ్ లేదా అభ్యంతరంపై నోటీసు జారీ చేసిన అనంతరం ఏడు రోజుల్లోగా విచారణ ప్రక్రియను పూర్తి చేసి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్లో ఉన్న క్లెయిమ్స్, అభ్యంతరాలను వేగంగా పరిష్కరించేందుకు ప్రతిరోజూ కనీసం 70 కేసులపై విచారణ చేపట్టి పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించే సమయంలో సంబంధిత వ్యక్తుల స్టేట్మెంట్లను స్పష్టంగా, పక్కాగా నమోదు చేయాలని, విచారణకు సంబంధించిన అన్ని అంశాలను రికార్డుల్లో పొందుపరచాలని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా నిబంధనల ప్రకారం పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకతను మరింత పెంచేందుకు క్లెయిమ్స్, అభ్యంతరాలకు సంబంధించిన సమాచారాన్ని నిబంధనల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందుబాటులో ఉంచాలని సమావేశంలో సూచించారు. రాజకీయ పార్టీలు తమ పరిధిలోని ఓటర్ల జాబితాలను పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు లేదా లోపాలు ఉంటే నిర్ణీత సమయంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు జిల్లా స్థాయి అధికారులు, ఈఆర్ఓలు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షిస్తూ, అనర్హుల పేర్లను గుర్తించే విధంగా ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. శాసనసభ్యులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశంలో ప్రస్తావించిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని, నిబంధనల మేరకు తగిన చర్యలు చేపడతామని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ తెలిపారు.

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియలో బీఎల్ఓలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలోని కొన్ని ఫోటోల్లో స్పష్టతకు సంబంధించిన లోపాలు ఉన్నట్లు గుర్తించామని, ఈ దశలోనే వాటిని సరిచేసి ప్రతి ఓటరు ఫోటో స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల ఓట్లు వేర్వేరు పోలింగ్ బూత్ల పరిధిలో ఉండకుండా, నిబంధనలకు అనుగుణంగా సాధ్యమైనంత వరకు ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఉండేలా జాగ్రత్తగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. బీఎల్ఓలు, బూత్ లెవల్ ఏజెంట్లతో (బీఎల్ఏలు) సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియ, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిశీలన, ఓటర్ల వివరాల ధృవీకరణ తదితర అంశాలపై పూర్తి అవగాహన కల్పించాలని సంబంధిత ఈఆర్ఓలను ఆదేశించారు. ఎలక్టోరల్ రోల్ సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఏలు కూడా చురుకుగా పాల్గొని తమ పరిధిలోని అంశాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.

సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి పలు అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గతంలో ఓటు హక్కును వినియోగించుకున్నప్పటికీ, ప్రస్తుతం ప్రభుత్వం నిర్దేశించిన 11 రకాల ధ్రువపత్రాల్లో ఏ ఒక్కదానినీ సమర్పించలేని కొంతమంది ఓటర్లకు ఓటర్ కార్డులు ఉన్నాయని, అలాంటి వారి క్లెయిమ్స్ పరిష్కారానికి సంబంధించి తగిన పరిశీలన చేయాలని కోరారు. అలాగే భార్యాభర్తల ఓట్లు వేర్వేరు పోలింగ్ బూత్ల పరిధిలో ఉన్న సందర్భాలను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఒకే బూత్ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే విధంగా కొత్త ఓటర్ల నమోదుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అర్హులైన యువత, కొత్తగా ఓటు హక్కు పొందే వారు ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు.సమావేశంలో చివరిగా ఓటర్ల ఫోటోతో కలిగిన జాబితాలను వివిధ పార్టీల ప్రతినిధులకు ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ చేతుల మీదుగా అందజేశారు.

ఈ సమావేశంలో డీఆర్ఓ ఎం.లక్ష్మీ నరసింహం, మున్సిపల్ కమిషనర్, విజయవాడ సెంట్రల్ ఈఆర్ఓ హెచ్.ఎం. ధ్యాన్ చంద్ర, తిరువూరు ఈఆర్ఓ అరవ కుమార్, విజయవాడ వెస్ట్ ఈఆర్ఓ అదుర్తి రవీంద్రరావు, విజయవాడ ఈస్ట్ ఈఆర్ఓ వెన్నెల శ్రీను, మైలవరం ఈఆర్ఓ టి.వి.సతీష్, జగ్గయ్యపేట ఈఆర్ఓ మేడక రజనీకుమారి, బీజేపీ ప్రతినిధి పైల సురేష్ బాబు, ఐఎన్సీ ప్రతినిధి బొర్రా కిరణ్, బీఎస్పీ ప్రతినిధి ఎ.పవన్ కార్తీక్, టీడీపీ ప్రతినిధులు ఎదుపాటి రామయ్య, సిహెచ్.వంశీకృష్ణ, ప్రత్తిపాటి శ్రీధర్, వైఎస్సార్సీపీ ప్రతినిధులు వై. ఆంజనేయ రెడ్డి, ఆర్. కేదారేశ్వరరావు, జేఎస్పీ ప్రతినిధి జంగం శ్రీనివాస్, ఏపీపీ ప్రతినిధి పి. హరికృష్ణ, ఎన్నికల సెక్షన్ ఇన్చార్జి సూపరింటెండెంట్, డిప్యూటీ తహసిల్దార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా అమరావతి ఛాంపియన్షిప్ పోటీలు

- క్రీడాకారులను ఉత్సాహపరిచిన న జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**ఎన్టీఆర్ జిల్లా -- నందిగామతేదీ: 07 ఆగస్టు, 2026**

ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అమరావతి ఛాంపియన్షిప్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. శుక్రవారం నందిగామ జెడ్పీ హైస్కూల్లో ఖో–ఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడాంశాల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 815 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కలెక్టర్ లక్ష్మీశ క్రీడాకారులతో ముచ్చటించి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. పోటీల నిర్వహణ, క్రీడాకారులకు కల్పించిన సౌకర్యాలు, మైదాన ఏర్పాట్లను కూడా కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. పోటీలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించడంతో పాటు క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఈ సందర్భంగా ఆయన అధికారులకు సూచించారు. జిల్లాలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి జిల్లా జట్టుకు ఎంపిక చేయడం పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్చంద్ జయంతిని పురస్కరించుకుని ఏటా ఆగస్టు 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో జులై 15 నుంచి ఆగస్టు 26 వరకు అమరావతి ఛాంపియన్షిప్--2026 పోటీలు జరుగుతున్నాయి. నియోజకవర్గం మొదలు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్బాల్, చెస్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్లిఫ్టింగ్, వాలీబాల్, యోగా తదితర 12 క్రీడాంశాల్లో పోటీలు జరుగుతున్నాయి. కార్యక్రమంలో డీఎస్డీవో కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రాజెక్టులకు చట్టబద్ధ అనుమతులపై

## సమీక్ష సరికాదుజలశక్తి మంత్రికి హరీశ్‌రావు లేఖ

**హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు, సాంకేతిక క్లియరెన్స్‌లు పొందిన తెలంగాణకు చెందిన ఏడు ప్రాజెక్టులను మళ్లీ సమీక్షించే అంశాన్ని జీఆర్ఎంబీ సమావేశం ఎజెండాలో చేర్చడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ మేరకు జలశక్తి మంత్రికి, సెక్రటరీకి రాసిన లేఖను విడుదల చేశారు .కేంద్రం ఇప్పటికే చట్టబద్ధంగా ఇచ్చిన అనుమతులను గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమీక్షించడం సరికాదన్నారు. అజెండా లో పేర్కొన్న అంశాలను ఉపసంహరించు కోవాలని, పెండింగ్‌లో ఉన్న సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్ అనుమతులను తక్షణమే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని పలు భారీ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన సాంకేతిక, హైడ్రోలాజికల్, ఇంజనీరింగ్, పర్యావరణ, చట్టపరమైన అంశాలను కేంద్ర జల సంఘం , జలశక్తి మంత్రిత్వ శాఖలు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ఆమోదం తెలిపిందని గుర్తుచేశారు.కేంద్ర ప్రభుత్వ అత్యున్నత సంస్థలు చట్టబద్ధంగా అనుమతులు ఇచ్చిన తర్వాత, ఆ నిర్ణయాలను మళ్లీ సమీక్షించే లేదా రద్దు చేసే అధికారం గోదావరి బోర్డు లాంటి కింది స్థాయి సంస్థకు ఏమాత్రం ఉండదని స్పష్టం చేశారు. జలశక్తి మంత్రిత్వ శాఖ ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలను మళ్లీ సమీక్షించే ందుకు జీఆర్ఎంబీకి అవకాశం ఇస్తే, అది కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రాధాన్యతను తగ్గించినట్లు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.తెల ంగాణలోని కాళేశ్వరం, చౌటుపల్లి హనుమం త్ రెడ్డి, ముక్తేశ్వరం, చనాక-కొం ట, మోడికుంటవాగు, కడెం-గూడెం, సీతా రామ లిఫ్ట్ ఇరిగేషన్ వంటి కీలక ప్రాజెక్టులకు సుదీర్ఘ ప్రక్రియ తర్వాతే అనుమతులు వచ్చాయని, ఇప్పుడు వాటిని మళ్లీ సమీక్షించాలని ఎజెండాలో పెట్టడం సరికాదని పేర్కొన్నారు. దీని వల్ల తెలంగాణలో సాగునీటి అభివృద్ధి కుంటుపడటంతో పాటు, కోట్లాది మంది రైతుల జీవనోపాధి, తాగునీటి భద్రత ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. సెంట్రల్ వాటర్ కమిషన్ నుంచి ఇప్పటికే హైడ్రోలాజికల్ అనుమతులు పొందిన సమ్మక్క సాగర్ ఎత్తిపోతల పథకానికి మిగిలిన చట్టబద్ధమైన అనుమతులను కూడా మంజూరు చేయాలని కేంద్రప్రభుత్వాన్నికోరారు. లేఖలో పేర్కొన్నారు.




## ప్రభుత్వానికి డెడ్‌లైన్ జూరాల కింద పంపులు

### ఆన్ చేయకపోతే నార్లాపూర్ ముట్టడి నిరంజన్ రెడ్డి హెచ్చరిక

**హైదరాబాద్ :** జూరాలకింద ఉన్న భీమా ఫేజ్-1, 2, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ లిఫ్ట్‌లతో పాటు జూరాల కాలువలు, కేఎల్ఐ కింద ఉన్న మూడు పంపులను తక్షణమే ప్రారంభించాలని బీఆర్ఎస్ నాయకుడు,మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసినా మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ నెల 11 వరకు పంపులను ఆన్ చేయకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలసి లక్షలాది మంది రైతులతో నార్లాపూర్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అక్కడ రైతులు, ప్రజలతో కలిసి చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. పాలమూరు బిడ్డనని చెప్పుకుంటూ..పాలమూరుకు నీళ్లు ఇవ్వకుండా ఏపీకి నీళ్లు తరలించేందుకు చంద్రబాబుకు రేవంత్ రెడ్డి సహకారం అందిస్తున్నాడని విమర్శించారు.రెండున్నరేళ్ల నుంచి పాలమూరు-రంగారెడ్డిలో తట్టెడు మట్టి కూడా ఎత్తకుండా పడావు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 802 మీటర్ల వద్ద కల్వకుర్తి ఎత్తిపోతల నుంచి నీళ్లు ఎత్తిపోసి దిగువన ఉన్న రైతాంగాన్ని ఆదుకోవచ్చని సూచించారు. 854 మీటర్లలో నీళ్లు ఉన్నా నీళ్లను ఎందుకు ఎత్తిపోయడం లేదని ప్రశ్నించారు.కృష్ణా నదికి ఎగువ నుంచి భారీగా వరద వస్తున్నా, నీళ్లే లేవంటూ రైతాంగాన్ని రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నాడని దుయ్యబట్టారు. ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేకపోవడం, పాలమూరు రైతాంగాన్ని ఆదుకోవాలనే ఆలోచన లేకపోవడం విచారకరమని నిరంజన్ రెడ్డి అన్నారు. కర్నాటకలోని జలవనరులన్నీ నిండిపోగా వృథాగా పోయే నీటితోనే రోజుకు 5వేల క్యూసెక్కుల నీరు డిసెంబర్ వరకు జూరాలకు వస్తాయని తెలిపారు. దీని వల్ల పాలమూరుకు పుష్కలంగా నీరు ఇవ్వవచ్చని తెలిపారు.



## మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలి

### డాక్టర్ గుమ్మడి వెన్నెల

**మెదక్:** గద్దర్ చరిత్ర నేటి యువతకు స్ఫూర్తిగా నిలవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ గుమ్మడి వెన్నెల అన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్న ప్రదేశంలో శుక్రవారం ఆమె గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం జీవితాంతం పరితపించిన గద్దర్ తన పాటల ద్వారా దోపిడీ వ్యవస్థను ప్రశ్నించారని అన్నారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. జీవితాంతం పీడిత ప్రజలు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు గద్దర్ అని పేర్కొన్నారు.ఆట, పాటల ద్వారా దేశవ్యాప్తంగా ప్రజల్లో చైతన్యం నింపారని అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రజలను చైతన్యపరిచి ఉద్యమానికి ఊపిరి పోసిన గొప్ప ప్రజాకవిగా గద్దర్ చరిత్రలో నిలిచిపోయారని వెల్లడించారు. గద్దర్ జన్మించిన మెదక్ జిల్లాకు ఆయన పేరును ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని ప్రజా సంఘాల తరఫున డిమాండ్ చేశారు. గద్దర్ ఆశయాలను భావితరాలు కొనసాగించాలని, ఆయన చూపిన సామాజిక న్యాయం మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు.మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మల మైసయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బండారు గంగాధర్, సీనియర్ జర్నలిస్టు బొందుగుల నాగరాజు మాట్లాడుతూ ట్యాంక్ బండ్ పై కూడా గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నూతనంగా ఏర్పడిన మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నర్సింహాచారి, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌లను డాక్టర్ గుమ్మడి వెన్నెల సన్మానించారు.కార్యక్రమంలో మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్య దర్శి ఆకుల పెంటయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు గంట సంపత్, జుబేర్, కాంగ్రెస్ నాయకుడు మహేందర్‌రెడ్డి, మెదక్ జిల్లా టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు శంకర్ దయాళ్‌చారి, రిటైర్డ్ ఉపా ధ్యాయులు రాధాకిషన్, మనోహర్, ఇసాక్, రవిశంకర్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు అప్పా జీపల్లి సురేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు అస్తం గల్ల బాల్‌రాజు, గజ్జల ప్రేమ్‌కుమార్, దాసు పాల్గొన్నారు.



## భావోద్వేగానికి గురికాలేదు

### కాళేశ్వరం అర్చకులు

**కాళేశ్వరం:** ఆలయ పునర్నిర్మాణంపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థాన అర్చకులు ఖండించారు. ఈ మేరకు వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆలయ కూల్చివేత నేపథ్యంలో అర్చకులు భావోద్వేగానికి గురయ్యారని, పునర్నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని అన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి తాము పూర్తి మద్దతు తెలుపుతున్నామని, కృష్ణశిలతో శాశ్వత రాతి కట్టడంగా ఆలయం నిర్మాణం కావడం తమ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. శృంగేరి శారదా పీఠం జగద్గురు శ్రీ శ్రీ శ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి అనుమతి, ఆశీస్సులతోనే శాస్త్రోక్తంగా పునర్నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు.దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఆధ్వర్యంలో జూన్ 16న ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు, విలేకరుల సమావేశం (గ్రాతీవం వీవవ్) నిర్వహించి పునర్నిర్మాణ వివరాలను వెల్లడించామని, జూన్ 17న కళాపకర్షణ, ద్వారబంధనం నిర్వహించి ఆదిముక్తీశ్వర స్వామి ఆలయంలో బాలాలయాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం నిత్యాభిషేకాలు, నిత్యార్చనలు, కాలసర్ప దోష నివారణ, శని (నవగ్రహ) పూజలు యథావిధిగా కొనసాగుతున్నాయని వెల్లడించారు.రూ.198 కోట్లతో ప్రభుత్వం కాళేశ్వర క్షేత్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తోందని, శిథిలావస్థకు చేరిన 1982 నాటి గర్భాలయ స్థానంలో కృష్ణశిలతో శాశ్వత రాతి కట్టడాన్ని నిర్మిస్తున్నట్లు వివరించారు. భక్తులు సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని, దేవస్థానం అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని కోరారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు పనగంటి ఫణీంద్ర శర్మ, ముఖ్య అర్చకులు ఆరుట్ల రామాచార్యులు, అర్చకులు గట్టు రాము, రామకృష్ణ, శరత్ చంద్ర శర్మ, పవన్ శర్మ, విజయ్ శర్మ, రాజు శర్మ, ఫణి శర్మ, రాధాకృష్ణ శర్మ పాల్గొన్నారు.



## కేసులు పెట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి

**మంచిర్యాల అర్బన్ :** ప్రభుత్వ అక్రమాలపై నిలదీసిన ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడమే అధికార కాంగ్రెస్ లక్ష్యమని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆరోపించారు. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల ఘటనకు సంబంధించిన కేసులో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలసి కోర్టుకు హాజరైన అనంతరం ఆమె కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.క్యాతనపల్లి మున్సిపాలిటీలో మెజారిటీ లేకపోయినా అధికార పార్టీ ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరించి చైర్మన్ ఎన్నికను ప్రభావితం చేసిందని ఆరోపించారు. ఆ సమయంలో పోలీసు శాఖ కూడా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించిందని, తమ పార్టీ కౌన్సిలర్లను స్వేచ్ఛగా వ్యవహరించనివ్వలేదని దుయ్యబట్టారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచినా రాష్ట్రంలో అభివృద్ధి కనిపించలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు తప్పు చేయకపోయినా రాజకీయ కక్షతో కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ వేధింపులను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో వారికి తగిన సమాధానం ఇస్తారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ మాజీ వైస్ జడ్పీ చైర్పర్సన్ మూల రాజీరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాజరమేష్, టీబీజీకేఎస్ నాయకులు మెడిపెల్లి సంపత్ తదితరులు పాల్గొన్నారు.



### కేసులకు భయపడేది లేదు ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తాం బాల్క సుమన్

**మంచిర్యాల అర్బన్:** కేసులకు భయపడేది లేదు.. ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న ఘటన పై నమోదైన కేసులో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మితో కలిసి మంచిర్యాల జిల్లా కోర్టుకు హాజరయ్యారు. దీంతో కేసు విచారణను న్యాయస్థానం వచ్చే నెల సెప్టెంబర్ 25కు కేసును వాయిదా వేసింది. అనంతరం బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు మెజారిటీ ఇచ్చినా, కాంగ్రెస్ పార్టీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకునేందుకు అక్రమ మార్గాలను ఆశ్రయించిందని ఆరోపించారు. ఆ ఘటనలో తమపై తప్పుడు కేసులు నమోదు చేసి జైలుకు పంపించారని విమర్శించారు. ప్రజల ఓట్లతో గెలిచిన బీఆర్ఎస్ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేయడానికి కోట్ల రూపాయలు, బ్లాంక్ చెక్కులు చూపించినా వారు లొంగలేదని పేర్కొన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేసినందుకే తమపై కక్షపూరితంగా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం మాట్లాడినా, ఉద్యమాలకు పిలుపునిచ్చినా గతంలో తనపై కేసులు పెట్టి 20 రోజుల పాటు చంచల్ గూడ జైలులో ఉంచారన్నారు.




## ఇందిరమ్మ చీరలు

### ఎలుకలపాలవుతున్నాయి మన్నె క్రిషాంక్

**హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్న ఇందిరమ్మ చీరలు ఎలుకల పాలువుతున్నాయని బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిషాంక్ ఆరోపించారు. కంటోన్మెంట్‌లోని ఈ వర్క్ షాపులో ఇందిరమ్మ చీరలు పడేశారు, అవన్నీ ఎలుకలు కొరుకుతున్నాయని తెలిపారు. 2025 నవంబర్ నెలలో కోటి ఇందిరమ్మ చీరలు పంచుతామని ప్రకటించి, ఇప్పటివరకు కూడా పంపిణీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు చీరలు ఒద్దు అంటున్నారా లేక మీరే కావాలని పంచడంలేదా ప్రజాధనం ఎందుకు వృథా చేస్తున్నారు అని ప్రశ్నించారు.





### హైకోర్టు విచారణకు హాజరైన సందీప్ కుమార్ సుల్తానియా

ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాను పోలీసులు హైకోర్టులో హాజరు పరిచారు. కంటోన్మెంట్ బోర్డు నిధుల వ్యవహారంలో సందీప్ సుల్తానియాను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచాలని పోలీసులను ఆదేశించిన హైకోర్టు ఆదేశింది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం సందీప్ సులానియాను పోలీసులు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. కాగా, కంటోన్మెంట్ బోర్డుకు కొన్ని నిధులు విడుదల చేశామని, మిగతా నిధులు పలు విడతల్లో విడుదల చేస్తామని సుల్తానియా కోర్టుకు తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న తప్పుల వల్ల అధికారులు కోర్టు ధిక్కరణ కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని హైకోర్టు వ్యాఖ్యానించింది.

## కాట్రేపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలోకి పాము

**మక్తల్:** మక్తల్ మండలంలోని కాట్రేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల లోని ఓ తరగతి గదిలోకి గురువారం పాము వచ్చింది. పామును చూసిన విద్యార్థులు భయాందోళన చెందారు. వారు వెంటనే ప్రధానోపాధ్యాయుడు నర్సిరెడ్డికి తెలిపారు. ఆయన గ్రామంలోని యువకులకు ఈ విషయం చెప్పడంతో వారు వచ్చి పామును చంపారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు గోప్యంగా ఉంచాలనుకున్నారు.నారాయణపేట జిల్లా, నారాయణపేట మండలంలోని ఏ క్లాస్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం మూడో తరగతి చదువుతున్న రంజిత్ అనే విద్యార్థికి పాము కాటు వేసింది. అతడు చికిత్స పొందుతూ మృతిచెందిన విషయాన్ని గుర్తు చేసుకున్న ఉపాధ్యాయులు శుక్రవారం తమ పాఠశాలలో కి పాము వచ్చిన విషయాన్ని బయటపెట్టారు. ఉపాధ్యాయులు తమ పాఠశాలలోకి పాము వచ్చిన విషయాన్ని ఆలస్యంగా బయటకు తెలియజేయడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల పరిసరాల ఇరువైపులా పూర్తిస్థాయిలో ముళ్లపొదలు ఉండటం వల్లనే పాములు, విషపురుగులు పాఠశాలలోకి వస్తున్నాయి. దీంతో తమ పిల్లలకు ప్రమాదం పొంచి ఉన్నదని, అధికారులు స్పందించి పాఠశాల ఆవరణతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని వారు కోరుతున్నారు.

విద్యార్థులకు ఎలాంటి ప్రాణహాని లేకుండా చూడాలని వారు అధికారులకు విన్నవిస్తున్నారు.



# ఏపీ ప్రతిష్ఠకు తగ్గట్టుగా దసరా ఉత్సవాలు

## అధికారులకు మంత్రి ఆనం ఆదేశాలు

**విజయవాడ:** విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రి ఆనంకు ఆలయ మర్యాదలతో ఈవో, ఆలయ చైర్మన్, అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆపై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానతరం వేద పండితుల ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను మంత్రి స్వీకరించారు. తరువాత ఆలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని మంత్రి సూచించారు. వీఐపీ దర్శనాలతోపాటు సాధారణ భక్తుల దర్శనాలు కూడా సజావుగా కొనసాగేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్,



షటిల్ సర్వీసులు, అత్యవసర సేవలను ముందుగానే సిద్ధం చేయాలని సూచనలు చేశారు. ఆలయ పరిసరాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆలయ మాస్టర్ ప్లాన్ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడొద్దని అధికారులకు మంత్రి స్పష్టమైన సూచనలు చేశారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. దసరా ఉత్సవాలను రాష్ట్ర ప్రతిష్ఠకు తగ్గట్టుగా అత్యంత వైభవంగా నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం.. ఆలయాల అభివృద్ధి, భక్తుల సంక్షేమానికి కట్టుబడి ఉంది మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

# దేశంలో అత్యుత్తమ జోన్‌గా సౌత్ కోస్ట్ రైల్వే

## రూ.2,493 కోట్ల ఆదాయంతో రికార్డు



**న్యూఢిల్లీ:** వైజాగ్ రైల్వే జోన్ రికార్డు స్థాయిలో పురోగతి సాధించిందని కేంద్ర రైల్వే శాఖ వెల్లడించింది. వార్షికంగా రూ.2,493 కోట్ల ఆదాయంతో దేశంలోనే అత్యుత్తమ జోన్‌గా సౌత్ కోస్ట్ రైల్వే నిలిచిందని పేర్కొంది. అతిస్వల్ప కాలంలోనే సౌత్ కోస్ట్ రైల్వే జోన్ సత్తా చాటిందని తెలిపింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో రూ.54,000 కోట్ల విలువైన రైల్వే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, పైప్‌లైన్‌లో మరో రూ.71,000 కోట్ల విలువైన ప్రాజెక్టులు ఉన్నాయని కేంద్రం పేర్కొంది. విశాఖపట్నం రైల్వే యార్డ్ ఆధునికీకరణ కోసం రూ.300 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపింది.అలాగే గుంతకల్ - బళ్లారి నాలుగు లైన్ల విస్తరణకు రూ.1,205 కోట్లు కేటాయించినట్లు కేంద్ర రైల్వే శాఖ పేర్కొంది. విజయవాడ డివిజన్ కేంద్రంగా రైల్వే అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని.. 5 కొత్త రైల్వే మార్గాలు, 24 మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించింది. రైళ్ల భద్రతే లక్ష్యంగా 100 ఇంజిన్లలో 'కవచ్' వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. 2026 చివరి నాటికి తొలి 100 కిలోమీటర్ల పరిధిలో కవచ్ వ్యవస్థ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నట్లు చెప్పింది. విశాఖపట్నం రైల్వే యార్డ్ పునర్నిర్మాణంలో భాగంగా 6 కొత్త ప్లాట్‌ఫారమ్‌లు అందుబాటులోకి రానున్నాయని పేర్కొంది. తిరుపతి రైల్వే స్టేషన్‌లో భక్తుల రద్దీని నియంత్రించేందుకు రూ.20 కోట్లతో ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపింది.రైల్వే ప్రమాదాల నివారణకు ఏపీ వ్యాప్తంగా 300కు పైగా రోడ్ ఓవర్ బ్రిడ్జ్‌లు రోడ్ అండర్ బ్రిడ్జ్‌లు నిర్మిస్తున్నట్లు కేంద్ర రైల్వే శాఖ పేర్కొంది.

అలాగే రాబోయే గోదావరి పుష్కరాలు దృష్ట్యా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ముందస్తు సమీక్షలు పూర్తి చేసినట్లు వెల్లడించింది. రాయనపాడు, మంగళగిరి సహా 70కు పైగా రైల్వే స్టేషన్లలో 'అమృత్ భారత్' పథకం కింద ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయని తెలిపింది. ప్రయాణికుల సౌకర్యాల కోసం విజయవాడ రైల్వే స్టేషన్‌లో 'స్లీపింగ్ పాడ్స్', విశాఖపట్నం స్టేషన్‌లో 'డెక్కన్ ఛాయ్' వంటి ఆధునిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు కేంద్ర రైల్వే శాఖ వెల్లడించింది.

# వైసీపీ నిరసనలు కాదు ప్రాయశ్చిత్త

## దీక్షలు చేయాలి ఎమ్మెల్యే కోటంరెడ్డి

**అమరావతి:** వైసీపీ చేపడుతున్న నిరసనలపై ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీ హయాంలో రాష్ట్రం నష్టపోయిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి జరుగు దీతోందని ఎమ్మెల్యే కోటంరెడ్డి అన్నారు. గతం లో వైసీపీ ఇవ్వలేని టీచర్ ఉద్యోగాలను మంత్రి నారా లోకేశ్ అందించారని పేర్కొన్నా రు. రాజధాని విషయంలో మూడు ముక్క లాట ఆడిన చరిత్ర వైసీపీదేనని విమర్శి ంచారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడ ంతో పాటు భారీ పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.టీచర్ ఉద్యోగాల విషయంలో వైసీపీ చేస్తున్న ఆరోపణలను రుజువులతో నిరూపిస్తే గంటలో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కోటంరెడ్డి సవాల్ విసి రారు. ఉద్యోగాల నియామకాలను అడ్డుకు నేందుకు హైకోర్టులో వందల కేసులు వేశా రని, కోర్టు మందలించినా వైసీపీ వైఖరిలో మార్పు రావడం లేదని ఆరోపించారు. బోరు గడ్డ అనిల్ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ, గతంలో తనపై చేసిన వ్యాఖ్యలకు తగిన పరిణామాలు ఎదురయ్యాయని కోటంరెడ్డి అన్నారు. మాట్లాడే సమయంలో ప్రతి ఒక్కరూ సంయ మనం పాటించాలని.. లేకుంటే ప్రకృతి, దేవుడి తీర్పు తప్పదని వ్యాఖ్యానించా రు.రాష్ట్రంలో అశాంతి సృష్టించేందుకు వైసీపీ కుట్రలు: కొమ్మారెడ్డి పట్టాబి డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని వైసీపీ చేస్తున్న ప్రచారం అవా స్తవమని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ అన్నారు. అసాంఘిక శక్తులను అడ్డం పెట్టుకుని జనజీ పేరుతో దీక్షలు, ఆం దోళనలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. పోలీసుల అనుమతి లేకుండా ఎక్కడపడితే అక్కడ నిరసనలు చేపడుతున్నారని విమర్శిం చారు. మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి రోడ్డు ప్రమాద ఘటనపై వైసీపీ వైఖరిని ప్రశ్నించిన పట్టాభి.. దేవరపల్లి ఘటనను ప్రస్తావిస్తూ ఆ పార్టీపై విమర్శలు చేశారు. వైసీపీ నిర్వహిస్తున్న కార్యక్రమాల వెనుక రౌడీ మూకలు, గంజాయి బ్యాచ్‌లు ఉన్నాయని ఆరోపించారు.ప్రజాస్వామ్యంపై తమకు గౌరవం ఉందని, అందుకే సంయమనంతో వ్యవహరిస్తున్నామని పట్టాభి తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ఒక్కటిగా వస్తే వైసీపీ తట్టుకోలేదని వ్యాఖ్యానించారు. డీఎస్సీ అంశంపై మంత్రి నారా లోకేశ్ విసిరిన సవాల్‌ను స్వీకరించే ధైర్యం జగన్‌కు లేదని అన్నారు. ఆధారాలు లేకుండా ఆరో పణలు చేస్తున్నారని.. ఇదే విషయంపై హైకో ర్టు కూడా వైసీపీని ప్రశ్నించిందని పట్టాభి పేర్కొన్నారు. దమ్ముంటే జగన్ చర్చకు రావాలని, లోకేశ్ సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్ చేశారు.



# కర్నూలులో టీడీపీ కార్యకర్త

## దారుణ హత్య




**కర్నూలు:** నగరంలోని మాసుంబాషా దర్గా సమీపంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఇంతియాజ్ (37) దారుణ హత్యకు గురయ్యాడు. గురువారం అర్ధరాత్రి నగదు విషయంలో అతడితో ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడ్డారు. ఈ సందర్భంగా ఇంతియాజ్‌పై వారు రాళ్లతో దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన ఇంతియాజ్.. అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటనపై ఇంతియాజ్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించి.. వారిని పోలీసులు విచారిస్తున్నారు.ఇంతియాజ్‌కు, మరో ఇద్దరు వ్యక్తుల మధ్య నగదు విషయంలో వివాదం తలెత్తింది.

ఆ కారణంతోనే ఈ హత్య జరిగిన ట్లుగా పోలీసులు భావిస్తున్నారు. అయితే ఇంతియాజ్‌పై దాడి చేసిన వారిలో ఒకరిపై గతంలో జరిగిన ఓ హత్య కేసుతో సంబంధం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. రాజకీయ నేపథ్యం ఉన్న వ్యక్తి హత్య కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ హత్యకు దారితీసిన కారణాలు, ఈ ఘటనలో మరెవరి ప్రమేయం అయినా ఉందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. మరోవైపు ఇంతియాజ్ మృతితో ఆ ఇంట విషాదం నెలకొంది. అతడి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అవుతున్నారు.

# రాష్ట్ర పండుగగా పొన్నమండ లక్ష్మణ స్వామి

## వర్మ జయంతి మంత్రి సవిత ఘన నివాళి


**అమరావతి:** తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో అగ్నికుల క్షత్రియుల జాతిపిత పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పొన్నమండ వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి మంత్రి సవిత ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గం అభివృద్ధికి లక్ష్మణ స్వామి విశేష సేవలు అందించారన్నారు. అగ్నికుల క్షత్రియుల సామాజిక వర్గంతో పాటు పేదల అభ్యున్నతికి విశేష కృషి చేసిన సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఆయుర్వేద వైద్య రంగంలోనూ పొన్నమండ వర్మ విశేష సేవలు అందించారన్నారు.120 రకాల



ఔషధాలను తయారు చేసి దేశ విదేశాలకు సరఫరా చేసిన మహనీయుడు అని మంత్రి పేర్కొన్నారు. సమాజంలో అగ్నికుల క్షత్రియ సమాజానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని తెలిపారు. 1927లో జీవో నం. 271 ద్వారా అగ్నికుల క్షత్రియులకు అధికారికంగా గుర్తింపునిచ్చా రన్నారు. కూటమి ప్రభుత్వం పొన్నమండ వర్మ జయంతిని అధికారిక రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయించడం సమాజానికి దక్కిన గొప్ప గౌరవంగా అభిప్రాయపడ్డారు. భావితరాలకు పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ సేవలు తెలియజేయాలన్న లక్ష్యంతో ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామన్నారు. పొన్నమండ వర్మ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడంపై సీఎం చంద్రబాబు నాయుడుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

## మెడికోల ప్రమాదానికి కారణమైన

### నిందితులు అరెస్టు రిమాండ్



**అమరావతి :** ఏపీలోని రాజమహేంద్రవరం మెడికోల ప్రమాదానికి కారణమైన దుష్యంత్, జోసఫ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఇదరిని శుక్రవారం కోర్టులో హాజరు పరచగా ఈనెల 21వ తేదీ వరకు రిమాండ్ విధించడంతో నిందితులను జైలుకు తరలించారు. ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత మెడికోలు ప్రియాంక, ఉమేశ్ ఆరోగ్య పరిస్థితిపై సీఎం ఆరా తీశారు.నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తప్పు చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని అన్నారు. మెడికో ప్రియాంక ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. బాధితులకు అత్యుత్తమ వైద్య సాయం అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఘటనపై డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు.ఈనెల 3న రాజేంద్ర మహేంద్రవరం సినిమామాల్‌లో సినిమా చూసి ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు మెడికోలను మద్యం మత్తులో కారును నడుపుతున్న ఇద్దరు ఢీ కొట్టారు. దీంతో మెడికోలు ప్రియాంక, మరో మెడికోకు తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిలో ప్రియాంక పరిస్థితి విషమంగా ఉంది. ఆమెను సికింద్రాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌లో చేర్పించారు. ప్రస్తుతం ఆమెకు వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందజేస్తున్నారు.

# అధిష్ఠానం ఆదేశాలు ధిక్కరించిన చలసాని

## నేడు విజయ డెయిరీ డైరెక్టర్లతో మంత్రుల భేటీ



**అమరావతి:** విజయ డెయిరీ చైర్మన్ ఎన్నిక వ్యవహారంపై తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం సీరియస్ అయింది. చైర్మన్ ఎన్నిక ఆలోచించి చేద్దామన్న అధిష్ఠానం సూచనను చలసాని ఆంజనేయులు ధిక్కరించారు. పార్టీ అధిష్ఠానం సూచనలు బేఖాతరు చేస్తూ ఆయన నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలంటూ ఆయనను పార్టీ ఆదేశించింది. దీనిని ఆయన ధిక్కరించారు. ఈ నేపథ్యంలో పార్టీ కావాలో పదవి కావాలో తెల్చుకోవాలనంటూ చలసాని ఆంజనేయులకు అధిష్ఠానం తేల్చి చెప్పింది.తనకు కొంత సమయం ఇస్తే నిర్ణయం చెబు తానని అధిష్ఠానానికి తెలిపారు. సమయం ఇవ్వడం కుదరదంటూ చలసాని ఆంజనేయులకు అధిష్ఠానం కుండబద్ధలు కొట్టింది. తీవ్ర అనారోగ్యంతో ఉన్నట్లు పార్టీకి ఆయన తెలియజేశారు. అనంతరం ఆసుపత్రిలో చేరినట్లు పార్టీ అధిష్ఠానానికి ఆయన వెల్ల డించారు. ఈ నేపథ్యంలో ఈ రోజు (శుక్రవారం) విజయ డెయిరీ డైరెక్టర్లతో మంత్రులు కొల్లు రవీంద్ర, పార్థసారథి సమావేశం కానున్నారు.

# వసతి గృహంలో విషాదం కరెంట్ షాక్‌తో విద్యార్థిని మృతి

**ఏలూరు:** జిల్లాలోని వేలేరుపాడు మండలం శివాకాశీపురం బాలికల వసతి గృహంలో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఎనిమిదో తరగతి చదువుతున్న కేచ్చేల లక్ష్మిపార్వతి (13) కిటికీపై బట్టలు ఆరేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైంది. ఒక్కసారిగా షాక్ తగలడంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలింది. వెంటనే గమనించిన తోటి విద్యార్థినులు, వసతి గృహ సిబ్బంది ఆమెను చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు. అయితే.. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి.విద్యార్థిని మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వసతి గృహంలో విద్యుత్ భద్రతా ప్రమాణాలు సక్రమంగా ఉన్నాయా? విద్యుత్



షాక్ ఎలా ఏర్పడింది అనే అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

## శిలాతోరణం వరకు క్యూలైన్‌లో భక్తులు

**తిరుమల :** భక్తవత్సల గోవిందా.. భాగవత ప్రియ గోవిందుడు కొలువుదీరిన తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 31 కంపార్టుమెంట్లు నిండిపోయి శిలాతోరణంవరకు క్యూలైన్‌లో నిలబడ్డారు. గురువారం స్వామివారిని 66,842 మంది భక్తులు దర్శించుకోగా 28,670 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 4.27 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. టోకెన్లు లేని భక్తులకు 20 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. 4.53



లక్షల లడ్డూలను విక్రయించామని, 2.77 లక్షల మందికి అన్న ప్రసాదం అందజేసామన్నారు.

# లోయలో పడిన బొలెరో వాహనం

## చిన్నారితో సహా ఐదుగురు మృతి

**దెహ్రాడూన్:** బొలెరో వాహనం అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. మూడేళ్ల చిన్నారితో సహా ఐదుగురు వ్యక్తులు ఈ ప్రమాదంలో మరణించారు. ఒక వ్యక్తి గాయాలతో బయట పడ్డాడు. పోలీసులు, రెస్క్యూ బృందం అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేప ట్టారు. ఉత్తరాఖండ్‌లోని పౌరీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం దేవ్‌ప్రయాగ్ నుంచి పౌరీ వైపు వెళ్తున్న బొలెరో వాహనం కుంద్ధర్ సమీపంలోని సబ్దర్‌ఖాల్ వద్ద అదుపు తప్పింది. రోడ్డు పక్కన ఉన్న 250 మీటర్ల లోయలోకి దూసుకెళ్లింది.కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్



బృందాలు వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఆ వాహనంలో ప్రయాణించిన ఆరుగురిలో ఐదుగురు మరణించినట్లు గుర్తించారు. గాయపడిన ఒక వ్యక్తిని రక్షించారు. హరిద్వార్‌కు చెందిన అర్మాన్‌ను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

మరోవైపు హరిద్వార్ జిల్లా రాయ్‌పూర్ జీత్‌పూర్ నివాసితులైన అక్బర్ సూఫీ కుమారుడైన 49 ఏళ్ల అఫ్జల్, ఆయన భార్య 40 ఏళ్ల షబ్నో , మూడేళ్ల కుమార్తె, 14 ఏళ్ల కుమారుడు, అక్బర్ మరో కుమారుడైన 34 ఏళ్ల గుఫ్రాన్‌గా మృతులను పోలీసులు గుర్తించారు.

పోస్ట్‌మార్టం కోసం మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# థాయ్‌ల్యాండ్ స్కూల్‌లో కాల్పులు

## పలువురు మృతి



**బ్యాంకాక్:** థాయ్‌ల్యాండ్ రాజధాని బ్యాంకాక్ శివారు ప్రాంతంలో ఉన్న డెబ్‌సిరిన్ నాన్తబురి స్కూల్‌లో ఇవాళ కాల్పుల ఘటన చోటుచేసుకున్నది. 9వ గ్రేడ్ చదువుతున్న ఓ విద్యార్థి కాల్పులకు తెగించాడు. ఈ ఘటనలో ఆ షూటర్‌తో పాటు మరో టీచర్ మృతిచెందినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే మృతుల సంఖ్యను ఇప్పుడే నిర్ధారించలేమని జిల్లా పోలీసు అధికారి లెఫ్టినెంట్ కల్నల్ పాసాకార్న్ చైత్వావివాంగ్ తెలిపారు. నాన్తబురి ప్రావిన్సులో ఉన్న బంగ్ కురాయి జిల్లాలో ఈ ఘటన జరిగింది. కాల్పులు జరిపిన షూటర్‌ను విద్యార్థిగా పోలీసులు తేల్చారు. కానీ పూర్తి వివరాలను ఇంకా వెల్లడించలేదు. కాల్పుల ఘటన సమయంలో స్కూల్‌కు ఎమర్జెన్సీ వర్కర్లు చేరుకున్నారు. అంబులెన్సులు కూడా వచ్చాయి. గాయపడ్డ విద్యార్థులకు మెడిక్స్ చికిత్సను అందిస్తున్నారు. డెబ్‌సిరిన్ స్కూల్‌కు చాలా ప్రత్యేకత ఉన్నది. ప్రఖ్యాత సెకండరీ స్కూల్‌గా గుర్తింపు ఉంది. ఆ స్కూల్‌వీకు దేశంలో అనేక చోట్ల బ్రాంచీలు ఉన్నాయి. అయితే షూటింగ్ ఘటన జరిగిన నాన్తబురి బ్రాంచీ.. బ్యాంకాక్ శివారం ప్రాంతంలో ఉంటుంది. 1885లో థాయ్ చక్రవర్తి చులాలాంగ్‌కార్న్

.. డెబ్‌సిరిన్ స్కూల్‌ను స్థాపించారు. ఈ స్కూల్లో చాలా మంది ఫేమ స్ పర్సనాల్టీలు చదువుకున్నారు.

# జార్ఖండ్ అసెంబ్లీ వైపు విద్యార్థుల ర్యాలీ

## విద్యార్థి సంఘం నాయకురాలిపై సిరా దాడి

**రాంచీ:** జార్ఖండ్‌లో పేపర్ లీక్ వ్యతిరేక నిరసనల సందర్భంగా ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) అధ్యక్షురాలు నేహా బోరాపై సిరా దాడి జరిగింది. శుక్రవారం రాంచీలోని జార్ఖండ్ అసెంబ్లీ వైపుగా విద్యార్థులతో కలిసి నిరసన ర్యాలీగా వెళ్తున్న ఆమెపై ఒక వ్యక్తి ఇంకు పోశాడు. నేహా బోరా 'దేశద్రోహి' అని అతడు ఆరోపించాడు. 'నేహా బోరా ఉమర్ ఖలీద్ మద్దతుదారురాలు. ఆమె అంటే ఇష్టం నాకు లేదు. ఆమె దేశ వ్యతిరేకి' అని మీడియాతో అన్నాడు. అక్కడి నుంచి పారిపోతున్న ఆ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.కాగా, ఈ దాడికి తాను భయపడబోనని నేహా బోరా అన్నారు. తనపై సిరా పోసిన ఆ వ్యక్తి బీజేపీ మద్దతు ఉన్న గూండా అని ఆమె ఆరోపించారు. జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ సీజీఎల్ పరీక్షలను రద్దు చేయాలని, తక్షణమే తిరిగి పరీక్షలు నిర్వహించాలని





డిమాండ్ చేస్తున్న విద్యార్థులకు మద్దతుగా ఈ ర్యాలీలో పాల్గొన్నట్లు ఆమె తెలిపారు. 'ఢిల్లీ నిరసనల సమయంలో పెల్లెట్ గన్ కాల్పులు, లాఠీచార్జిని ఎదుర్కొన్న నాకు, సిరా చల్లడం వల్ల భయం కలగదు. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, యువత ఆగ్రహాన్ని సిరాతో అణచివేయగలమని వారు భావిస్తున్నారాఅని ఆమె ప్రశ్నించారు.

# భారత సంతతి

## వ్యోమగామి స్పేస్‌వాక్



**వాషింగ్టన్:** భారత సంతతి నాసా వ్యోమగామి డాక్టర్ అనిల్ మీనన్ తన తొలి అంతరిక్ష యాత్రలో మరో రికార్డ్ నెలకొల్పారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్) వెలుపల తన తొలి స్పేస్‌వాక్‌ను విజయవంతంగా ప్రారంభించారు.అనుభవజ్ఞురాలైన వ్యోమగామి జెస్సికా మీర్‌తో కలిసి ఆయన చేపట్టిన ఈ స్పేస్‌వాక్ 6.5 గంటలపాటు కొనసాగనున్నది. భారత కాలమానం ప్రకారం గురువారం సాయంత్రం మొదలైన ఈ అంతరిక్ష నడకను యూఎస్ స్పేస్‌వాక్-96గా పిలుస్తున్నారు. ఐఎస్ఎస్‌లో విద్యుత్ వ్యవస్థను ఆధునీకరించే పనుల్లో భాగంగా వీరు పవర్ చానల్ వద్ద హార్డ్‌వేర్‌ను అమర్చుతున్నారు.

# ఆలస్యమైనందుకు హోటల్ నిర్వాహకుడిపై కాల్పులు

## అంబులెన్స్ ప్రమాదంలో అతడు మృతి

**జైపూర్:** కొందరు వ్యక్తులు ఒక హోటల్‌కు వెళ్లారు. ఫుడ్ ఆలస్యంపై ఆగ్రహించి హోటల్ నిర్వాహకుడిపై కాల్పులు జరిపారు. గాయపడిన అతడ్ని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా అది బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి మరణించాడు.రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఖర్నాల్ గ్రామంలోని ఒక హోటల్‌కు కొందరు వ్యక్తులు వెళ్లారు. ఆర్డర్ చేసిన ఆహారం ఆలస్యంపై బీహార్‌కు చెందిన హోటల్ నిర్వాహకుడైన 40 ఏళ్ల రామ్‌కుమార్ అలియాస్ రామ్‌దాస్‌తో వారికి వాగ్వాదం జరిగింది. ఈ వివాదం ముదరడంతో ఒక యువకుడు పిస్టల్ తీసి అతడి ఛాతిపై కాల్పులు జరిపాడు. ఆ తర్వాత వారు అక్కడి నుంచి పారిపోయారు.కాగా, కాల్పుల్లో గాయపడిన హోటల్ నిర్వాహకుడు రామ్‌కుమార్‌ను స్థానికులు తొలుత నాగౌంలోని జేఎల్ఎన్ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స అనంతరం జోధ్‌పూర్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అంబులెన్స్‌లో అక్కడకు తరలిస్తుండగా ఖీన్వ్‌సర్ సమీపంలో అదుపుతప్పింది. రోడ్డు పక్కన ఉన్న కందకం




లోకి అది దూసుకెళ్లి బోల్తాపడింది.

మరోవైపు అంబులెన్స్ ప్రమాదం గురించి తెలుసుకున్న ఖీన్వ్‌సర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ప్రమాదంలో మరింత గాయపడిన హోటల్ నిర్వాహకుడు రామ్‌కుమార్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు.అయితే హోటల్‌లో జరిగిన కాల్పుల సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఫోరెన్సిక్ బృందంతో ఆధారాలు సేకరించినట్లు చెప్పారు. అంబులెన్స్ ప్రమాదంలో మరణించిన హోటల్ నిర్వాహకుడిపై తొలుత కాల్పులకు పాల్పడిన నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.

# స్కూల్‌కు వెళ్లేందుకు ప్రమాదకరంగా

## డ్యామ్ దాటుతున్న విద్యార్థులు ఎన్‌హెచ్ఆర్సీ స్పందన

**భోపాల్:** కొందరు విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు పెద్ద సాహసాలు చేస్తున్నారు. ప్రాణాలకు తెగించి డ్యామ్ స్థంభాలపై నుంచి దూకుతున్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) దీనిపై స్పందించింది. ప్రభుత్వానికి నోటీస్ జారీ చేసింది. మధ్యప్రదేశ్‌లోని విదిశా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కొందరు పిల్లలు నిత్యం స్కూల్‌కు వెళ్లేందుకు పెద్ద సాహసాలు చేస్తున్నారు. ప్రాణాలకు తెగించి బెట్వా నదిపై ఉన్న డ్యామ్ స్థంభాలపై నుంచి ప్రమాదకరంగా దూకుతున్నారు. రోడ్డు మార్గంలో 13 కిలోమీటర్ల దూరాన్ని 1.5 కిలోమీటర్లకు తగ్గించుకోవడానికి బాలబాలికలు ఈ మార్గాన్ని వినియోగి స్తున్నారు.

కాగా, ఆగస్ట్ 4న మీడియాలో వచ్చిన ఈ వార్తతో పాటు సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో క్లిప్స్‌పై జాతీయ మానవ





హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) స్పందించింది. ఈ సంఘటనను సుమోటోగా పరిగణించింది. 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న స్కూల్‌కు తమ పిల్లలను పంపకుండా ఆపడమా లేక ప్రమాదకరమైన ఈ షార్ట్‌కట్ మార్గంలో వారిని పంపడమా అనే రెండు మార్గాలే వారి తల్లిదండ్రులకు మిగిలాయని తెలిపింది. పొట్టిగా ఉండటం వల్ల డ్యామ్ స్తంభాలను దాటలేక ఒక విద్యార్థిని పాఠశాలకు వెళ్లక పోవడంతో ఫైనల్ పరీక్షల్లో ఫెయిల్ అయినట్లుగా తమకు తెలిసినట్లు పేర్కొంది. జిల్లా కలెక్టర్ ఆ ప్రాంతాన్ని సందర్శించినప్పటికీ సురక్షిత మార్గం పునరుద్ధరణపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడాన్ని తప్పుపట్టింది.

మరోవైపు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఏ, 6 నుంచి 14 సంవత్సరాల వయస్సున్న పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యకు హామీ ఇస్తుందని ఎన్‌హెచ్ఆర్సీ గుర్తు చేసింది. అదే సమయంలో 'సురక్షితమైన పాఠశాల, సురక్షితమైన మౌలిక సదుపాయాల హక్కు కూడా విద్యా హక్కులో భాగమేనని పేర్కొంది. 2009 నాటి అవినాష్ మెహ్రోత్రా వర్సెస్ కేంద్ర ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా ఎన్‌హెచ్ఆర్సీ ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో విద్యార్థులు స్కూల్‌కు వెళ్లేందుకు సురక్షితమైన మార్గం లేకపోవడంపై మధ్యప్రదేశ్ ముఖ్య కార్యదర్శికి నోటీస్ జారీ చేసింది. రెండు వారాల్లోగా వివరణాత్మక నివేదిక ఇవ్వాలని కోరింది.

# సునేత్ర పవార్‌ను కలిసిన ప్రశాంత్ కిషోర్

## కూటమి విభజనపై బీజేపీ హెచ్చరిక

**ముంబై:** బీహార్‌లోని బంకీపూర్ ఉప ఎన్నికలో బీజేపీని ఓడించిన జేఎస్పీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ అధినేత్రి సునేత్రా పవార్‌ను కలిశారు. ముంబైలోని ఆమె నివాసంలో వారిద్దరూ సమావేశమయ్యారు. అయితే రాజకీయ వ్యూహకర్త నుంచి రాజకీయ నేతగా మారిన ప్రశాంత్ కిషోర్, సునేత్రా పవార్‌ను కలుసుకోవడం ఇది రెండోసారి. ఈ ఏడాది జనవరిలో బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో ఆమె భర్త, నాటి ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణించిన తర్వాత వారిద్దరూ సమావేశం కావడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకున్నది. కొన్ని నెలల క్రితం



జరిగిన మొదటి భేటీపై సునేత్రా కుమారుడు, ఎన్సీపీ నేత పార్థ్ పవార్ వివరణ ఇచ్చారు. ప్రశాంత్ కిషోర్ తమ కుటుంబానికి సుపరిచితులేనని ఆయన తెలిపారు.కాగా, గతంలో నరేంద్ర మోదీ, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ వంటి నాయకుల విజయాల్లో కీలక పాత్ర పోషించిన ప్రశాంత్ కిషోర్, సునేత్రా పవార్‌తో భేటీ కావడంపై బీజేపీకి చెందిన రెవెన్యూ మంత్రి చంద్రశేఖర్ బవంకులే స్పందించారు.

# ఇద్దరు గిరిజన బాలికలను కిడ్నాప్ చేసి

## కదులుతున్న కారులో సామూహిక అత్యాచారం





**గౌహతి:** కొందరు వ్యక్తులు ఇద్దరు గిరిజన బాలికలను కిడ్నాప్ చేశారు. కదులుతున్న కారులో వారిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత బాలికల ఫిర్యాదుపై పోలీసులు స్పందించారు. నిందితులైన ముగ్గురు యువకులను అరెస్ట్ చేశారు. అస్సాంలోని కచార్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మిజోరామ్‌కు చెందిన ఇద్దరు మైనర్ బాలికలను ముగ్గురు యువకులు కిడ్నాప్ చేశారు. బలవంతంగా కారులో ఎక్కించుకున్నారు. కదులుతున్న కారులో ఇద్దరు అమ్మాయిలపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు.

కాగా, ఆగస్ట్ 3న తెల్లవారుజామున సుమారు 2:30 గంటలకు బాధిత ఇద్దరు బాలికలు ధోలై పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. తమను కిడ్నాప్ చేసి లైంగిక దాడికి ప్రయత్నించారని, తాము ప్రతిఘటించినప్పటికీ ఆ యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపించారు.మరోవైపు బాధిత మైనర్ బాలికల ఫిర్యాదుపై పోలీసులు స్పందించారు. నిందితులను రాజ్‌నగర్‌కు చెందిన 20 ఏళ్ల అమ్జాద్ హుస్సేన్ లస్కర్, భగా బజార్‌కు చెందిన 23 ఏళ్ల సద్దాం హుస్సేన్ లస్కర్, ఖాస్‌పూర్‌కు చెందిన 25 ఏళ్ల రింకు దాస్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. పోక్సో చట్టంతోపాటు పలు సెక్షన్ల కింద వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# ఒక్క డాక్యుమెంట్ మిస్ అయినా వీసా గ్రీన్‌కార్డ్ రానట్టే

**అమెరికా:** అమెరికా ఇమ్మిగ్రేషన్ దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి యూఎస్ ప్రభుత్వం నిబంధనలను మరింత కఠినతరం చేసింది. వీసా, గ్రీన్‌కార్డ్ లేదా ఇతర ఇమ్మిగ్రేషన్ ప్రయోజనాల కోసం దాఖలు చేసిన దరఖాస్తులు అసంపూర్తిగా ఉంటే, మిస్సయిన పత్రాలను సమర్పించమని దరఖాస్తుదారులను మళ్లీ అడగకుండా నేరుగా తిరస్కరించే అధికారాన్ని ఇమ్మిగ్రేషన్ అధికారులకు కల్పించింది. ఈ నిర్ణయం వేలాదిమంది భారతీయ దరఖాస్తుదారులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నది. యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) జారీ చేసిన ఈ కొత్త మార్గదర్శకాలు ఆగస్టు 5 నుంచి లేదా ఆ తర్వాత దాఖలైన /పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటికీ తక్షణమే వర్తిస్తాయి.గతంలో, బైడెన్ పరిపాలనా కాలంలో ప్రవేశపెట్టిన నిబంధనల ప్రకారం దరఖాస్తును తిరస్కరించే ముందు అధికారులు రిక్వెస్ట్ ఫర్ ఎవిడెన్స్(ఆర్ఎఫ్ఈ) లేదా నోటీస్ ఆఫ్ ఇంటెంట్ టు డినై(ఎన్వోఐడీ) జారీ చేయాలని సూచించేవారు.




దీనివల్ల లోపాలను సరిదిద్దుకోవడానికి దరఖాస్తుదారులకు ఒక అవకాశం లభించేది. అయితే ఇకపై ఆ అవకాశం ఉంటుందనే గ్యారెంటీ లేదు. ప్రతి ఇమ్మిగ్రేషన్ ప్రయోజనానికి ఏయే డాక్యుమెంట్లు కావాలో దరఖాస్తు ఫారమ్, అధికారిక మార్గదర్శకాల్లోనే స్పష్టంగా పేర్కొనబడి ఉంటాయి. కాబట్టి దరఖాస్తుదారులు మొదటి నుంచే పూర్తి సమాచారంతో కూడిన దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది.

### నిబంధన ఎందుకు మార్చారు

కొత్త మార్గదర్శకాలు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ నియంత్రణ అధికారాలకు అనుగుణంగా ఉన్నాయని, ఇమ్మిగ్రేషన్ వ్యవస్థ పారదర్శకత, విశ్వసనీయతను బలోపేతం చేయడానికి ఉద్దేశించబడ్డాయని యూఎస్‌సీఐఎస్ పేర్కొంది. అసంపూర్తిగా ఉన్న దరఖాస్తుల వల్ల ఇతర కేసుల ప్రాసెసింగ్ ఆలస్యమవుతున్నదని ఏజెన్సీ పేర్కొంది. కొందరు దరఖాస్తుదారులు ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ వంటి తాత్కాలిక ప్రయోజనాలు పొందేందుకు "ప్లేస్‌హోల్డర్" దరఖాస్తులను వాడుతున్నారని తెలిపింది.

ఆర్ఎఫ్ఈ లేదా ఎన్వోఐడీ జారీ చేయకుండానే దరఖాస్తులను తిరస్కరించే విచక్షణాధికారాన్ని అధికారులకు తిరిగి ఇవ్వడం ద్వారా ప్రాసెసింగ్ వేగం పెరుగుతుందని యూఎస్‌సీఐఎస్ భావిస్తున్నది.

దీంతో దరఖాస్తుదారులు మరింత జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుంది. దరఖాస్తును సమర్పించడానికి ముందే అది పూర్తిగా ఉందో లేదో, కావాల్సిన అన్ని పత్రాలు జత చేశారో లేదో నిర్ధారించుకోవాలి. కీలకమైన డాక్యు మెంట్ మిస్ అయితే, మళ్లీ సమర్పించడానికి అవకాశం ఇవ్వకుండానే దరఖాస్తును తిరస్కరించే ప్రమాదం ఉన్నది.

# గుండె ఆరోగ్యానికి అండ ద్రాక్ష

## రోజూ తింటే ఎన్నో లాభాలు

ద్రాక్ష పండ్లను పండ్ల రాణిగా పిలుస్తారు. రుచికరమైన తీపి, స్వల్ప పులుపు కలిగిన ఈ పండ్లు ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు అందిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా పచ్చ, ఎరుపు, నీలం, ఊదా, నలుపు వంటి వివిధ రంగుల్లో లభించే ద్రాక్షను ఎక్కువగా వైన్ తయారీలో ఉపయోగిస్తారు. మిగిలిన వాటిని నేరుగా పండ్లుగా లేదా ఎండు ద్రాక్ష తయారీలో వినియోగిస్తారు. ఏడాది పొడవునా మార్కెట్లో లభించే ఈ పండ్లు పోషకాలు, యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉండి శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. ద్రాక్షలో కెరోటినాయిడ్లు, పాలీఫినాల్స్ వంటి అనేక రకాల ఫైటోన్యూట్రియెంట్లు, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. కొన్ని పరిశోధనల ప్రకారం ఇవి కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించడంలో, గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో ఉపయోగపడతాయని తేలింది. ముఖ్యంగా ద్రాక్షలో ఉండే రెస్వెరాట్రోల్ అనే పాలీఫినాల్ రక్తనాళాలను విస్తరింపజేసి రక్తప్రసరణను మెరుగుపంచడంలో, రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ద్రాక్ష గింజలు, తొక్కలో యాంటీఆక్సిడెంట్లు అత్యధికంగా ఉంటాయని పరిశోధనలు వెల్లడించాయి.



**గుండె ఆరోగ్యానికి..**

ద్రాక్షలోని రెస్వెరాట్రోల్ చర్మ ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. ఇది వృద్ధాప్య లక్షణాలు ఆలస్యంగా కనిపించడానికి తోడ్పడటంతోపాటు కొన్ని చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఒక అధ్యయనం ప్రకారం బెంజాయిల్ పెరాక్సైడ్ అనే సాధారణ మొటిమల మందుతో కలిపి ఉపయోగించినప్పుడు రెస్వెరాట్రోల్ మొటిమలకు కారణమయ్యే బ్యాక్టీరియాపై ప్రభావవంతంగా పని చేసినట్లు గుర్తించారు. 100 గ్రాముల ద్రాక్షలో సుమారు 191 మిల్లీగ్రాముల పొటాషియం ఉంటుంది. పొటాషియం అధికంగా తీసుకోవడం, సోడియం వినియోగాన్ని తగ్గించడం వల్ల రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ వంటి సమస్యలను నియంత్రించడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. పొటాషియం శరీరంలోని అదనపు సోడియం ప్రభావాన్ని తగ్గించడంలో కూడా ఉపయోగపడుతుంది. తక్కువ ఉప్పు, ఎక్కువ పొటాషియం ఉన్న ఆహారం గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని చెబుతున్నారు.

**కంటి చూపు కోసం..**

ద్రాక్ష కళ్ల ఆరోగ్యానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. వీటిని ఆహారంలో చేర్చడం వల్ల కళ్లలోని రెటీనాను రక్షించే ప్రొటీన్ల స్థాయి పెరగడంతోపాటు వాపులకు సంబంధించిన ప్రొటీన్ల స్థాయి తగ్గే అవకాశం ఉంటుందని పరిశోధకులు గుర్తించారు. దీంతో కళ్ల పనితీరు మెరుగుపడే అవకాశం ఉంటుంది. మెదడు ఆరోగ్యానికి కూడా ద్రాక్ష ఉపయోగపడుతుందని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. రెస్వెరాట్రోల్ మెదడుకు రక్తప్రసరణను పెంచి ఆలోచనా సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అల్జీమర్స్ వంటి మెదడు సంబంధిత వ్యాధుల్లో ఏర్పడే ప్లాక్‌లు, ఫ్రీ రాడికల్స్ ప్రభావాన్ని తగ్గించడంలో కూడా ఇది తోడ్పడుతుంది. ప్రతిరోజూ ద్రాక్షను తినడం వల్ల మోకాళ్ల నొప్పి, ముఖ్యంగా ఆస్టియోఆర్థ్రైటిస్ కారణంగా వచ్చే నొప్పి కొంతవరకు తగ్గుతుంది. ద్రాక్షలో ఉండే పాలీఫినాల్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు కీళ్ల వంపుతనం, కదలికలను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ద్రాక్షలో ఉండే కొన్ని ఎంజైమ్‌లు శరీరంలో వాపులను తగ్గించే లక్షణాలను కలిగి ఉంటాయి. దీంతో ధమనుల ఆరోగ్యాన్ని కాపాడడంలో, గుండె పనితీరును మెరుగుపరచడంలో, శరీర కణాల మరమ్మత్తు ప్రక్రియలకు మద్దతు ఇవ్వడంలో ఇవి సహాయపడతాయి.

**ఎంత మోతాదులో తినవచ్చు..**

ద్రాక్షలో విటమిన్ ఎ, విటమిన్ బి 6, విటమిన్ బి 12, విటమిన్ సి, విటమిన్ డి, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు ఉంటాయి. అయితే వీటిలో సహజ చక్కెర కూడా ఉండటం వల్ల అతిగా తినకూడదు. వారానికి మూడు నుంచి నాలుగు రోజులు వివిధ రకాల బెర్రీ పండ్లను ఆహారంలో చేర్చడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఒకవేళ ద్రాక్షనే ప్రత్యేకంగా తింటే రోజుకు రెండు నుంచి మూడు కప్పుల వరకు తీసుకోవచ్చని పేర్కొంటున్నారు. ఒక కప్పులో సుమారు 15 నుంచి 20 ద్రాక్ష పండ్లు ఉంటాయి. ద్రాక్షను నేరుగా పండ్లుగా తినడమే కాకుండా ఫ్రూట్ సలాడ్లు, సమ్మర్ సలాడ్లు, డెజర్టు, టార్ట్స్, పన్నాకొట్టా, కేకులు, చట్నీలు, సాస్‌లు, కంపోట్స్, మాక్‌టెయిల్స్, సార్బెట్లు వంటి అనేక వంటకాలలో కూడా ఉపయోగించవచ్చు. చికెన్‌తో కలిపి వండడం లేదా నల్ల ద్రాక్షతో సలాడ్ డ్రెస్సింగ్ తయారు చేయడం వినియోగిస్తారు.

# కాఫీ తాగిన వెంటనే ఉత్సాహంగా అనిపిస్తుంది

## ఎందుకని దీని వల్ల శక్తి లభిస్తుందా



కాఫీ ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా తాగే పానీయాల్లో ఒకటి. ముఖ్యంగా అలసటగా అనిపించినప్పుడు లేదా పనిలో ఏకాగ్రత తగ్గినప్పుడు చాలా మంది వెంటనే ఒక కప్పు కాఫీ తాగుతారు. కాఫీ తాగిన కొద్దిసేపటికే శరీరంలో ఉత్సాహం పెరిగినట్లు అనిపిస్తుంది. అయితే నిజంగా కాఫీ శరీరానికి శక్తిని ఇస్తుందా లేక అది కేవలం కొంతసేపు మాత్రమే చురుకుదనాన్ని కలిగిస్తుందా? దీనిపై నిపుణులు ఆసక్తికరమైన విషయాలను వెల్లడిస్తున్నారు. మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత చాలా మందికి అలసట, నిద్రమత్తు వస్తుంది. అలాంటి సమయంలో ఒక కప్పు కాఫీ తాగితే వెంటనే మళ్లీ చురుకుగా అనిపిస్తుంది. దీంతో కాఫీ శరీరానికి శక్తిని అందిస్తుందని చాలమంది భావిస్తారు. కానీ వాస్తవానికి కాఫీ శరీరంలో శక్తి (కేలరీల)ని పెంచదు. అది కేవలం మెదడుపై పనిచేసి కొంతసేపు మెళకువగా, చురుకుగా ఉండేలా చేస్తుంది.

**కారణం ఏమిటి..?**

కాఫీలో ఉండే ప్రధాన పదార్థం కెఫీన్. ఇది మెదడు పనితీరును ఉత్తేజపరిచే సహజ ఉద్దీపన పదార్థం. కెఫీన్ మెదడులోని అడెనోసిన్ రిసెప్టర్లపై ప్రభావం చూపుతుంది. సాధారణంగా అడెనోసిన్ అనే రసాయనం శరీరానికి విశ్రాంతి, నిద్రమత్తును కలిగిస్తుంది. కెఫీన్ ఈ ప్రభావాన్ని తాత్కాలికంగా అడ్డుకోవడంతో అలసట తగ్గినట్లు అనిపించి, అప్రమత్తత పెరుగుతుంది. అందుకే కాఫీ తాగిన వెంటనే ఉత్సాహంగా ఉన్న భావన కలుగుతుంది. అయితే ఈ ప్రభావాన్ని శరీరానికి నిజమైన శక్తి లభించిందని భావించకూడదు. పోషకాహార పరంగా శక్తి అంటే కేలరీలు. కానీ బ్లాక్ కాఫీలో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. కాబట్టి కాఫీ శరీరానికి అదనపు శక్తిని అందించదు. అది కేవలం మెదడును కొంతసేపు ఉత్తేజపరచి అలసటను తగ్గించినట్లు అనిపించేలా చేస్తుంది. కాఫీలో యాంటీఆక్సిడెంట్లు కూడా అధికంగా ఉంటాయి. ఇవి శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. కెఫీన్ ప్రభావంపై జరిగిన కొన్ని పరిశోధనల్లో అల్జీమర్స్, పార్కిన్సన్స్, డిమెన్షియా వంటి నాడీ సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో ఇది కొంతవరకు ఉపయోగపడుతుందని సూచించారు. అయితే దీనిపై మరిన్ని పరిశోధనలు అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు.

**ఎంత సేపు ఉంటుంది.**

కాఫీ వల్ల వచ్చే చురుకుదనం ఎక్కువసేపు ఉండదు. కొంత సమయం తర్వాత కెఫీన్ ప్రభావం తగ్గిపోతుంది. దీంతో మళ్లీ అలసటగా అనిపించే అవకాశం ఉంటుంది. అందువల్ల కాఫీని శక్తికి ప్రత్యామ్నాయంగా భావించడం సరైంది కాదు. అలాగే కాఫీని అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదు. ఎక్కువ కాఫీ తాగడం వల్ల శరీరంలో నీటి కొరత (డీహైడ్రేషన్) ఏర్పడే అవకాశం ఉంటుంది. అలాగే నిద్రలేమి, ఆందోళన, ఒత్తిడి వంటి సమస్యలు ఉన్నవారు కాఫీని పరిమితంగా తీసుకోవాలి. జీర్ణవ్యవస్థ బలహీనంగా ఉండే వారు, ముఖ్యంగా ఐబీఎస్ (ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్), తరచూ విరేచనాల సమస్య ఉన్నవారు కూడా కాఫీని ఎక్కువగా తీసుకోవడం నివారించాలి. ఎందుకంటే ఇది వారి సమస్యలను మరింత పెంచే అవకాశం ఉంటుంది. కాఫీ తాగిన వెంటనే శరీరంలో శక్తి పెరిగినట్లు అనిపించినా, అది నిజమైన శక్తి కాదు. కెఫీన్ వల్ల మెదడు కొంతసేపు అప్రమత్తంగా మారడం వల్ల కలిగే తాత్కాలిక ప్రభావమే. కాబట్టి కాఫీని మితంగా తీసుకుంటే ప్రయోజనాలు పొందవచ్చు. అయితే అతిగా తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున పరిమితంగా తీసుకోవడం ఉత్తమం.

# గోర్లలో ఈ లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త

## నిర్లక్ష్యం చేయకండి

గోర్లు మన శరీర ఆరోగ్యానికి అద్దంలా పనిచేస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. గోర్ల రంగు, ఆకారం లేదా వాటి ఉపరితలంలో కనిపించే మార్పులు కొన్ని ఆరోగ్య సమస్యలకు సంకేతాలుగా ఉంటాయి. గోర్లలో కనిపించే అసాధారణ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా గమనిస్తే కొన్ని వ్యాధులను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. అయితే గోళ్లలో మార్పులు కనిపించాయంటే తప్పనిసరిగా తీవ్రమైన వ్యాధే ఉందని అర్థం కాదు. కానీ అవి ఎక్కువకాలం కొనసాగితే వైద్యులను సంప్రదించడం మంచిది. గోర్లు శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం చాలా ముఖ్యం. గోర్లను క్రమం తప్పకుండా కత్తిరించడం, శుభ్రంగా ఉంచడం ద్వారా అనేక ఇన్‌ఫెక్షన్లను నివారించవచ్చు. అదే సమయంలో గోర్లలో కనిపించే చిన్నచిన్న మార్పులు కూడా శరీరంలోని అంతర్గత ఆరోగ్య పరిస్థితిని సూచించే అవకాశం ఉంటుంది.



**పాలిపోయినట్లు తెల్లగా ఉంటే..**

గోర్లు పాలిపోయినట్లు లేదా తెల్లగా కనిపిస్తే అది రక్తహీనత (అనీమియా), పోషకాహార లోపం లేదా కాలేయానికి సంబంధించిన సమస్యలకు సంకేతంగా ఉంటుంది. ఈ లక్షణం ఎక్కువకాలం కొనసాగితే వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిది. గోర్లు ఎక్కువ భాగం తెల్లగా ఉండి, అంచులు మాత్రం ముదురు రంగులో కనిపిస్తే అది కొన్ని కాలేయ వ్యాధులతో సంబంధం కలిగి ఉండే అవకాశం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. గోర్లు పసుపు రంగులోకి మారడం వెనుక అత్యంత సాధారణ కారణం ఫంగల్ ఇన్‌ఫెక్షన్. ఇన్‌ఫెక్షన్ తీవ్రత పెరిగే కొద్దీ గోరు మందంగా మారడం, గోరు అడుగు భాగం విడిపోవడం, గోరు పెళుసుగా మారి ముక్కలుగా విరిగిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అరుదైన సందర్భాల్లో పసుపు రంగు గోర్లు థైరాయిడ్ సమస్యలు లేదా ఊపిరితిత్తుల వ్యాధులకు కూడా సంకేతంగా ఉంటాయి. గోర్లకు నీలిరంగు ఛాయ కనిపిస్తే శరీరానికి తగినంత ఆక్సిజన్ అందడం లేదనే సూచన అని భావించాలి. ఇలాంటి లక్షణాలు ఊపిరితిత్తులు లేదా గుండెకు సంబంధించిన సమస్యలతో ముడిపడి ఉండే అవకాశం ఉంటుంది.

**గోర్లపై గీతలు ఉంటే..**

గోర్ల ఉపరితలంపై అలల మాదిరిగా గీతలు లేదా ఎత్తుపల్లాలు కనిపిస్తే అది సోరియాసిస్ ప్రారంభ లక్షణంగా ఉంటుంది. కొన్నిసార్లు ఇది ఇన్‌ఫ్లమేటరీ ఆర్థరైటిస్‌కు కూడా సంకేతం అవుతుంది. ఇలాంటి గోర్ల రంగు మారడంతోపాటు వాటి కింద చర్మం ఎర్రని-గోధుమ రంగులో కనిపించే అవకాశం ఉంటుంది. గోర్లు పగిలిపోవడం లేదా చీలిపోవడం, ముఖ్యంగా పసుపు రంగుతో కలిసి కనిపిస్తే దాన్ని కూడా ఫంగల్ ఇన్‌ఫెక్షన్‌లకు సంకేతంగా భావిస్తారు. కొన్ని సందర్భాల్లో థైరాయిడ్ వ్యాధులు కూడా దీనికి కారణం అవుతాయి. గోర్ల చుట్టూ ఉన్న చర్మం వాపులకు గురైనట్లు, ఎర్రగా కనిపిస్తే అది నెయిల్ ఫోల్డ్‌లో ఇన్‌ఫ్లమేషన్ కారణంగా ఉంటుంది. కొన్ని రకాల కనెక్టివ్ టిష్యూ సంబంధిత వ్యాధులు కూడా ఈ లక్షణానికి కారణమయ్యే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. గోర్లలో ఇలాంటి మార్పులు కనిపించినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా గమనించడం ముఖ్యం. మార్పులు ఎక్కువకాలం కొనసాగినా లేదా ఇతర ఆరోగ్య సమస్యలు కూడా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# తలనొప్పి సమస్య అసలు ఎందుకు వస్తుంది

## ఆయుర్వేదంలో ఎలాంటి చిట్కాలు ఉన్నాయి

తలనొప్పి చాలా మందిని తరచూ ఇబ్బంది పెట్టే సాధారణ ఆరోగ్య సమస్య. ఇంట్లో ఉన్నా, కార్యాలయంలో ఉన్నా లేదా ప్రయాణంలో ఉన్నా తలనొప్పి రోజువారీ పనులపై ప్రభావం చూపుతుంది. చాలామంది ఒక కప్పు కాఫీ తాగడం లేదా కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవడం ద్వారా తలనొప్పి తగ్గిపోతుందని భావిస్తారు. అయితే ప్రతిసారి అలా జరగదు. ఆయుర్వేదంలో తలనొప్పి నుంచి ఉపశమనం పొందేందుకు కొన్ని సహజమైన ఆహారాలు, ఇంటి చిట్కాలు ఉన్నాయి. ఆయుర్వేదం ప్రకారం తలకు సున్నితంగా మసాజ్ చేయడం తలనొప్పి తగ్గించడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా శరీరంలో నీటి కొరత (డీహైడ్రేషన్) వల్ల వచ్చే పిత్త సంబంధిత తలనొప్పుల్లో తరచూ నీరు లేదా ఆరోగ్యకరమైన పానీయాలు తీసుకోవడం మంచిదని సూచిస్తోంది. అలాగే జలుబు, దగ్గు కారణంగా ముక్కు మూసుకుపోయి తలనొప్పి వస్తే, ఆయుర్వేద మూలికల నూనె లేదా నెయ్యిని ముక్కు రంధ్రాలలో వేయడం ద్వారా ఉపశమనం లభిస్తుంది.



**బ్రాహ్మి, చందనం..**

బ్రాహ్మి తలనొప్పిని తగ్గించడంలో ఉపయోగపడే ముఖ్యమైన ఆయుర్వేద మూలికగా చెప్పవచ్చు. ఇది శరీరానికి చల్లదనాన్ని అందించడంతోపాటు ఒత్తిడి, మానసిక ఆందోళనను తగ్గించడంలో సహాయపడుతుంది. బ్రాహ్మి నూనెతో తలకు మసాజ్ చేయడం లేదా బ్రాహ్మి, నెయ్యి చుక్కలను ముక్కులో వేయడం వల్ల తలనొప్పి నుంచి ఉపశమనం లభించే అవకాశం ఉంటుంది. చందనం కూడా తలనొప్పికి ఉపయోగించే సంప్రదాయ చికిత్సల్లో ఒకటి. అర టీస్పూన్ చందనం పొడిలో కొద్దిగా నీరు కలిపి పేస్ట్ లా తయారుచేసి నుదుటిపై రాసి సుమారు 20 నిమిషాలు ఉంచితే చల్లదనాన్ని అందించి తలనొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది. తగర్ అనే ఔషధ మూలికను కూడా ఆయుర్వేదంలో ఉపయోగిస్తారు. ఉపశమనం పొందవచ్చు.

# ప్రొటీన్ ఇలా పెరుగున్

ప్రొటీన్ మన శరీరానికి రోజూ అవసరం. కానీ, ప్రతి భోజనంలోనూ శరీరానికి ప్రొటీన్లను సమకూర్చే ఆహార పదార్థాలు ఉండటం లేదు. మాంసం, పప్పులను చేర్చిన సమతులాహారం తినేవాళ్లు చాలా తక్కువ. అందువల్ల ప్రొటీన్ లోపంతో బాధపడుతున్నవాళ్లు ఎక్కువగా ఉన్నారు. ముఖ్యంగా శాకాహారుల్లో ఎక్కువగా ఉన్నారు. శరీరంలో ప్రొటీన్ లోపం సరి చేసుకోవడానికి ప్రతి భోజనంలో పెరుగును చేర్చుకుంటే ఆ లోటుని కొంత భర్తీ చేయవచ్చని ఐసీఎంఆర్, ఎన్ఐఎన్ సంస్థలు సూచిస్తున్నాయి. వంద గ్రాముల పెరుగులో కనీసం మూడు గ్రాముల



ప్రొటీన్ ఉంటుందని, పాల స్వభావాన్ని బట్టి అంతకంటే ఎక్కువా ఉండొచ్చని ఆ సంస్థలు చెబుతున్నాయి.కాబట్టి ప్రొటీన్ కోసం పెరుగు తినాలని ఈ సంస్థలు అంటున్నాయి. వంద గ్రాముల పెరుగు.. 62 కేజీల బరువు ఉండే సగటు మనిషికి ఒక రోజుకు కావాల్సిన ప్రొటీన్ అవసరంలో ఎనిమిది శాతమే తీరుస్తుంది. కాబట్టి శాకాహారులు పూర్తి స్థాయిలో అవసరమైన ప్రొటీన్‌లను పొందాలంటే చియా, అవిసె గింజల పొడిని పెరుగులో కలుపుకొని తినాలి. ఇలా చేస్తే శరీర కండరాలు బలంగా ఉంటాయి. రోగ నిరోధక వ్యవస్థ మెరుగుపడుతుంది. వంద గ్రాముల పెరుగులో 149 మిల్లీ గ్రాముల క్యాల్షియం, నాలుగు గ్రాముల కొవ్వులు, 93 మిల్లీ గ్రాముల ఫాస్పరస్, విటమిన్ బీ12, మెగ్నీషియం ఉన్నాయి. కాబట్టి పెరుగు తీసుకుంటే కండరపుష్టితోపాటు ఎముకల దృఢత్వం పెరుగుతుంది.

# ప్రొటీన్ లోపం ఉంటే జుట్టు రాలుతుందా

ఇటీవలి కాలంలో యువతలో కూడా జుట్టు రాలడం సమస్య ఎక్కువవుతోంది. దీనికి ఒత్తిడి, కాలుష్యం లేదా జుట్టును సరిగ్గా సంరక్షించకపోవడమే కారణమని చాలామంది భావిస్తారు. అయితే శరీరంలో ప్రొటీన్ లోపం కూడా జుట్టు ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే జుట్టు రాలడానికి ప్రతిసారీ ప్రొటీన్ లోపమే కారణం కాదు. ప్రొటీన్‌కు, జుట్టుకు ఉన్న సంబంధం ఏమిటి ఏ లక్షణాలు కనిపిస్తే వైద్యులని సంప్రదించాలో ఇప్పుడు తెలుసుకుందాం..రిజుట్టు ప్రధానంగా కెరాటిన్ అనే ప్రొటీన్‌తో తయారవుతుంది. శరీరానికి




తగినంత ప్రొటీన్ అందకపోతే, శరీరం ముందుగా గుండె, మెదడు, కాలేయం వంటి ముఖ్యమైన అవయవాలకు అవసరమైన పోషకాలను అందించడానికి ప్రాధాన్యం ఇస్తుంది. దీంతో జుట్టు పెరుగుదల మందగించి, జుట్టు ఎక్కువగా రాలే అవకాశం ఉంటుంది.

**ప్రొటీన్ లోపం ఉంటే జుట్టు రాలుతుందా?**

ఆరోగ్య నిపుణుల ప్రకారం.. దీర్ఘకాలంగా ప్రొటీన్ లోపం ఉంటే జుట్టు పెరుగుదల తగ్గవచ్చు. అయితే ప్రొటీన్ లోపం ఉన్న ప్రతి ఒక్కరికీ జుట్టు రాలుతుందని చెప్పలేం.

**జుట్టు రాలడానికి ఇతర ప్రధాన కారణాలు:**

ఒత్తిడి
హార్మోన్లలో మార్పులు
థైరాయిడ్ సమస్యలు
ఇనుము లోపం
విటమిన్ డి, బి12 లోపం
కొన్ని మందుల దుష్ప్రభావాలు
వంశపారంపర్య కారణాలు

# వార్మప్ మ్యాచ్‌లో నిషాన్ మధుష్క, రవిందు రసంత హాఫ్ సెంచరీలు



**కొలంబో:** కొలంబలో భారత్‌తో జరుగుతున్న మూడు రోజుల వార్మప్ మ్యాచ్ లో శ్రీలంక లెవన్ జట్టు మొదటి రోజు భోజన విరామ సమయానికి వికెట్ నష్టానికి 138 రన్స్ చేసింది. తొలుత టాస్ గెలిచిన శ్రీలంక లెవన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకున్నది. మొదటి వికెట్‌కు నిషాన్ మధుష్క, రవిందు రసంత 110 రన్స్ జోడించారు. 66 రన్స్ చేసిన నిషాన్ రనౌట్ అయ్యాడు. ప్రస్తుతం మూడో నెంబర్ బ్యాటర్ పసిందు సూర్యబందర క్రీజ్‌లో ఉన్నాడు. భారత జట్టు కెప్టెన్ శుభమన్ గిల్ గాయం కారణంగా టాస్‌కు వెళ్లలేదు. కేఎల్ రాహుల్ టాస్‌లో పాల్గొన్నాడు. ఓపెనర్ రవిందు 50 రన్స్ చేసి క్రీజ్‌లో ఉన్నాడు. ఉదయం భారత స్పీడ్ బౌలర్లు రాణించలేదు. సిరాజ్, ప్రసిద్ధ కృష్ణ, గుర్నూర్ బ్రార్ వికెట్లు తీయలేకపోయారు. స్పిన్‌కు పిచ్ అనుకూలించినా.. వికెట్లు మాత్రం పడలేదు.

# 2025లో 59 మంది సీఆర్పీఎఫ్ జవాన్ల ఆత్మహత్య

## గత అయిదేళ్లలో ఇదే అత్యధికం

న్యూఢిల్లీ: పారామిలిటరీ దళం సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ లో బలవన్మరణాలు పెరిగాయి. గత ఏడాది 2025లో సుమారు 59 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది ఆత్మహత్య చేసుకున్నారు. గడిచిన అయిదేళ్లలో ఇదే అత్యధికం అని డేటా ద్వారా తెలుస్తోంది. అయితే 77 శాతం కేసుల్లో.. విధి నిర్వహణలోనే సీఆర్పీఎఫ్ జవాన్లు మృతిచెందినట్లు గుర్తించారు. 262 కేసుల్లో 202 మంది విధుల్లోనే ఆత్మహత్య చేసుకున్నారు. మిగితా కేసులన్నీ ఆ సిబ్బంది సెలవుల్లో ఉన్నప్పుడు జరిగినట్లు తెలుస్తోంది. 2021 నుంచి 2025కు చెందిన డేటాను రిలీజ్ చేశారు. ఈ డేటా గురించి సీఆర్పీఎఫ్ అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. దళాల శారీరక, మానసిక ఆరోగ్యం దృఢంగా ఉండేందుకు అనేక చర్యలు చేపట్టినట్లు సీఆర్పీఎఫ్ అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతుందన్నారు. అయితే ఎక్కువ శాతం సూసైడ్ కేసుల్లో ఇంటి సంబంధిత సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఆ తర్వాత సర్వీస్, హార్డ్ డ్యూటీ కూడా కారణాలుగా ఉన్నాయి. సీఆర్పీఎఫ్‌లో సుమారు 3.25 లక్షల మంది



జవాన్లు ఉన్నారు. దేశంలోనే అతిపెద్ద భద్రతా దళం ఇది. ఎటువంటి సమయంలోనైనా కనీసం 95 నుంచి 97 శాతం మంది సిబ్బంది డ్యూటీలో ఉంటారని పేర్కొన్నారు. ఉగ్రవాదుల ఏరివేత, చొరబాటుదారులు, శాంతి భద్రత సమస్యల పరిష్కారంలో నిమగ్నమై ఉంటారు. 2025లో 59 మంది ఆత్మహత్యకు పాల్పడగా, 2024లో 46 మంది, 2023లో 57 మంది, 2022లో 43 మంది, 2021లో 57 మంది బలవన్మరణానికి పాల్పడినట్లు అధికారులు వెల్లడించారు. గత అయిదేళ్లలో 281 మంది ఆత్మహత్య చేసుకోగా, దాంట్లో 237 మంది నాన్ గెజిటెడ్ ర్యాంక్ ఉద్యోగులే ఉన్నారు.

# గ్రాండ్ చెస్ టూర్‌ను గెలుచుకున్న ప్రజ్ఞానంద



అమెరికాలో గ్రాండ్ చెస్ టూర్ సెయి ంట్ లూయిస్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ చెస్ 2026 టోర్నమెంట్ ఐదు రోజుల పాటు జరిగింది. గురువారం జరిగిన ఈ టోర్నీఫైనల్‌లో 20 ఏండ్ల భారత యువ గ్రాండ్ మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద విజేతగా నిలిచాడు. ఉజ్బెకిస్థాన్ గ్రాండ్ మాస్టర్ జవోఖిర్ సిందరోవ్ ప్రజ్ఞానందకు గట్టి పోటీనిచ్చాడు. అయినప్పటికీ 1.5 పాయింట్ల తేడాతో వెనుకపడిపోయాడు. దీంతో ఇంకో రౌండ్ మిగిలి ఉన్నప్పటికీ ప్రజ్ఞానంద టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ప్రజ్ఞానందకు యాభై వేల డాలర్ల నగదు బహుమతితో పాటు 13 పాయింట్లు దక్కా యి. దీంతో అతడు 2026 సీజన్ స్టాండింగ్స్‌లో అమెరికాకు చెందిన ఫాబియానో కరు వానా తర్వాత రెండో స్థానంలో నిలిచాడు. ఆగస్టు 10న నిర్వహించే 'సింక్వీఫీల్డ్ కప్'తో జీసీటీ సీజన్ ముగియనుంది. దీనిలో ప్రజ్ఞానందతో పాటు సెయింట్ లూయిస్ టోర్నీలో ఆడిన చెస్ క్రీడాకారులందరూ పోటీపడనున్నారు. ప్రజ్ఞానంద ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన నార్వే చెస్ టోర్నీని గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ పోటీలో జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌ను ఓడించాడు. ఈ టోర్నీలో ఏడుసార్లు నార్వే చెస్ చాంపియన్ అయిన మాగ్నస్ కార్ల్‌సన్‌ను ప్రజ్ఞానంద రెండుసార్లు ఓడించడం గమనార్హం. నార్వే చెస్ టోర్నీ గెలవడంతో తమిళ నాడు సీఎం ప్రజ్ఞానందను సన్మానించి, రూ. 50 లక్షల నగదు బహుమతి అందజేసిన సంగతి విదితమే. జీసీటీ విజయంతో ప్రజ్ఞానందను ప్రజలు ప్రశంసిస్తున్నారు.

# పాకిస్థాన్ క్రికెటర్‌కు బిగ్ షాక్

## రెండేళ్లు నిషేధం




పాకిస్థాన్ క్రికెట్ బోర్డు సంచలన నిర్ణయం తీసుకుంది. యువ ఆల్ రౌండర్ హంజా నజర్‌పై రెండేళ్ల నిషేధాన్ని విధించింది. వీసా దరఖాస్తులో తప్పుడు సమాచారం అందించినందుకు పీసీబీ ఈ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా 10 లక్షల పాకిస్థానీ రూపాయలు జరిమానా బోర్డు విధించింది. ఈ తప్పుడు సమాచారం పాకిస్థాన్ క్రికెట్ ప్రమాణాలకు విరుద్ధమని పీసీబీ పేర్కొంది. నజర్‌పై నిషేధం విధించే ముందు అతడు సమర్పించిన సమాచారంపై విచారణ జరిపేందుకు పీసీబీ ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ విచారణలో నజర్ పీసీబీ నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలడంతో బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. ఇక బోర్డు విధించిన రెండేళ్ల నిషేధ కాలంలో నజర్ ఎలాంటి క్రికెట్ టోర్నీల్లో పాల్గొనకూడదు. 31 ఏళ్ల హంజా ఇంకా పాకిస్థాన్ జాతీయ జట్టు తరఫున అరంగేట్రం చేయలేదు. అయితే దేశవాళీ మ్యాచుల్లో నజర్ అద్భుతంగా రాణించి గుర్తింపు సంపాదించాడు.

రెడ్‌బాల్ క్రికెట్‌లో నజర్ అత్యధిక వ్యక్తిగత స్కోర్ 175గా ఉంది. ఇటీవల ముగిసిన వెస్టిండీస్ టూర్‌కు అతడు పాక్ తరఫున వెళ్లాల్సి ఉంది. కానీ ఈ వీసా వివా దం కారణంగా అతడిని సెలక్టర్లు ఎంపిక చేయలేదు. మొత్తంగా అద్భుతమైన ప్రతిభ ఉన్నప్పటికీ పీసీబీ నిబంధనలను ఉల్లంఘిం చడంతో నజర్ కెరీర్ సందిగ్ధంలో పడింది.

# వైభవ్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించకుండా

## ఉండాల్సింది మాజీ క్రికెటర్ ప్రియాంక్

టీమిండియా చిచ్చర పిడుగు వైభవ్ సూర్యవంశీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లే దు. విధ్వంసకర బ్యాటింగ్‌తో మైదానంలో పరుగుల వరద పారిస్తుంటాడు. ఐపీఎల్ 2026లో అత్యధిక స్కోర్ చేసి.. విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్ వంటి స్టార్ ప్లేయర్ దాటేసి.. ఆరెంజ్ క్యాప్ అందుకున్నాడు. అలానే ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. ఆ సిరీస్‌లో అంతగా రాణించలే కపోయినా.. జింబాబ్వేతో జరిగిన మూడో మ్యాచుల టీ20 సిరీస్‌లో చక్కగా రాణించి.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకు న్నాడు. ఈ క్రమంలోనే దేశవాళీలో తూర్పు జోన్ జట్టుకు వైభవ్ వైస్ కెప్టెన్‌గా ఎంపి కయ్యాడు. వైభవ్‌కు వెస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించడం సరైన నిర్ణయం కాదంటూ మాజీ క్రికెటర్ ప్రియాంక్ పంచల్ కీలక వ్యాఖ్యలు చేశాడు.

**ఈ 5 అలవాట్లు ఉన్నవాళ్లు మూర్ఖులు**

త్వరలో జరగనున్న దులీప్ ట్రోఫీకి వైభవ్ సూర్యవంశీని తూర్పు జోన్ జట్టుకు కెప్టెన్‌గా ఇషాన్ కిషన్, వైస్ కెప్టెన్‌గా వైభవ్ సూర్యవంశీ ఎంపికయ్యారు. ఈ నిర్ణయంపై మాజీ క్రికెటర్ ప్రియాంక్ పంచల్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ఉండాల్సింది అని, ముందుగా సూర్యవంశీ రెడ-బాల్ క్రికెట్ పరిస్థితులను అర్థం చేసుకోవడమే అతి ముఖ్యమని అతడు పేర్కొన్నాడు. బీహార్ తరఫున ఈ 15 ఏళ్ల సంచలనం ఇప్పటివరకు కేవలం 8 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లు మాత్రమే ఆడాడని గుర్తు చేశాడు.




'జోనల్ సెలెక్టర్లు వైభవ్ సూర్యవంశీని ఈస్ట్ జోన్ వైస్ కెప్టెన్‌గా నియమించకుండా ఉండాల్సింది అని నేను అభిప్రాయపడుతు న్నాను. అది వైభవ్‌పై అనవసరమైన ఒత్తిడిని పెంచుతుంది.

అతనికి అలాంటి బాధ్యతలు అప్పగి ంచే ముందు, రెడ్ బాల్ క్రికెట్ డైన మిక్స్‌ను సరిగ్గా అర్థం చేసుకోనివ్వాలి' అని పంచల్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు.

# శ్రీలంకతో కీలక సిరీస్ శుభ్‌మన్ గిల్

## గాయంపై స్పందించిన బీసీసీఐ

శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు ముందు భారత జట్టును గాయాల సమస్య వెంటాడుతోంది. ఇప్పటికే హార్దిక్ పాండ్య, నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి ఇప్పటికే పరిమిత ఓవర్ల క్రికెట్‌కు దూరం కాగా.. సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్ గాయాల నుంచి కోలుకుంటున్నారు. మరోవైపు స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా మోకాలి సమస్య కారణంగా ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే శ్రీలంక టెస్టు సిరీస్‌కు దూరమయ్యాడు. ఈ క్రమంలో భారత జట్టు అభిమానులకు ఓ షాకింగ్ న్యూస్. టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయపడ్డాడు. శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు ముందు.. టీమిండియా వార్మప్ మ్యాచ్ ఆడుతోంది. గురువారం ప్రాక్టీస్ చేస్తుండగా గిల్ చేతి వేలికి గాయమైనట్లు బీసీసీఐ తెలిపింది. వహిస్తాడు. బీసీసీఐ వైద్య బృందం గిల్ గాయంపై పర్యవేక్షిస్తోంది' అని బీసీసీఐ తెలిపింది.

# హాకీ ప్రపంచ కప్ 28 ఏళ్ల తర్వాత

## టోర్నీలో భారత అంపైర్‌కు నో ఛాన్స్

హాకీ ప్రపంచ కప్‌లో దాదాపు మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న భారత అంపైర్ల ప్రాతినిధ్యానికి ఈసారి బ్రేక్ పడింది. ఆగస్టు 15 నుంచి నెదర్లాండ్స్, బెల్జియంలో ప్రారంభం కానున్న ఎఫ్ఐహెచ్ పురుషుల హాకీ ప్రపంచ కప్‌లో ఒక్క భారత అంపైర్ లేదా టెక్నికల్ అధికారి కూడా చోటు దక్కించుకోలేదు. 1998లో యూట్రెక్ట్‌లో జరిగిన ప్రపంచ కప్ తర్వాత తొలిసారి ఈ పరిస్థితి నెలకొంది. యూరప్ దేశాలకు చెందిన అధికారులు ప్యానెల్‌లో ఎక్కువగా ఉన్నారు. ఆధునిక కాలంలో పురుషుల ప్రపంచ కప్‌లకు భారత్ నుంచి ఇప్పటివరకు నలుగురు మాత్రమే అంపైర్లుగా వ్యవహరించారు. అమర్‌జిత్ సింగ్ బావా (1990), తార్లోక్ సింగ్ భుల్లర్ (1994), సతీందర్ శర్మ (2002, 2006, 2010), ఆర్.వీ. రఘు ప్రసాద్ (2010, 2014, 2018, 2023) ఈ ఘనత సాధించారు. గతేడాది అంతర్జాతీయ అంపైరింగ్‌కు వీడ్కోలు పలికిన రఘు ప్రసాద్ ఈ అంశంపై మాట్లాడారు. ప్రతిష్ఠాత్మక టోర్నీలకు అధికారుల ఎంపిక నిరంతర ప్రదర్శనల ఆధారంగానే జరుగుతుందని తెలిపారు. ప్రపంచ కప్, ఒలింపిక్స్, ప్రో లీగ్ వంటి టోర్నీల్లో అంపైర్ల ప్రదర్శనలను ఎఫ్ఐహెచ్ అంపైరింగ్ కమిటీ పరిశీలిస్తుందని.. కొంతకాలం పాటు నిలకడగా రాణించడం అవసరమని చెప్పారు.

**వారితో పోటీ అంత సులువు కాదు..**

భారత్‌కు చెందిన మరో మాజీ అంపైర్ సతీందర్ శర్మ ప్రపంచ కప్ ప్యానెల్‌లో భారత్ ప్రాతినిధ్యం లేకపోవడం నిరాశ కలిగిస్తోందన్నారు. అమర్‌జిత్ సింగ్ బావా, తార్లోక్ సింగ్ భుల్లర్ తర్వాత తాను, రఘు ప్రసాద్ భారత అంపైరింగ్ వారసత్వాన్ని కొనసాగించామని చెప్పారు. 'యూరప్‌కు చెందిన అంపైర్ల మధ్య మనల్ని మనం నిరూపించుకోవడం అంత సులువు కాదు. ప్రస్తుతం భారత్ వెనుకబడుతోంది. దేశీయ అంపైర్లకు అంతర్జాతీయ స్థాయి టోర్నీల్లో ఎక్కువ అవకాశాలు కల్పించాలి. దేశీయ, అంతర్జాతీయ అంపైరింగ్‌లో చాలా తేడా ఉంటుంది. అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో అనుభవం లేకుండా అంపైర్లు ఎలా ఎదుగు తారు జాతీయ జట్టు శిక్షణ శిబిరాల్లో అంపైర్లకు కూడా అవకాశం కల్పించాలి. ఆధునిక హాకీ డిమాండ్లను అర్థం చేసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. ప్రతిభ ఉన్నప్పటికీ అంపైర్లకు సరైన అవకాశాలు, ఫెడరేషన్ మద్దతు అవసరం. వచ్చే ప్రపంచ కప్ లేదా ఒలింపిక్స్‌లో భారత్ ప్రాతినిధ్యం ఉండాలంటే పక్కా ప్రణాళిక, క్రమబద్ధమైన వ్యవస్థ అవసరం' అని సతీందర్ శర్మ పేర్కొన్నారు.




**ఆర్థిక భద్రత కూడా పెద్ద సమస్యే..!**

హాకీ ఇండియా 2025లో వెల్లడించిన వివరాల ప్రకారం.. పురుషుల అంపైరింగ్ వ్యవస్థలో కోర్ లీడింగ్ ప్యానెల్, లీడింగ్ ప్యానెల్, హై పొటెన్షియల్, నేషనల్ అంపైర్స్ అంటూ నాలుగు విభాగాలు ఉన్నాయి. ఇందులో 100 మందికి పైగా అధికారులు ఉన్నప్పటికీ.. ఎఫ్ఐహెచ్ ప్యానెల్‌లో భారత పురుష అంపైర్లు ఆరుగురు, మహిళలు నలుగురు మాత్రమే ఉన్నారు. అంతేకాదు, భారత్‌లో పురుషుల టెక్నికల్ అధికారులు నలుగురు, మహిళలు ఇద్దరే ఉన్నారు. అంపైర్లకు సరైన ఆర్థిక భద్రత లేకపోవడం కూడా ఈ వృత్తి వైపు యువత రావడానికి అడ్డంకిగా మారుతోందని మాజీ అధికారులు చెబుతున్నారు. తమ రోజుల్లో దేశీయ టోర్నీల్లో రోజుకు రూ. 150-200, అంతర్జాతీయ పోటీల్లో 40-50 అమెరికన్ డాలర్ల వరకు భత్యం లభించేదని మాజీ అంపైర్ సతీందర్ శర్మ తెలిపారు.

# అరంగేట్రం తర్వాత రెండేళ్లు అవకాశం

## కోసం ఎదురుచూశా అజింక్య రహానె




భారత మాజీ క్రికెటర్ అజింక్య రహానె తన కెరీర్‌లో ఎదుర్కొన్న కఠిన పరిస్థితులను గుర్తు చేసుకున్నాడు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. జాతీయ జట్టులోకి వచ్చిన తొలి రెండేళ్లు ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండా 12వ ప్లేయర్‌గానే కొనసాగానని తెలిపాడు. ఆ సమయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ.. వాటిని సానుకూలంగా తీసుకుని ఎన్నో విషయాలు నేర్చుకున్నానని చెప్పాడు. 2011లో రహానె వైట్‌బాల్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. అయితే టెస్టు జట్టులో చోటు దక్కినా.. అరంగేట్రం చేసేందుకు మరో రెండేళ్లు వేచి చూడాల్సి వచ్చింది. ఈ సమయంలో జట్టుతో కలిసి పర్యటించినా ఎక్కువగా 12వ ఆటగాడిగానే ఉండేవాడు. చివరకు 2013లో ఆస్ట్రేలియాతో టెస్టు అరంగేట్రం చేశాడు. '2011లో జట్టులోకి వచ్చినప్పుడు తొలి రెండేళ్లు చాలా కఠినంగా గడిచాయి. టెస్టు అరంగేట్రం కోసం 20 మ్యాచ్‌ల వరకు వేచి చూడాల్సి వచ్చింది. రెండేళ్ల పాటు 12వ ఆటగాడిగానే ఉన్నాను. అది నాకు సవాలుతో కూడుకున్న దశ. అయితే దాని నుంచి చాలా నేర్చుకున్నా. ఆ సమయంలో నాకు రెండు మార్గాలు కనిపించాయి. ఒకటి సానుభూతి పొందడం.. మరొకటి నన్ను నేను మెరుగుపరుచుకోవడం. 12వ ఆటగాడిగా ఉండటంలో, సహచరులకు డ్రింక్స్ అందించడంలో లేదా వారికి సహాయం చేయడంలో తప్పేమీ లేదు. నేను దానిని సానుకూలంగా తీసుకున్నా. నేను ప్రతి విషయాన్ని గమనించేవాడిని. దాని వల్ల నా వైఖరి, ఆలోచనా విధానం మెరుగయ్యాయి. సానుభూతి పొందడం చాలా సులభం. కానీ నేను ఎప్పుడూ దానిని కోరుకోలేదు. ఆ అనుభవమే నన్ను సుదీర్ఘకాలం క్రికెట్ ఆడేలా చేసింది' అని రహానె పేర్కొన్నాడు.

**ఓపికతోనే సుదీర్ఘ ప్రయాణం**

తన కెరీర్‌లో ఓపిక ఎంతో కీలక పాత్ర పోషించిందని రహానె చెప్పాడు. అయితే చిన్నప్పటి నుంచే తనలో అంతటి సహనం లేదని వెల్లడించాడు. 'నాకు మొదటి నుంచి ఓపిక అస్సలు ఉండేది కాదు. ఆటలో అనుభవం పెరిగే కొద్దీ అది కూడా అలవడింది. ముంబైలో లోకల్ రైలులో ప్రయాణించడం కూడా సవాలుతో కూడుకున్నదే. అక్కడి నుంచే ఎక్కడో ఓపిక పెరుగుతుంది. దేశవాళీ క్రికెట్‌లో ఆడుతూ వరుసగా పరుగులు సాధిస్తే.. భారత్‌కు ఎప్పుడు ఎంపిక చేస్తారనే ఆలోచన సహజంగానే వస్తుంది. నాకు కూడా అలాంటి ఆలోచనే ఉండేది.

అయితే సీనియర్ ఆటగాళ్లతో మాట్లాడిన తర్వాత, టైమ్ వచ్చినప్పుడు అవకాశం తప్పకుండా వస్తుందని అర్థమైంది. మన చేతుల్లో ఉన్నదానిపైనే దృష్టి పెట్టాలి. సుదీర్ఘకాలం క్రికెట్ ఆడాలంటే ఓపిక చాలా ముఖ్యం' అని రహానె వివరించాడు.

# నా జీవితాన్ని ఒక్కరి కోసం మార్చుకోలేన

## పెళ్లిపై 51 ఏళ్ల అమీషా సంచలన కామెంట్స్



ఒకప్పుడు తెలుగు, హిందీ చిత్రాల్లో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న అమీషా పటేల్ మరోసారి తన వ్యక్తిగత జీవితంపై చేసిన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. 51 ఏళ్ల వయసులోనూ అవివాహితగా కొనసాగుతున్న ఆమె, పెళ్లి గురించి తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించారు. తాను ఎప్పటికీ పెళ్లి చేసుకోనని, ప్రస్తుతం సింగిల్ జీవితంతో ఎంతో సంతోషంగా ఉన్నానని చెప్పారు. తాజాగా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా అభిమానులతో నిర్వహించిన 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లో ఓ అభిమాని.. మీరు ఎప్పుడు పెళ్లి చేసుకుంటారు అని ప్రశ్నించాడు. దీనికి ఏమాత్రం సందేహించకుండా అమీషా తన అభిప్రాయాన్ని వెల్లడించారు.నేను ఎప్పటికీ పెళ్లి చేసుకోను. సింగిల్‌గా చాలా సంతోషంగా ఉన్నాను. నన్ను ప్రేమించే కుటుంబ సభ్యులు, స్నేహితులు నాకు చాలామంది ఉన్నారు. ఒక్క వ్యక్తి కోసం నా జీవితాన్ని, నా ఆనందాన్ని పూర్తిగా మార్చుకోవాలని నేను అనుకోవడం లేదు అని ఆమె సమాధానం ఇచ్చారు. అమీషా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆమె అభిప్రాయానికి కొందరు నెటిజన్లు మద్దతు తెలుపుతూ.. ప్రతి ఒక్కరికీ తమ జీవితాన్ని తమకు నచ్చిన విధంగా గడిపే హక్కు ఉందని కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు మాత్రం పెళ్లి అనేది పరస్పర అవగాహన, ప్రేమ, సహజీవనానికి ప్రతీక అని అభిప్రాయ పడుతున్నారు.గతంలో ఓ ఇంటర్వ్యూలో అమీషా పటేల్ తన ప్రేమ జీవితం గురించి కూడా మాట్లాడారు. సినీ రంగంలోకి రావడం తన అప్పటి ప్రియుడికి ఇష్టం లేకపోవడంతో ఆ బంధం ముగిసిందని ఆమె వెల్లడించారు. ఆ అనుభవం తన జీవితంలో చాలా విషయాలు నేర్పిందని చెప్పారు. అలాగే, తన కెరీర్‌ను అర్థం చేసుకుని ప్రోత్సహించే వ్యక్తి దొరికితే పెళ్లి గురించి ఆలోచించేవారినని, కానీ అలాంటి మానసిక పరిణతి ఉన్న భాగస్వామిని కనుగొనడం సులభం కాదని పేర్కొన్నారు. వయసు కంటే వ్యక్తిత్వం, ఆలోచనా విధానమే ముఖ్యమని కూడా ఆమె అభిప్రాయపడ్డారు.అమీషా పటేల్ ఇటీవల సన్నీ డియోల్ సరసన నటించిన 'గదర్ 2' చిత్రం తో ఘన విజయాన్ని అందుకున్నారు. సకీనా పాత్రలో ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించింది. అనంతరం 'తౌబా తేరా జల్వా' చిత్రంలో కనిపించిన అమీషా, ప్రస్తుతం తన తదుపరి ప్రాజెక్ట్‌లపై దృష్టి సారిస్తున్నారు.

# దండాతో ట్రెండ్ క్రియేట్ చేసిన దొర సాయి తేజ

## నటుడిగా నిర్మాతగా ఎదుగుతున్న తీరు ఇదే



యూట్యూబ్ వర్టికల్ స్టోరీస్‌లో చాయ్ షాట్స్ ద్వారా ప్రేక్షకులకు పరిచయమై, ప్రస్తుతం 'దండా' సిరీస్‌తో ట్రెండ్ సృష్టిస్తున్న యువ నటుడు దొర సాయి తేజ తన సినీ ప్రయాణం, కష్టాలు, భవిష్యత్తు ప్రణాళికల గురించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. బాలనటుడిగా కెరీర్ ప్రారంభించి, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా, ఆ తర్వాత యూట్యూబ్ క్రియేటర్‌గా ఎదిగిన ఆయన ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకంగా సాగుతోంది.చిన్నతనంలోనే ప్రభాస్ 'అడవి రాముడు' చిత్రంలో హీరో చిన్నప్పటి పాత్రకు డబ్బింగ్ చెప్పిన సాయి తేజ, ఆ తర్వాత 'కొత్త బంగారు లోకం', 'హై స్కూల్' సిరీస్‌లతో పాటు 'అలా మొదలైంది' సినిమాలోనూ చిన్న పాత్రలో నటించారు. 2016 నుంచి రామ్ గోపాల్ వర్మతో ఏర్పడిన అనుబంధం ద్వారా సినిమా రంగంపై మరింత అవగాహన పెంచుకున్నారు. 2018 నుంచి యూట్యూబ్ జర్నీని సీరియస్‌గా తీసుకున్న ఆయన, 'బ్యాక్ బెంచర్స్' సిరీస్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కేవలం నటుడిగానే కాకుండా, గత ఏడాది సొంతంగా కంటెంట్ క్రియేషన్ కంపెనీని ప్రారంభించి వ్యాపారవేత్తగానూ రాణిస్తున్నారు.నిద్ర లేచిన క్షణం నుంచి ఒక కంటెంట్ క్రియేటర్‌గా, డైరెక్టర్‌గా, యాక్టర్‌గా, ప్రొడ్యూసర్‌గా ఆలోచిస్తానని, కంటెంట్ క్రియేషన్ అనేది తన బిజినెస్ అయితే సినిమా అనేది తన ప్యాషన్ అని ఆయన స్పష్టం చేశారు. సాధారణ యువకుడిలా పార్టీలకు, ఎంజాయ్‌మెంట్‌కు దూరంగా ఉంటూ, తన వయసు కంటే ఐదేళ్లు పెద్దవాడిలా ఆలోచిస్తూ ప్రతి రోజూ కొత్తగా ఏదో ఒకటి క్రియేట్ చేయడమే తన లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సోషల్ మీడియా అనేది వైకుంఠపాళి లాంటిదని, ఇక్కడ ప్రశంసలతో పాటు విమర్శలను కూడా ఎదుర్కొనే మానసిక స్థైర్యం ఉండాలని కొత్తవాళ్లకు సలహా ఇస్తున్నారు.'దండా' సిరీస్‌లో అరవింద్ పాత్రకు వస్తున్న రెస్పాన్స్ తనకెంతో సంతృప్తినిచ్చిందని, దర్శకుడు ఆదిత్య దేవులపల్లి సపోర్ట్ వల్లే ఈ ఛాలెంజింగ్ పాత్రను సింగిల్ టేక్‌లో పూర్తి చేయగలిగానని తేజ వెల్లడించారు. ప్రొడక్షన్ కాస్ట్ తగ్గించాలనే ఉద్దేశంతోనూ, సెట్‌లో పూర్తిగా ఆ పాత్రలోనే లీనమైపోవాలనే సంకల్పంతోనూ తాను ఎక్కువ టేక్స్ తీసుకోలేదన్నారు. అలాగే నేటి కాలంలో కంటెంట్ ఎంత బాగున్నా సరైన మార్కెటింగ్ స్ట్రాటజీ లేకపోతే ఉపయోగం ఉండదని, 'దండా' ప్రమోషన్స్ కోసం తాము చేసిన వినూత్న ప్రయత్నాలే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు.సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ల బాధ్యత చాలా ఎక్కువగా ఉంటుందని, సెలబ్రిటీల కంటే యూత్ ఇన్‌ఫ్లూయెన్సర్లను ఎక్కువగా అడ్మైర్ చేస్తారని, కాబట్టి వారు మాట్లాడే తీరు, వేసుకునే బట్టలు కూడా సమాజంపై ప్రభావం చూపుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో అందరూ సాధారణంగా రిలేట్ అయ్యే కథలు, జీరో టు హీరో పాత్రలు చేస్తూ, ప్రేక్షకులు తమ కోసం ఖర్చు పెట్టే ప్రతీ రూపాయికి న్యాయం చేయాలనే లక్ష్యంతో పని చేస్తానని దొర సాయి తేజ స్పష్టం చేశారు.

# రాజకీయాల్లో మాట్లాడితే ఇలాగే ఉంటుంది

## ఉదయనిధి వ్యాఖ్యలపై స్పందించిన విశాల్





ప్రముఖ నటుడు విశాల్ ఇటీవల తన తాజా చిత్రం 'మకుటం' ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో తమిళనాడు రాజకీయాలపై, డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు మరియు ఆయన అరెస్ట్ పరిణామాలపై ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. రాజకీయ నాయకులు బహిరంగ వేదికలపై మాట్లాడేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, లేకపోతే ఇలాంటి ఊహించని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఉదయనిధి స్టాలిన్ ప్రసంగాన్ని తాను స్వయంగా చూశానని, ప్రతి ఒక్కరికీ భావప్రకటన స్వేచ్ఛ ఉంటుందని, అయినప్పటికీ కొన్ని సున్నితమైన విషయాలలో హద్దులు దాటకుండా ఉండటం చాలా ముఖ్యమని విశాల్ హితవు పలికారు.ముఖ్యంగా రాజకీయ ప్రసంగాలు చేసేటప్పుడు ముందుగానే స్క్రిప్ట్ రాసుకుని దాని ప్రకారం మాట్లాడితే ఇలాంటి వివాదాలకు ఆస్కారం ఉండదని, అయితే సభల్లో అప్పటికప్పుడు ఉత్సాహంతో సహజంగా మాట్లాడేటప్పుడు మాత్రం చాలా జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. లయోలా కాలేజీలో తనతో పాటు చదువుకున్న తన సీనియర్ విజయ్, తన బ్యాచ్‌మేట్ అయిన ఉదయనిధి స్టాలిన్ ఒకరోజు ఇలా ఊహించని రీతిలో అరెస్ట్ అవుతారని తాను కలలో కూడా ఊహించలేదని విశాల్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రస్తుతం విజయ్ కూడా పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి అడుగుపెట్టారని, ఇవన్నీ ప్రస్తుత రాజకీయాల్లో సర్వసా ధారణమైన భాగమేనని, ఇదే అసలైన రాజకీయం అంటే అని ఆయన వ్యాఖ్యానించారు.ఇదిలా ఉంటే, నటుడు విశాల్ త్వరలోనే ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాబోతున్నాడనే ప్రచారం తమిళనాడు రాజకీయ వర్గాల్లో మరియు సినీ ఇండస్ట్రీలో విపరీతంగా జరుగుతోంది.

ఇప్పటివరకు సిని మాల ద్వారా తాను సంపాదించుకున్న మంచి పేరును, ప్రజా సేవకు పూర్తిగా ఉపయోగించుకోవాలని భావిస్తున్నట్లు ఇటీవల ఒక బహిరంగ వేదికపై విశాల్ స్వయంగా వెల్లడించడంతో ఈ పొలిటికల్ ఎంట్రీ వార్తలకు మరింత బలం చేకూరింది.

త్వరలోనే ఆయన అధికారికంగా రాజకీయ రంగప్రవేశం చేసే అవకాశం ఉందని కోలీవుడ్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చలు నడుస్తున్నాయి.

## దూకుడు సక్సెస్ వెనుక అసలు హీరో మహేష్ బాబే రీ-రిలీజ్ ముందు శ్రీను వైట్ల ఆసక్తికర వ్యాఖ్యలు

సూపర్ స్టార్ మహేష్ బాబు కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌లలో ఒకటైన 'దూకుడు' మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 9న ఈ చిత్రం రీ-రిలీజ్ అవుతున్న నేపథ్యంలో దర్శకుడు శ్రీను వైట్ల పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. దూకుడు సినిమా ఇంత పెద్ద విజయం సాధించడానికి ప్రధాన కారణం మహేష్ బాబే. ఆయన లేకపోతే ఈ సినిమా ఆ స్థాయిలో ఉండేది కాదు. సినిమా షూటింగ్ జరుగుతున్నప్పుడే ఇది సంచలనం సృష్టిస్తుందని నాకు బలమైన నమ్మకం కలిగింది. అదే నమ్మకంతో సినిమాలో 'ఆల్ టైమ్ రికార్డ్' అనే డైలాగ్ కూడా పెట్టాను. చివరికి అది నిజమైంది అని తెలిపారు.అప్పట్లోనే ఈ చిత్రం ఓవర్సీస్‌లో 2.4 మిలియన్ డాలర్లకు పైగా వసూళ్లు సాధించడం కూడా ప్రత్యేకమని ఆయన గుర్తు చేశారు. మహేష్ బాబుతో తనకు అద్భుతమైన అనుబంధం ఉందని శ్రీను వైట్ల చెప్పారు. "మా ఇద్దరి మధ్య మంచి వేవ్‌లెంగ్త్ ఉండేది. నేను చెప్పే విషయాన్ని మహేష్ వెంటనే అర్థం చేసుకునేవారు. ఇస్తాంబుల్‌లో ఫస్ట్ షెడ్యూల్ సమయంలో 'మైండ్‌లో ఫిక్స్ అయితే బ్లైండ్‌గా వెళ్లిపోతా' అనే డైలాగ్ వినిపించగా ఆయన చాలా బాగుందని చెప్పారు. అప్పటి నుంచి మరిన్ని పంచ్ డైలాగులు, వన్‌లైనర్లు రాయాలనే ఉత్సాహం పెరిగింది. మహేష్ చెప్పే డైలాగ్ డెలివరీ నాకు మరింత ఎనర్జీ ఇచ్చేది" అని అన్నారు. సినిమా మొత్తం 140 రోజుల్లో పూర్తయిందని, అందులో టాకీ పార్ట్‌ను కేవలం 42 రోజుల్లో పూర్తి చేశామని తెలిపారు.ఇస్తాంబుల్‌లో జరిగిన షూటింగ్‌కు సంబంధించిన కొన్ని ఆసక్తికర సంఘటనలను కూడా శ్రీను వైట్ల పంచుకున్నారు. అక్కడి ట్రాఫిక్ కారణంగా షూటింగ్ ముగిసిన తర్వాత హోటల్‌కు చేరుకోవడానికి ఐదు గంటల సమయం పట్టేదని, అప్పుడు లోకల్ ట్రైన్‌లో వెళ్దామని మహేష్ సూచించడంతో కేవలం గంటలోనే హోటల్‌కు చేరుకునేవాళ్లమని చెప్పారు. అదే సమయంలో తాము బస చేసిన హోటల్‌లో భూకంపం రావడం, అందరూ భయంతో బయటకు పరుగులు తీయడం వంటి సంఘటనలు ఇప్పటికీ గుర్తున్నాయని అన్నారు. అలాగే సమంత షాపింగ్‌కు వెళ్లిన సమయంలో ఆమెకు సమీపంలోనే బాంబు పేలుడు జరగడం, షూటింగ్ ముగిసిన రోజు పాస్‌పోర్టులు ఉన్న బ్యాగ్ క్యాబ్‌లో మరిచిపోవడం వంటి ఉత్కంఠభరిత సంఘటనలను కూడా ఆయన గుర్తు చేసుకున్నారు.

చివరగా క్యాబ్ డ్రైవర్ నిజాయితీగా బ్యాగ్‌ను తిరిగి తీసుకొచ్చాడని, ఆనందంతో నిర్మాత తన వద్ద ఉన్న డబ్బంతా అతనికి బహుమతిగా ఇచ్చారని శ్రీను వైట్ల తెలిపారు. సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.

## డీసీ మూవీ రివ్యూ దర్శకుడు

## లోకేశ్ కనగరాజ్ హీరోగా మెప్పించాడా



సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా కోలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న లోకేశ్ కనగరాజ్, మెగాఫోన్ పక్కన పెట్టి తొలి సారిగా పూర్తి స్థాయి కథానాయకుడిగా నటించిన చిత్రం 'డీసీ'. విలక్షణ దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ తెరకెక్కించిన ఈ రా అండ్ రస్టిక్ యాక్షన్ డ్రామా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. భారీ అంచనాల నడుమ విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను ఏ మేరకు అలరించిందో పూర్తి రివ్యూలో తెలుసు కుందాం.

**కథ**

ప్రభుత్వ ఆయుధాలను రవాణా చేస్తున్న వాహనాన్ని దేవదాస్ (లోకేశ్ కనగరాజ్) అండ్ గ్యాంగ్ అత్యంత వ్యూహాత్మకంగా అడ్డగించి లూటీ చేస్తుంది. ఆ లూటీ చేసిన గనతోనే ఒక ఎస్పైని దారుణంగా హత్య చేయడంతో, పోలీస్ డిపార్ట్‌మెంట్ ఈ కేసును సవాల్‌గా తీసుకుని ఓ స్పెషల్ టీమ్‌ను రంగంలోకి దించుతుంది. పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో దేవదాస్ గ్యాంగ్ ఒక లాడ్జిలో ఆశ్రయం పొందుతుంది. అక్కడ బార్‌లో పాడుకునే పార్వతి (సంజయ్ కృష్ణమూర్తి)తో దేవదాస్‌కు ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమగా మారుతుంది. అయితే అనూహ్యంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో పార్వతి మరణిస్తుంది. ఆ తర్వాత పోలీసుల కంటపడకుండా తిరుగుతూ, వేశ్యవాటికలో చిక్కుకున్న చంద్రిక (వామికా గబ్బి)ని దేవదాస్ కలుస్తాడు. అసలు దేవదాస్ గ్యాంగ్‌స్టర్‌గా ఎందుకు మారాల్సి వచ్చింది ఎస్పైని హత్య చేయాల్సిన అవసరం అతనికి ఎందుకు వచ్చింది చంద్రికను కలిశాక అతడి జీవితం ఎలాంటి మలుపు తిరిగింది అనేదే ఈ చిత్ర అసలు కథ.

**విశ్లేషణ**

"తప్పు చేస్తే దండించడానికి పోలీసులు వస్తారు.. కానీ, ఆ పోలీసులే తప్పు చేస్తే ఎవరిని ప్రశ్నించాలి" అనే ఆసక్తికరమైన మరియు పవర్‌ఫుల్ పాయింట్‌తో దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ ఈ కథను నడిపించారు. ఇదొక క్లాసిక్ రివెంజ్ డ్రామా అయినప్పటికీ, ఇందులో ప్రేమ, స్నేహం, వ్యవస్థలోని లోపాలను చూపించే ప్రయత్నం చేశారు. అయితే కథాకథనాల విషయంలో దర్శకుడు మరింత పకడ్బందీగా వ్యవహరించాల్సి ఉంది. సినిమా ప్రథమార్ధం చాలా నెమ్మదిగా, సాగదీతగా అనిపిస్తుంది. ఆయుధాల లూటీ, ఎస్పై హత్య, ఆ తర్వాత దేవదాస్ పరారీ, పార్వతితో నడిచే లవ్ ట్రాక్ వంటి సన్నివేశాలు ప్రేక్షకుడిని పెద్దగా ఆకట్టుకోలేవు. ఎప్పుడైతే పోలీసుల కాల్పుల్లో పార్వతి పాత్ర అంతమవుతుందో, అప్పుడే కథ అసలు రూపం సంతరించుకుని వేగం పుంజుకుంటుంది. ఇక ఇంటర్వెల్ బ్యాక్‌లో వచ్చే యాక్షన్ బ్లాక్ సినిమా స్థాయిని ఒక్కసారిగా పైకి లేపుతుంది. ద్వితీయార్ధమే ఈ చిత్రానికి అసలైన ప్రాణం అని చెప్పవచ్చు. దేవదాస్, చంద్రికల మధ్య నడిచే ఎమోషనల్ సీన్స్ సినిమాను నిలబెట్టాయి. డబ్బు కోసం చంద్రిక వేసే ప్లాన్, పోలీసులకు దొరికిపోయిన దేవదాస్‌ను రక్షించడానికి ఆమె నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లే సన్నివేశం సినిమాలోనే హైలైట్‌గా నిలుస్తుంది. ఇక క్లైమాక్స్‌లో వచ్చే హెవీ యాక్షన్ సీక్వెన్స్, దానికి ముగింపుగా ఇచ్చిన ఎమోషనల్ టచ్ ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇస్తుంది.

**నటీనటుల ప్రతిభ..**

దర్శకుడిగా బ్లాక్‌బస్టర్ హిట్లు ఇచ్చిన లోకేశ్ కనగరాజ్, నటుడిగా తన మొదటి ప్రయత్నంలోనే మంచి పరిణతి చూపించారు. నటనకు పెద్దగా ఎక్స్‌ప్రెషన్స్ స్కోప్ లేని సీరియస్ రోల్ అయినప్పటికీ, తన బాడీ లాంగ్వేజ్‌తో యాక్షన్ సీన్లలో అదరగొట్టేశారు. ఇక ఈ సినిమాకు అసలైన షో స్టాపర్ మాత్రం వామికా గబ్బి. చంద్రిక పాత్రలో ఆమె జీవించిన తీరు, అభినయం, హావభావాలు సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సెకండాఫ్‌లో ఆమె నటన సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. మిగిలిన నటీనటులు తమ పాత్రల పరిధి మేరకు చక్కగా నటించారు.

## కొడుకుపై కేసు వేసిన తండ్రి తెలంగాణ పల్లె

## నేపథ్యంలో ఆసక్తికరంగా పళ్లబురుసు ట్రైలర్



'లెనిన్' సినిమా విజయంతో జోష్‌లో ఉన్న అన్నపూర్ణ స్టూడియోస్ నుంచి మరో ఆసక్తికర చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో రూపొందిన విలేజ్ కామెడీ డ్రామా 'పళ్లబురుసు' ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్‌తో మంచి ఆసక్తిని రేకెత్తించగా, తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచు తోంది. 'పళ్లబురుసు' ట్రైలర్ ఒక వినూత్న మైన కామెడీ కాన్సెప్ట్‌తో ప్రారంభమవుతుంది. తనకు పళ్లబురుసు (టూత్ బ్రష్) కొనివ్వ లేదని ఓ తండ్రి సొంత కొడుకుపైనే కేసు వేయడం కథలో ప్రధాన ట్విస్ట్‌గా కనిపిస్తోంది. అప్పుల భారంతో సతమతమవుతున్న కొడుకు, చిన్న కోరిక కూడా తీర్చలేక తండ్రి తో గొడవ పడటం.. ఆ చిన్న గొడవ క్రమంగా పెద్ద వివాదంగా మారి కోర్టు వరకు వెళ్లడం ఆసక్తిని కలిగిస్తోంది.కేవలం హాస్యమే కాకుండా తండ్రీకొడుకుల మధ్య ఉన్న భావోద్వేగాలను కూడా ట్రైలర్‌లో హృదయానికి హత్తుకునేలా చూపించారు. కుటుంబానికి దూరమైన తండ్రి.. మళ్లీ తన కొడుకుతో కలవాలని తపనపడటం.. మరో వైపు కుటుంబ బాధ్య తల మధ్య నలిగిపోయే కొడుకు మనస్తత్వాన్ని దర్శకుడు భావోద్వే గంగా ఆవిష్కరించినట్లు కనిపిస్తోంది. అంద మైన తెలంగాణ పల్లె వాతావరణం, గ్రామంలోని వృద్ధుల సరదా సంభాషణలు, యువ జంట ప్రేమకథ, స్థానిక సంస్కృతి, యాస, భాష ట్రైలర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహించారు. 'బలగం' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ఈ సినిమాలో తండ్రీకొడుకులుగా నటిస్తున్నారు. ప్రజ్వల్, గోమతి రెడ్డి, కిరణ్ మచా తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించగా, ఆదిత్య శెట్టి, వివేక్ కృష్ణాని నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. 'లవ్ స్టోరీ' ఫేమ్ పవన్ సీహెచ్ సంగీతం అందిస్తున్నారు. తెలంగాణ పల్లె టూరి జీవనశైలి, సహజమైన పాత్రలు, వినోదంతో పాటు కుటుంబ భావోద్వేగాలను మేళవించిన 'పళ్లబురుసు' చిత్రం ఆగస్టు 14న థియేటర్లలో విడుదల కానుంది. ట్రైలర్‌కు లభిస్తున్న స్పందనను బట్టి చూస్తే, ఈ చిన్న సినిమా ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## దండాతో ట్రెండ్ క్రియేట్ చేసిన దొర సాయి తేజ

## నటుడిగా నిర్మాతగా ఎదుగుతున్న తీరు ఇదే

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు' ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి స్పందనను సొంతం చేసుకుంటోంది. విడుదలైన తొలి షో నుంచే సినిమాకు పాజిటివ్ టాక్ రావడంతో చిత్రబృందంలో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రత్యేక ట్వీట్ చేశారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించిన కొరియన్ కనకరాజు లో వరుణ్ తేజ్ సరసన రితిక నాయక్ హీరోయిన్‌గా నటించారు.

రాయలసీమ నేపథ్యానికి కొరియన్ ఫాంటసీ, హారర్, కామెడీ అంశాలను జోడిస్తూ దర్శకుడు మేర్లపాక గాంధీ ఈ చిత్రాన్ని వినోదాత్మకంగా తెరకెక్కించారు సినిమా విడుదలైన తర్వాత ప్రేక్షకుల నుంచి ముఖ్యంగా కామెడీ ట్రాక్‌కు మంచి స్పందన లభిస్తోంది. ముఖ్యంగా వరుణ్ తేజ్ నటనతో పాటు కమెడియన్ సత్య పంచ్ డైలాగ్స్, కామెడీ టైమింగ్ ప్రేక్షకులను ఆకట్టు కుంటు న్నాయని సోషల్ మీడియాలో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


Edited, Printed, Published and Owned by Padakanti Venkateshwarlu, Printed at Sri Kanaka Mahalakshmi Web Offset, 39-33-86/3, Plot No. Mig-137, Madhava Dhara, Vuda Colony, Visakhapatnam -530018, Andhra Pradesh. Published At 49-14-16, Beside Ramakrishna Printers, 2nd Floor, Lalitha Nagar, Visakhapatnam-530016, Andhra Pradesh. Editor: Padakanti Venkateshwarlu, (RNI: APTEL/2013/50107). E-Mail: News9TeluguDailyAp@gmail.com. Cell 8331888861.